Tilak, Bal Gangadhar, 1856-1920

మృగశీర్ష, లేక, వేదకాల నిర్ణయము

బెజవాడ, 1923

Record no. 480

Tilak, Bal Gangadhar, 1856-1920

Mṛgaśīrṣa, lēka, vēdakāla nirṇayamu

Bejavāḍa, 1923

Record no. 480

Bibliographic Record Target

Tilak, 1921-1966.

మృగశీర్ష, లేక, వేదకాల నిర్ణయము / శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక మహాశయ కృతము ; మానికొండ సత్యనారాయణశాస్త్రిచే సంక్షిప్తాంధ్రీకృతము.- 1. ముద్రణము.- బెజవాడ : శ్రీ శారదా భాండార ముద్రాశాల, 1923.

3, 143, 5 p. :ill. ;19 cm.

Record no. 480

Tilak, 1921-1966.

Mṛgaśīrṣa, lēka, vēdakāla nirṇayamu / Śrī Lōkamānya Bālagaṅgādhara Tilaka mahāśaya kṛtamu ; Mānikoṇḍa Satyanārāyaṇaśāstricē Saṅkṣiptāndhrīkṛtamu.- 1. mudraṇamu.- Bejavāḍa : Śrī Śāradā bhāṇḍāra Mudrāśāla, 1923.

3, 143, 5 p. :ill. ;19 cm.

Record no. 480

సారస్వత నికేతనము, వేటపాలెం.

గ్రంధసంఖ్య. 409 954.0121 M3

ఈ గ్రంధమును యిందు క్రింద జూపబడిన యుండు తేదిలోపల వాపసు యివ్వవలెను.

26 OCT	1-12-81
4 1939	9.11.87
24 1939	
1.194[illegible]	
2.43	
9.43	
[illegible] 3 [illegible]	
[illegible]10.45	
[illegible]6.46	
2.9.47	
14-12-47.	
17-7-50	
12-8-50	
31-3-74	
7-2-78	

౭౧.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ ప్రచురణములు—౧.

మృగశీర్ష

లేక

వేదకాల నిర్ణయము

శ్రీ లోకమాన్య బాలగంగాధర
తిలక్ మహాశయ కృతము.

మానికొండ సత్యనారాయణశాస్త్రిచే
సంక్షిప్తాంధ్రీకృతము.

దీని వెల
రు ౧-౦

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి

ప్రథమ ముద్రణము
రుధిరోద్గారి: ౧౯౨౩
1923

బెజవాడ: శ్రీ శారదా
ముద్రాక్షరశాలలో ముద్రితము.

నేనీగ్రంథమును తెలుగున వ్రాసి చాలాకాలమైనది. నా వద్ద ధనము లేమిచే దీని నెట్లు ప్రచురింతునాయని యోచించుచున్న కాలమున — పూర్వము అమరావతీ పట్టణము రాజధానిగ జేసికొని ఆంధ్రమహీమండలము నవక్రపరాక్రమంబున పరిపాలించి, విద్వత్పోషణచే తమకీర్తిని దశదిశల వెలుంగ జేసిన శ్రీ శ్రీ వాసిరెడ్డి వేంకటాద్రినాయుడుగారి వంశీకులును, ప్రస్తుతము ముక్త్యేశ్వరపురము (ముక్త్యాల) నేలుచుండి తమకు వంశపారంపర్యముగ వచ్చుచున్న విద్వత్పోషణమే సహజాలంకారముగాగల శ్రీ శ్రీ చంద్రమౌళీశ్వర ప్రసాద్ బహద్దూర్ గారి యనుజన్ములును, సహజపాండిత్యధనులును, సరస్వతీ పత్రికాధిపతులును నగు శ్రీ శ్రీ వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాద్ బహద్దూర్ మన్నేసుల్తాన్ జయంతిపురం జమీందారుగారు సహజౌదార్యముతోడను, నిర్వ్యాజానురాగముచేతను, శ్రీ లోకమాన్యులందలి నిర్మలభక్తితోడను యీ గ్రంథముద్రణకు తాముగవచ్చి తోడ్పడుట నాకు మహా విచిత్రసంఘటనముగ గన్పట్టెను. శ్రీ లోకమాన్యుని ఆత్మయే పైనగాపుండి, నేచేయు యీ చిన్ని ప్రయత్నమందు ముచ్చటపడి, నన్నాశీర్వదింపనెంచి, శ్రీ రాజావారిని యీ రీతిగ ప్రేరేపించెనా యేమియని నాకిప్పుడప్పుడు సందేహముతోచుచున్నది. ఏ మహనీయునియందలి భక్తిశ్రద్ధలచే నేనీగ్రంథమును ఆంధ్రలోకమున కెరుక పరుప

దలచితినో, ఏమహనీయుని ఆశీర్వచనబలిమిచే యీ కార్యము నిర్విఘ్నముగ నెరవేరినదని నాకు దృఢనిశ్చయము కుదిరెనో, అట్టి శ్రీ లోకమాన్యుల వారి పవిత్రాత్మకీ గ్రంథము సంకితమొనర్చుచున్నాడను.

సద్యః కాలమునకువచ్చి తోడ్పడిన శ్రీ రాజా వారికి నేనును, ఆంధ్రలోకమునుకూడ, సర్వదా కృతజ్ఞులమై యుండక తప్పదు. శ్రీ వారికి దీర్ఘాయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధులొసంగి, సదా వారినిట్టి పవిత్ర కార్యములొనర్చుటకే ప్రేరేపింపవలసినదని శ్రీ లోకమాన్యుల పవిత్రాత్మనుగూర్చి ప్రార్థించుచున్నాను.

ఓం తత్ సత్ బ్రహ్మార్పణమస్తు.

శ్రీరుధిరోద్గారి సం॥
మార్గశిర శు ౭ లు
గురువారము,
బెజవాడ,
౧౩—౧౨—౨౩

ఇట్లు విన్నవించు విధేయుఁడు.
నూతికొండ సత్యనారాయణశాస్త్రి.
అనువాదకుఁడు

రాజపోషకులు

౧ శ్రీ శ్రీ వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వర ప్రసాద్ బహద్దూర్, మన్నెసుల్తాన్ జయంతిపురం జమీందారుగారు.

౨ శ్రీ శ్రీ రాజా కోటగిరి వెంకటకృష్ణారావు బహద్దరుగారు కంపలగూడెము.

3 శ్రీ శ్రీ వెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు.

*

విషయసూచిక

*


భూమిక

ఈగ్రంథమును శ్రీలోకమాన్య బాలగంగాధర తిలకుగారు ౧౮౯౨ సం॥ లండను నగరమున జరుగుచున్న ౯ వ. ప్రాచ్య మహాసభలో (9th Oriental Congress లో) నివేదించుటకై యొక చిన్న ఇంగ్లీషు వ్యాసముగ రచించిరి. పిమ్మట దీనిని విస్తరించి పుస్తకరూపముగ ప్రకటించిరి. దీనిపై పాశ్చాత్య పండితులొసంగిన యభిప్రాయముల నిందు బొందుపరుప యత్నించితిని. కాని, అవిసకాలమునకు నాకు అందకపోవుటచే వానినిందు ముద్రింపలేదు. వానినెట్లయినను సంపాదించి పర్యాయితీని పత్రికలలో ప్రచురింపగలను.


ఈ గ్రంథమును తెలిగించుటకు నాకెంతమాత్రమును అధికారము (సమర్థత) లేదని నేను తక్షణ మొప్పుకొని తీరవలెను. ఏలననగ:—నాకు జ్యోతిషశాస్త్ర జ్ఞానముగాని, ఋగాదివేద వాఙ్మయము నర్థము చేసుకొనగల సంస్కృత జ్ఞానముగాని లేదు. అయినను, యిట్టి అత్యుత్తమ గ్రంథము రచియింపబడి యిప్పటికి ముప్పది సంవత్సరములు దాటెనను యిట్టి గ్రంథ మొకటియున్నదను సంగతియే ఆంధ్రలోకమున కెరుకబడకపోవుట చాల విచారకరమని చింతించినవాడనై, శ్రీ భగవాన్ తిలకాచార్యులవారియందలి యపారమగు

భక్తి ప్రేమలచే, దీనినిక అజ్ఞాతముగ పడవేసియుంచుటకు సహింపజాలక—నా అసమర్థతనైనను గణింపక—దీనిని తత్క్షణమే తెలిఁగించి ప్రచురింప సాహసించితిని. నాకంటె సమర్థులైనవారీ గ్రంథ రచనకు గడంగినచో నెంతయో బాగుండెడిది. కాని, యింతవరకెవరును దీనినిగూర్చి యోచింపక పోవుటచే, నావంటి అసమర్థుడే దీనికి సాహసింప
5 వలసివచ్చెను. అయినను, యిందలి లోపములు నావిగను, సుగుణములు శ్రీ లోకమాన్యులవిగను భావించి ఆంధ్రలోకము నన్ను మన్నింతురుగాక.

ఈ గ్రంథ మొదలి విషయము బహు క్లిష్టమైనది. ఇది నవలవలె చదివి పారవేయదగినదికాదు. ముక్కకుముక్క తెలిఁగించి పెట్టినచో జనసామాన్యమున కర్థముకాదు. అందుచే, యిందలి విషయము ప్రతివారికిని సాధ్యమైనంత తక్కువ శ్రమతో అర్థమై పోవునట్లు సులభశైలిని చాలవరకు స్వతంత్రరీతిగనే వ్రాసితిని. వ్యాకరణ సూత్రముల నంతగ పాటింపలేదు. అందులకై నన్నుమన్నింపుడని వైయాకరణులకొక నమస్కారబాణము వదలుచున్నాడను. అసలు విషయమేమో తత్క్షణమే తెలిసికొనుటకై "విషయపరిచయ"మను చిన్నవ్యాసమునుకూడ ముందువ్రాసితిని కావున దానినిట విస్తరింప పనిలేదు.



ఇది బ్రహ్మాండగోళము. దీనిమధ్యబిందువు భూమి. సూర్యుడు రాశిచక్రము
నంటి సం॥ కొకచుట్టు చొ॥ బాణమును చూపినవైపుగ తిరుగును. విషువ
మువు రాశిచక్రమువెంట — తద్వ్యతిరిక్తమగు వైపునకు — షుమారు 26 వేల
సం॥ ల కొకచుట్టుచొప్పున తిరుగును. విషువద్బిందువు ఫలాని నక్షత్రము
...ను...డని నిర్ణయించినచో, తక్కిన మూడుపరిధానస్థానములును ఏ...న
క్షత్రములపద్దనుండెనో తత్క్షణమే నిర్ణయింపవచ్చును. దీనినిబట్టి హిమసంక
... తెలిసికొన...



1 శృంగిణ మశినచ్ఛ్ఛిష్ణ మింద్రః॥ ఋ ౧ 33, ౧౨ 2 యద్ధత్యం మాయినంమృగం తమఃత్వం మాయయావధీః॥ ఋ. ౧, ౮౦, 7 3 శిరో న్వస్య రావిషం॥ ఋ, ౧౦. ౮౬, ౫ 4 శ్వాన్వస్యజం శిషదపిం కర్ణే వరాహయుః॥ ఋ ౧౦ ౮౬, ౪ 5 యౌ తేశ్వానౌ యమరక్షితారౌ చతురక్షౌ పథిరక్షీ॥ ఋ ౧౦, ౧౪, ౧౧. శ్వానంబస్తో బోధయితార మబ్రవీత్సంవత్సర ఇదమద్యావ్యరవ్యత ఋ ౧ ౧౬౧, ౧౩

శ్వాపెషుపః: (వెండిడాడ్: 13,9) శ్వానెమ్ జైరితెమ్ చతుర్
చష్మెమ్ (వెండిడాడ్ 8;16)

విషయపరిచయము

పాశ్చాత్యపండితులు ఐగుప్తీయసభ్యతయొక్క యతి ప్రాచీనత నంగీకరించినను, వారింకను భారతజాతీయసభ్యతయొక్క యనాదిత్వము నంగీకరించుటలేదు. మన జాతియొక్క ప్రాచీనదశను గుర్తెరుంగుటకై మనకు వేదములు దక్క వేరొండుగ్రంథాధారము లేవియు గానరాకున్నవి. ఈ వేదగ్రంథము లెప్పుడు వెలువడినవో తెలిసికొనగలిగినచో, మనజాతి యెంత ప్రాచీనమైనదో మన మెరుకపడగలదు. మాక్సిముల్లరు మొదలగు పాశ్చాత్యపండితులు కేవలము సారస్వతప్రమాణములనే యాధారముగ గొని వేదకాలము క్రీ॥పూ॥ ౧౨౦౦ సంవత్సరములకంటె యెక్కువ కాజాలదని సిద్ధాంతముజేసిరి. కాని యీపద్ధతి సరియైనది కాదనియు ఖగోళమందు కర్మసూత్రముచే కట్టువడి నియమానుసారముగ తిరుగుచున్న జ్యోతిర్మూర్తుల చలనాదుల ప్రమాణముగ గైకొని యీవేదకాలమును నిర్ణయించుట యుక్తమనియు శ్రీలోకమాన్య బాలగంగాధర తిలక్‌గారు నిశ్చయించిరి. ఆప్రకారమే వేదగ్రంథములందచ్చటచ్చట చెదరిపడియున్న ఖగోళాంశములనెల్ల క్రోడీకరించి, వానినుండి నిర్దుష్టమగు సిద్ధాంతము నొకదానిని వెలువరించిరి. ఈ సిద్ధాంతమునుబట్టి తేలిన సారాంశమేమనగా, వేదకాలమును—దానిననుసరించి ఆర్యసభ్యతయొక్క ఆదిని—ఖండితముగ నిర్ణయించుటకు వీలులేదు. కాలగర్భములోనికి

పొచ్చుకొని పోగాపోగా, మనకు క్రీ॥పూ॥౪౦౦౦ సంవత్సరములవరకు ప్రబలప్రమాణములు గన్పట్టుచున్నవి; కాని వేదకాల మంతటితో ముగియలేదు. పైన యింకను పోవుటకు వీలున్నట్లు చిహ్నములు గన్పట్టుచున్నవి. ఎంతవరకు పోవచ్చునో మనము చెప్పజాలము. దానియొక్క కొన (లేక ఆది) కనిపించదు. ఏదికనిపించదో అది లేనట్లెంచవచ్చును. వేదములకు ఆదికనిపించలేదు కనుక వానికి ఆదియే లేదన్నారు. అనగా వేదములు 'అనాది' యన్నారు.

మనకు కనుపించని యీ 'ఆది'ని వదలివేసి మనకు గాన్పించుచున్నంతవరకుమాత్రమే పోయి చూచితము. ఇట్లు చూడగ వేదకాలమిప్పటికి ౬౦౦౦ సంవత్సరములకు తక్కువగాదని శ్రీలోకమాన్యులు నిర్ణయించిరి. వీరీవిషయమై చేసిన కృషినంతయు "మృగశీర్షా" యను గ్రంథరాజమందు పొందుపరచిరి.

ఈభూగోళ మొక యిరుసుమీద దినమునకొక చుట్టు చొప్పున తిరుగుచుండును. ఈ యిరుసునకు సూటిగ బ్రహ్మాండగోళమందు గాన్పించు నక్షత్రమునకు ధృవనక్షత్రమని పేరు. ఈ ధృవనక్షత్రమునకు సూటిగ ఖగోళమధ్యనుండిపోయి దానిని రెండు సమభాగములుగచేయు వలయమునకే "ఖగోళమధ్యరేఖ" యనిపేరు. మరియు సూర్యుడు సంవత్సరమున కొకసారి ఖగోళమందొకానొక వలయముమీదుగ పోవును. దీనికి రాశిచక్రమని పేరు. దీనియందు అశ్విన్యాది ౨౭ నక్షత్రములున్నవి. ఇవి సూర్యుని మార్గ

ములోని మైలురాళ్లు. ఇప్పుడు చెప్పినయీ "ఖగోళమధ్యరేఖయు" రాశిచక్రమును రెండుతావులలో కలియును. ఈ తావులకే "విషువను" లని పేరు, ఒకటి వసంతవిషువత్. రెండవది శరద్విషువత్. సూర్యుడు వసంతవిషువత్ లోనికి వచ్చినప్పుడు వసంతర్తువు ఆరంభమగును. రాత్రింబగళ్లు సరిసమానముగ నుండును. ఈ వసంతవిషువత్ చాల ముఖ్యమైనది. ఈవ్యాసమందు విషువత్ అనగా వసంతవిషువత్ అనియే యర్థముచేసికొనవలెను.

కొన్నికారణములచేత విషువత్ స్థానమునకు బహుసూక్ష్మమైన చలనముగలదు. విషువత్ బిందువు (Point) సూర్యునకభిముఖముగ షుమారు ౨౬ వేల సం॥ల కొకచుట్టు (360 డిగ్రీల) చొప్పున తిరుగును. అనగ, షుమారు ౭౨ సం॥ కొక డిగ్రీ చొ॥ రాశిచక్రమువెంట వెనుకకు తిరుగును. ఈ లెక్కప్రకారము ఋతువులు షుమారు ౨ వేల సంవత్సరముల కొకనెల చొ॥ వెనుకబడుచుండును. ఈ ప్రకారము పంచాంగముల నప్పటప్పటికి సంస్కరింపుచుండవలెను. ప్రస్తుతము మన పంచాంగములు విషువత్ రేవత్యంతమందున్నదను నూహతో వ్రాయబడుచున్నవి. కాని యీస్థితి యిప్పటిదికాదు. క్రీస్తుశకానంతరము షుమారు ౪౮౦ సంవత్సరములనాడు వరాహమిహిరుని కాలములో విషువత్ రేవత్యంతమందుండెను. ఆకారణముచేతనే, వరాహమిహిరుడు నక్షత్రమాలను అశ్వినితో ప్రారంభించి నూతన సంవత్సరాదిని వసంత విషువత్పన్న చైత్ర శు ౧ నాడు

ప్రారంభించెను. కాని యీ స్థితి యిప్పుడు మారిపోయినది. విషువత్ ఇప్పుడు రేవతీనికూడ గడచి షుమారు ౨౦ డిగ్రీలు వెనుకకు నడచినది. అనగ, వసంతఋతువు మనకిప్పుడు ౨౦ రోజులు వెనుకబడినదని చెప్పవచ్చును. అందుచేతనే మనకు ఫాల్గుణ మాసారంభముననే ప్రకృతియందు వసంతోదయ మగుచున్నది; కాని పంచాంగములు మాత్రము తదనుగుణముగ మార్పు చెందలేదు. కావున సిద్ధాంతులెల్లరును యీ యంశమును గుర్తించి ౧౪౦౦ సం॥ల నాడు వరాహామిహిరు డేర్పరచినదానినే పట్టుకొని వ్రేలాడక విషువన్ బిందువుయొక్క చలనమును, అది ప్రస్తుతమిప్పుడున్న స్థానమును గుర్తించి తదనుగుణముగ వసంతోదయమును నూతన సంవత్సరాదిని మార్పుచేయుదురుగాక యని మనవి చేసికొనుచున్నాను.

ఇప్పటికి ౧౪౦౦ సంవత్సరములనాడు విషువద్బిందువు అశ్వినీనక్షత్రముయొక్క ప్రారంభములో నుండెనని చెప్పితిమి. ప్రాచీనగ్రంథములను పరిశీలించి చూచినచో విషువత్ ఒకప్పుడు భరణిలోను, అంతకంటె పూర్వకాలములో కృత్తికలలోను, మృగశీర్షలోను, పునర్వసులోనుకూడ నున్నట్టు నిదర్శనములు గన్పట్టుచున్నవి. కనుక, యీవిషువత్ స్థానములనుబట్టి ఆయా ప్రాచీనగ్రంథములయొక్క కాలములను నిర్ణయింపవచ్చును. రాశిచక్రమందు ౨౭ నక్షత్రములున్నవి. కనుక, ఒక్కొక్క నక్షత్రముయొక్క యవధి 13⅓ డిగ్రీలగును. విషువత్ ఒకడిగ్రీ వెనుకకు జరుగుటకు

72 సం॥లు పట్టునని చెప్పితిమి. ఒక నక్షత్రమును గడుచుటకు విషువత్‌కు 13⅓×72=960 లేక షుమారు వెయ్యి సంవత్సరములు పట్టును. వేదాంగజ్యోతిషమను ప్రాచీన గ్రంథములో విషువత్ "భరణి"లో పదిడిగ్రీలలో నున్నట్లు చెప్పబడియున్నది. అనగ, వరాహామిహిరుని కాలమునుండి చూచినచో అశ్వినీనక్షత్రము 13⅓ లును + భరణిలో 10 డిగ్రీలును, మొత్తము 23⅓ డిగ్రీల దూరములో నున్నదన్నమాట. కనుక, యీ వేదాంగజ్యోతిషగ్రంథము వరాహామిహి*రుని కాలమునకు (అనగా 480 A. D. కి) 23⅓×72=1680 సంవత్సరములక్రిందట (అనగా, క్రీ. పూ. 1200 సం॥లనాడు) వ్రాయబడినదని తేలుచున్నది.

ఇదేరీతిగ తైత్తిరీయ సంహితాకాలమునాటికివిషువన్ కృత్తికలలో నున్నట్లు తెలియుచున్నది. అనగా, వేదాంగజ్యోతిషకాలమునకు 14⅓ డిగ్రీల దూరములో నున్నదన్నమాట. దీనినిబట్టి లెక్కవేసిచూడగా తైత్తిరీయసంహితాకాలము క్రీ. పూ. 2232 సం॥లు అని తేలుచున్నది. ఈ తైత్తిరీయ సంహితయందే విషువన్బిందువుయొక్క ప్రాచీనస్థానములు సూచింపబడినవి. వీనినిబట్టి విషువత్ ఒకప్పుడు మృగశీర్షలో నున్నట్లుచెప్పుటకు ఖండితమైన ప్రమాణములను శ్రీ లోకమాన్యులు చూపించిరి. అనగా, కృత్తికలనుండి 28⅔ డిగ్రీల దూరములో నున్నదన్నమాట. లెక్కప్రకారము క్రీ. పూ. 4320 సంవత్సరములగును. ఈసా[illegible]మును స్థిరపరచుటకే, అనగా, విషువత్ ఒకప్పుడు మృగశీర్షలో నుండెనని

నిరూపించుటకే, శ్రీ లోకమాన్యులీగ్రంథమం దెక్కువగ కృషిసలిపిరి. అందుచేతనే యీగ్రంథమునకు మృగశీర్షయని పేరు పెట్టిరి.

శ్రీలోకమాన్యు లంతటితో తృప్తిజెందలేదు. విషువర్ద్ స్థాన మొకప్పుడు 'మృగశీర్ష' కంటె యింకను ప్రాచీనకాలములో 'పునర్వసు' నక్షత్రములోకూడ నుండెనని నిరూపించుటకు యత్నించిరి. కాని దీనికి ఒకటి, రెండు నిదర్శనములు తైత్తిరీయసంహిత మొదలగు గ్రంథములందు గాన్పించినను, యీస్థానమును ఖండితముగ సిద్ధాంతీకరించుటకు తగినన్ని ప్రబల సాక్ష్యములు గానరామిచే వారు 'మృగశీర్ష' తోనే తృప్తిజెంది, పునర్వసు స్థానమును మాత్రము కొద్దిగ సూచించి, దీనిని స్థిరపరుచు భారమును భావిపరిశోధకులకు వదలివేసిరి. ఈపునర్వసుస్థానమును స్థిరపరచినచో వేదకాలము నింకను క్రీ॥ పూ॥ 6240 సం॥ల వరకు తీసికొనిపోగలము. ఈరీతిగ పరిశోధనలు చేసినకొలదియు వేదకాలము ముందునకు జరుగుచునే యుండును. దీనియొక్క 'ఆది' కానవచ్చుట బహుదుర్లభముగ నున్నది. దీనికి 'ఆది'యే లేదనికాదు! ఉన్నది. ఉండితీరవలెనని శ్రీలోకమాన్యుల యభిప్రాయము. కాని, యది కాలగర్భమున దెచ్చటనో మాయమైపోయినది. అందుచే మనకది గాన్పించుటలేదు; కనిపించనివస్తువు లేనట్లే. కనుక వేదములకు 'ఆది' లేదని మనవారనిరి.

వేదకాలము క్రీ॥ పూ॥ ౪౦౦౦ సం॥లకు తక్కువగాదని శ్రీలోకమాన్యులు సిద్ధాంతీకరించిరి. ఇంతటితో వేదకాల

నిర్ణయము పూర్తిగాలేదు. ఇంకపైన నెన్ని వేలసంవత్సరము లున్నదో తెలియదు. కాలగర్భమును త్రవ్వగ, త్రవ్వగ, శ్రీలోకమాన్యులు క్రీ॥ పూ॥ ౪౦౦౦ సం॥ల వరకు పోగలిగిరి. పైనయింకను పోవుటకు మార్గమున్నదని సూచించిరి. ఈ మార్గమువెంట కాలగర్భమును పెకల్చుకొనిపోయి, పోయి, వేదకాలముయొక్క 'ఆది'ని పట్టుకొనగల మహామహులెవరైననింక పుట్టుదురో పుట్టరో! అట్టివారుజన్మించువరకు వేదములు అనాదియనుమాట నిలిచియుండక తప్పదు.

మృగశీర్ష

లేక

వేదకాలనిర్ణయము

ప్రథమాధ్యాయము

సృష్ట్యాదినుండియు మానవకోటి యేయేరీతుల పరిణామమునొందెనో తచ్చారిత్రమునంతను దెలిసికొనుటకు మనకు వేదములుదక్క వేఱొండు ఆధారము లేమియుంగానరావు. గౌతమబుద్ధుని యవతారము, అలెగ్జాండరు దండయాత్రలు, అశోకుని శిలాశాసనములు, చైనాయాత్రికుల వ్రాతలు మొదలగునవి మనలను కొంతవరకు మాత్రమే తీసికొనిపోఁగలవు. కాని మనలను సృష్ట్యాదికిఁ గొనిపోఁగల సాధనము లీయొక్క వేదములే తక్క వేఱొండు గ్రంథములుగాని నిదర్శనములుగాని గానరావు. కనుక ప్రాచీనమహర్షులీవేదగానము నెప్పుడొనర్చిరో. యెన్నివేల సంవత్సరముల క్రిందట నొనర్చిరో నిర్ణయించుట చాలయవసరము. కాని యీపని బహుదుర్ఘటమైనది. ప్రాచీనకాలపు చరిత్రాంశములు మిక్కిలి యంధకారబంధురమై యేరికిని జ్ఞానశక్యముగ నున్నవి. అత్యధికమేధావంతులగు పండితులకే యీపని దుర్ఘటమైనట్లు తోఁచెను. వేదకాలమును నిర్ణయించుట కసలు సాధ్యమగునా? కాదా? యనుసంశయమే చాలమందికిఁ

కలిగెను. ఇట్టిదుర్ఘటకార్యమునకు నేనిప్పుడు పూనసాహసించితిని కాని నేనైనను యీయంశమును సమగ్రముగఁ బరిష్కరింపఁగలిగితి నని చెప్పఁజాలను. అయినను నేనీవిషయములో చేసినకృషిని నాపరిశోధనలను పండితులయెదుట ప్రసాదించుచున్నాను. వీనివలన వేదముల యతిప్రాచీనతను నిర్ణయించుట కేమైన సులభమార్గ మేర్పడునేమో పండితులే నిర్ణయించుకొందురుగాక.

వేదకాలనిర్ణయమునకై యిదివఱలో పాశ్చాత్యపండితులేయేమార్గముల నవలంబించియుండిరో మున్ముందు వానినిటఁ బరిశీలించి చూచెదముగాక. మేక్సుముల్లరుపండితుఁడు వేదవాఙ్మయమును నాలుగుభాగములుగ విభజించెను. అవి యేవనగ: ఛందస్సు, మంత్రము బ్రాహ్మణము, సూత్రము. ఈనాలుగుభాగములును క్రమముగ ఒకదానివెంబడి మఱియొకటి ప్రచారములోనికి వచ్చెనఁట; ఒక్కొక్కవిభాగము ౨౦౦ సంవత్సరములు ప్రచారములో నుండెనఁట; ఈ ప్రకారము చిట్టచివరిదియగు సూత్రభాగముపూర్తియగునప్పటికి ౨౦౦×౪=౮౦౦ సంవత్సరములు పట్టెనఁట; ఈసూత్రయుగము పూర్తి కాఁగానే బౌద్ధమతము ప్రబలెనఁట; బౌద్ధమతము క్రీస్తుకు పూర్వము నాలుగవశతాబ్దియందు ప్రబలెనఁట; కనుక వేదములు రచింపబడి మొత్తము క్రీస్తుకుపూర్వము ౪౦౦+౮౦౦=౧౨౦౦ సంవత్సరములకంటె యెక్కువ కాలముకాలేదని మేక్సుముల్లరుపండితుఁడు నిర్ణయించెను. (అనఁగ నిప్పటికి ౧౮౦౦+౧౨౦౦=3౦౦౦ సం॥లకంటె

నెక్కువకాలము కాలేదని యీపండితుని యభిప్రాయము. వేదవాఙ్మయము నీరీతిని నాలుగుభాగములుగ విభజింపవీలున్నదని యంగీకరించినను ఒక్కొక్కభాగమునకు ౨౦౦ సంవత్సరములకాలమునే యేల నిర్ణయింపవలెను? ఎక్కువ యేల నిర్ణయింపఁగూడదు? లేదా తక్కువ యేల నిర్ణయింపఁగూడదు? డాక్టరు హేగు అనుపండితుఁడు ఒక్కొక్కభాగమునకు ౫౦౦ సంవత్సరము లని నిర్ణయించెను. ఇది కేవలము ఊహించిచెప్పినమాట; ఊహకు మేరలేదు. రేపు ఇంకొకపండితుఁడు వచ్చి ఒక్కొక్కభాగమునకు వేయిసంవత్సరము లని చెప్పవచ్చును, కనుక కేవలము సారస్వతవిభాగముపై ఆధారపడి ఊహించిచెప్పెడియీపద్ధతి మన కంతగనుపకరింపదు. కనుక మన మింకొకమార్గము నారయవలసియున్నది.

వేదములందును, తదంగములందును అచ్చటచ్చటఁగొన్ని ఖగోళాంశములుగలవు. నక్షత్రములయొక్కయు, సూర్యచంద్రాదుల యొక్కయు గతులనుగూర్చి కొన్ని నిదర్శనములు వేద వేదాంగములందుఁ గలవు. వీనియాధారమున వేదకాలమును నిర్ణయించుటకు వీలుండునని కొంద ఊహించిరి కాని వారి యత్నములు సఫలత నొందలేదు. కారణ మేమనఁగ ఒక్క "వేదాంగజ్యోతిషము" తప్ప తక్కిన ఖగోళశాస్త్ర గ్రంథములన్నియు ప్రాచీనకాలపు సంస్కృతభాషలోఁగాక తదుపరి వెలువడినసంస్కృతభాషలో వ్రాయబడియున్న కారణముచే ఈపని

కష్టసాధ్యమయ్యెను. అదిగాక, గ్రీకులగణితపద్ధతి కూడ ఈగ్రంథములలో కొంతవఱకు అనుసరింపఁబడినది. అనేకగ్రంథములలో అనేకగణితపద్ధతులు అవలంబింపఁబడియున్నవి. విక్రమశకానంతరమున భారతవర్షమునం దనేకశకము లేర్పడెను. బార్హస్పత్యమాన మేర్పడెను. గ్రీకుల పద్ధతి ననుసరించి మేషాదిద్వాదశరాసు లేర్పడెను. ఇన్నియసందర్భముల కూటమిచే వేదవాఙ్మయమందు అచ్చటచ్చట చెదరిపడియున్న ఖగోళశాస్త్రసంబంధములగు వాక్యములకు సరియైనయర్థముచెప్పి వానికి ఏకవాక్యతను చేకూర్చి వానిలోనుండి నిర్దుష్టమైన సిద్ధాంతమును వెలువరించుట బహుకష్టసాధ్యమైనది. 'నక్షత్రములసంఖ్య యిరువదియేడా? లేక యిరువదియెనిమిదియా? అనువాదము వచ్చి యీపనిని మఱింత అయోమయముగఁ జేసెను. అదిగాక, అప్పటిబ్రాహ్మణులకు ఆకాశమునందుండు నక్షత్రాదుల నంతసూక్ష్మముగఁ బరిశీలింపఁగల తెలివితేటలున్నవాయను అనుమానము కొందఱిని బాధింపజొచ్చెను. ఈకారణముచేఁగూడ వేదకాలనిర్ణయమునకు కొంతఆటంకము గలిగెను.

ఇట్టిశంకలు మనస్సునం దుండుటచే ప్రాచీనగ్రంథములలోనున్న ఖగోళశాస్త్రసంబంధమగు వాక్యములను పాశ్చాత్యపండితు లెవరును నమ్మలేదు. వానిని పాటింపలేదు. ఈ పాశ్చాత్యపండితు లీవిషయములో అనవసరముగ భయపడిరని నానమ్మకము. అసలే కష్టములు లేవని కాదు- అప్రస్తుతమును అనవసరమును నగుచిల్లరయంశములనుగూర్చి వాద

ప్రతివాదములకు దిగుటచే పాశ్చాత్యపండితులు ప్రధానాంశమగు నీవేదకాల నిర్ణయమును గూర్చి తగినంతశ్రద్ధ వహించినట్లు గాన్పించదు. జ్యోతిషగ్రంథములలోను వేదసంహితులలోను నున్న యంశములను సమన్వయించి దానివలన వేదకాలనిర్ణయ మొనర్చుట కేమైన వీలున్నదో లేదో యని పాశ్చాత్యపండితులు యత్నింపనైనలేదు. మీదు మిక్కిలి యిట్టిప్రయత్నములవలన నెంతమాత్రమును లాభములేదని "వీబర్" పండితుఁడు వక్కాణించెను. కాని మన మింతమాత్రముచే నిరాశఁజెందవలసినపని లేదని యీగ్రంథమునందు వివరించెదను. వేదముల యతిప్రాచీనతను నిర్ణయించుటకు తగినన్ని నిదర్శనములు ప్రాచీనసంహితా గ్రంథములందుఁ గలవని ఋజువుపఱచెదను. నేను ముఖ్యముగ అతిపురాతన గ్రంథములగు సంహితాబ్రాహ్మణములను, ఋగ్వేదమును మాత్రమే ప్రమాణముగఁ గైకొందును. పురాతనగ్రంథములలోనియంశములను బలపఱచుటకుమాత్రమే యిటీవలిగ్రంథములను సాక్ష్యముగఁ గైకొందును. ప్రధానాంశములనన్నిటిని వేదసంహితులనుండియే ఋజువుపర్చెదను.

పాశ్చాత్యపండితులేగాక మనభారతవర్షీయులగు పండితులుకూడ యీవిషయమై కొంతకృషి సలిపియుండిరి. కీర్తిశేషులగు ఖుత్రి, కృష్ణశాస్త్రిగార్లును, శంకర బాలకృష్ణదీక్షితులుగారును ఈవిషయమై కొంతకృషి సలిపినమాట వాస్తవమే కాని వారిప్రయత్నములు తగినంత ప్రచారమునకు రాకపోవుట కడుశోచనీయము. నే నీగ్రంథములో చాల

భాగము వారుచేసిన కృషి ననుసరించియే సిద్ధాంతముఁజేసియుంటిని. ఒకవిధముగ నాయీప్రయత్నము వారుప్రారంభించినదానికి పూరణ మని చెప్పినఁజెప్పవచ్చును. అందుచే నేనీపండితుల కెంతయుఁ గృతజ్ఞుఁడను.

ద్వితీయాధ్యాయము

—♦ సంవత్సరము లేక యజ్ఞము ♦—

ప్రస్తుతము భారతవర్షమం దనేకవిధములగు కాలమానములు ప్రచారములో నున్నవి. చాంద్రమానము బార్హస్పత్యమానము సౌరమానము నక్షత్రమానము సవనమానము మొదలగునవి వివిధప్రాంతములలో ప్రచారములో నున్నవి. కొన్నిచోట్ల తిథులును మాసములును చాంద్రమానము ననుసరించియున్నవి. సంవత్సరముమాత్రము సౌరమాన మనుసరించి యున్నది. సాధారణదినములను తిథులతో సరిపుచ్చుటకును చాంద్రమాసములను సౌరమాసములతో సరిపుచ్చుటకును పలుతెఱగులగు క్లిష్టపద్ధతు లవలంబింపబడియున్నవి. కాని యోచించిచూడగ, ప్రాచీనకాలమం దిన్నిరకముల కాలమానము లున్నట్లు గాన్పింపదు. ఇవన్నియు నిటీవల ప్రబలినవి.

వేదకాలమం దున్న పంచాంగపద్ధతి యెట్లున్నదో తెలిసికొనుటకు మనకు వేదాంగజ్యోతిష మనుచిన్నిగ్రంథము దప్ప వేఱొండు ఆధారము లేమియు విశేషించి కానరావు. కనుక వేదకాలమునాటి పంచాంగపద్ధతిని తెలిసికొనుటకు మనకు రెండే ఆధారములు గలవు. ఒకటి:—వేదసంహితలయం దచ్చటచ్చట చెదరిపడియున్న ఖగోళశాస్త్రసంబంధమగు వాక్యములు గాని లేక రెండు:—అతిప్రాచీనములగు

యజ్ఞయాగాదికర్మకాండలలో నుదహరింపబడిన ఆచారవ్యవహారములు గాని మన కిప్పుడు ముఖ్యాధారములై యున్నవి. వేదములలోని ఋక్కులనుబట్టి చూచినచో ఆకాలమున యజ్ఞయాగాదికర్మకాండము విశేషముగ విజృంభించియున్నట్లు స్పష్టముగా గలదు. తిథి వార నక్షత్రములు మాసములు ఋతువులు మొదలగు కాలమానములు పూర్తిగ తెలిసిననేగాని యజ్ఞయాగాది కర్మకాండలు అంతవిరివిగ జరిగియుండజాలవు. కనుక యెప్పు డేయేక్రతువులను చేయవలెనో ఎప్పు డేయేకర్మకాండమును జరుపవలెనో స్పష్టముగ దెలిసికొనుటకు అప్పటివారికొక పంచాంగముండితీరవలెను. ఈపంచాంగము యొక్క సంపూర్ణస్వభావమును నిర్ణయించుట కష్టము. అయినను, మన పూర్వుల యజ్ఞయాగాదికర్మకాండలను పూర్తిగ బరిశీలించి చూచినచో ఈపంచాంగముయొక్క స్వభావమును కొంతవఱకు మనము గ్రహింపవచ్చును. అట్లు పరిశీలింపగ మనకు రెండు ప్రధానాంశములు గోచరించుచున్నవి. ఒకటి:—చంద్రునివృద్ధిక్షయములు, ఋతువులమార్పులు, సూర్యునిఉత్తరదక్షిణయానములు—ఇవన్నియు మనపూర్వుల కాలమానములో ప్రధానాంశములుగ గన్పట్టుచున్నవి; రెండు:—యజ్ఞాదిక్రతువులలోని ప్రధానాంశములే సంవత్సరమునకు గూడ ప్రధానాంశములుగ గన్పట్టుచున్నవి. ఐతరేయబ్రాహ్మణమున కుపోద్ఘాతము వ్రాయుచు కీర్తిశేషుడగు హౌగు పండితుడిట్లు వచించియున్నాడు:— "సంవత్సరముపొడు

గునను జరుగు సత్రములు (అనగ యజ్ఞములు) కేవలము సూర్యుని వార్షికగమనమునకు సరియైన నకలని చెప్పవచ్చును. ఈసత్రము లన్నియు రెండుభాగములుగ విభజింపబడినవి. ఒక్కొక్క భాగము ఆఱుమాసములవఱకుండును (మాసమునకు ముప్పది దినములు) ఈరెండుభాగములకును నడుమ “విషువత్” గలదు. (“విషువత్” అనగ మధ్యదినము.) ఈదినము ఈసత్రము నంతటిని రెండుసమభాగములుగ విభజించుచున్నది. కనుక మనఋషీశ్వరులు యజ్ఞయాగాదిక్రతువులను నడుపుకొనుటకే పంచాంగమును నిర్ణయించుకొనిరని స్పష్టమగుచున్నది. మఱియు ఈక్రతువులను కాలమానప్రకారము నడుపుకొనుటచేత పంచాంగనిర్మాణముకూడ దానియంతటయదియే జరుగుచుండెడిది. ఈవిధముగ పంచాంగముచేత క్రతువులును క్రతువులచేత పంచాంగమును అన్యోన్యాశ్రయముగ నడచుచుండెడివి. సాయంప్రాతముల యందును పూర్ణిమామావాస్యలయందును, ఋతుప్రవేశములయందును అయన ప్రవేశములయందును హోమములును బలులును అర్పింపబడెడివి. [బౌ. సూ. II, 4-23. అగ్న్యాధేయ ప్రభృత్యథేమాన్య జస్రాణిభవంతి. యత్రైతదగ్న్యాధేయమగ్నిహోత్రం దర్శపూర్ణమాసావాగ్రయణ ముదగయన దక్షిణాయనయోః పశుశ్చాతుర్మాస్యాన్యృతుముఖే షడ్ఢోతా వసంతే జ్యోతిష్టోమ ఇత్యేవం క్షేమప్రాపణం॥—]

ఈరీతిని క్రతువులన్నియు పూర్తికాఁగానే సంవత్సరము కూడ పూర్తియయ్యెడిది. ఆకారణముచేతనే, “సంవత్సర

ము,” “యజ్ఞము”— అనురెండుపదములును సమానార్థకము లయ్యెను. “సంవత్సర” మన్నను, “యజ్ఞ” మన్నను ఒక్కటే అర్థమని సంహితాబ్రాహ్మణములయం దనేకస్థలముల ఘంటాపథముగ వక్కాణింపఁబడియున్నది. [ఐ. బ్రా. II, 17. సంవత్సరః ప్రజాపతిః ప్రజాపతిర్యజ్ఞః॥

తై. సం. II, 5, 7, 3. VII, 5, 7, 4. యజ్ఞో వై ప్రజాపతిః॥

VII. 2, 10, 3. సంవత్సరః ప్రజాపతిః॥

ఈవాక్యములను సమర్థించుటకు నేను పైనఁ జెప్పిన సిద్ధాంతముదక్క వేఱొండుసమాధానము గానరాదు.

కనుక వేదకాలమునాఁటి ఋషులు తమగృహములలో సదా అగ్నిహోత్రము నుంచుకొనెడివా రనియు, ఆయగ్నిహోత్రమునందు సంవత్సరముపొడుగునను హోమము లర్పించుచు, కాలమానము ననుసరించి క్రతువు లొనర్చుచుండెడివా రనియు, ఈక్రతువుల ననుసరించి తమపంచాంగమును కాపాడుకొనుచుండెడివారనియు నాయభిప్రాయము. బ్రాహ్మణములలో విరివిగ వర్ణింపఁబడిన విపులమగుకర్మకాండమంతయు తదుపరి పెరిగియుండవచ్చును. కాని, ప్రధానాంశమగు వార్షికయజ్ఞములుమాత్రము చాల పురాతనము లైనవనుమాట స్పష్టము. ఋత్విజ్ (ఋత్+యజ్) అను

పదముయొక్క వ్యుత్పత్త్యర్థముకూడ దీనినే బలపఱుచుచున్నది. ఋతువులకును, యజ్ఞములకును సన్నిహితసంబంధమున్నట్లు స్పష్టమగుచున్నది. దీనినిబట్టి సంవత్సరమునకును యజ్ఞమునకునుగూడ సంబంధమున్నదని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. "సంవత్సర"పదముయొక్క వ్యుత్పత్త్యర్థ మేమి? (వస్=నివసించు) అనఁగ ఋతువులు వసించుకాలపరిమాణమునకు "సంవత్సర" మని పేరు. పూర్వము యాజ్ఞికులకు యజ్ఞములు చేయుటయేగాక, కాలమానాదుల దెల్పుపంచాంగమును సంరక్షించుటకూడ విధ్యుక్తధర్మముగ నుండెను. పూర్వము రోమకసామ్రాజ్యములోగూడ పంచాంగమును సంరక్షించు బాధ్యత మతగురువుల యందే యుండెను. ఇది యొకపవిత్రకార్యముగ భావింపఁబడెడిది. కనుక, పూర్వము మనయాజ్ఞికులు ఈరెండుధర్మములను సమన్వయించి సంవత్సరముపొడుగునను వచ్చుక్రతువులను సంవత్సరములో ప్రధానదినములందే ప్రారంభించెడివారు. ఈరీతిని క్రతువులచే కాలమానము నడచుచుండెడిది. కాని, యిటీవల కాలమానమును నిర్ణయించుటకు ఉపాయాంతరములు ప్రబలుటచే యీక్రతువులకు కాలమానమును నిర్ణయించుపని తప్పిపోయెను. అప్పటినుండి క్రతువులును కాలమానమును వేఱగుటయు, ఈరెండును స్వతంత్రరీతుల పలుతెఱఁగు లగుపరి

ణామములఁ బొందుటయు తటస్థించెను. అప్పటినుండియే యజ్ఞయాగాదులలో కర్మకాండమంతయు పలురీతుల పెరిగిపోయెను. కనుక, వార్షికసత్రములే పంచాంగముయొక్క ప్రథమదశ యని సిద్ధించుచున్నది. సంవత్సరములోని వివిధ విభాగములనుగూర్చి యోచించుదము.

(౧) సవనమానము:—"సవన" దినము స్వాభావికమగు కాలపరిమాణముగఁ గైకొనఁబడినది. (సవనదినమనగ సూర్యోదయము మొదలు మరల సూర్యోదయమువఱకు). ఇది మన మామూలుదినము. 30 సవనదినములు కలిసి ఒకసవనమాసమగును. ౧౨ సవనమాసములు లేక ౩౬౦ సవనదినములు కలిసి ఒకసవనసంవత్సరము.

(౨) చాంద్రమానము:— వ్యుత్పత్త్యర్థమునుబట్టి చూచినచో మాసమునకును చంద్రునకును సన్నిహితసంబంధమున్నట్లు స్పష్టమగుచున్నది. కనుక చంద్రునిగతినిబట్టియే మాసములు నిర్ణయమగుచువచ్చెను. చంద్రమాసగతినిబట్టి (అనగ చాంద్రమానమునుబట్టి) నెలకు ముప్పదితిథులు; సంవత్సరమునకు ౩౬౦ తిథులు. తిథికిని మామూలుగ మనముచూచు సవన దినమునకును భేదమున్నది. ౩౦ తిథులకంటె 30 సవనదినములు ఎక్కువగుచువచ్చెను. కనుక, యీరెంటిని సరిచేసుకొనుటకై కొన్నిసవనమాసములలో ఒక్కొక్కదినమును తగ్గించవలసివచ్చెను [తై॥సం॥ VII, 5, 7, 1. ఉత్సృజ్యాం౨ నోత్సృజ్యామితి మీమాంసంతే బ్రహ్మవాదినః॥]

ఈరీతిగ మొత్తముమీద ఆఱు సవన దినములు తగ్గింపఁబడెను. కనుక 354 సవన (మామూలు) దినములు=360 తిథులు.

(3) సౌరమానము:— ఇంతటితో పూర్తి కాలేదు. ఈ చాంద్రమానమును సౌరమానముతో సరిపుచ్చుకొనవలెను. సౌరమానమనఁగ సూర్యునిగతినిబట్టి నిర్ణయింపఁబడు మానము. సూర్యుఁడు ఒకచుట్టు తిరిగివచ్చునప్పటికి ౩౬౬ సవన దినములు పట్టును. (అనఁగ, సూర్యుఁడు ఆలస్యముగ తిరుగును.) ఆకాలమునాటి కింకను మేషాదిరాసులు మనగణితములోనికి రాలేదు. ఇవి గ్రీకుసంపర్కమునుండి వచ్చినవి. కనుక, సౌరమాసములు ఇప్పటివలె మేషమాస మనియు, వృషభమాసమనియు లెక్కింపఁబడుచుండుట లేదు. అప్పుడు సౌరమాసములు కేవలము ఋతువుల మార్పులనుబట్టియే యుండెడివి. ఏదో ఒకఋతువుతో సంవత్సరము ప్రారంభమయ్యెడిది. తక్కినఋతువు లన్నియుక్రమముగ పూర్తియై తిరిగి ఆఋతువు వచ్చినప్పుడే మరల సంవత్సరము ప్రారంభమయ్యెడిది. ఇది సౌరమానపద్ధతి. ఈప్రకారము సౌర సంవత్సరము పూర్తియగునప్పటికి ౩౬౬ మామూలు దినములు పట్టునని చెప్పియుంటిని. చాంద్రసంవత్సరమునకు ౩౫౪ దినములే యనికూడ చెప్పియుంటిని. కనుక యీరెండు రకముల సంవత్సరములకును (౩౬౬—౩౫౪) ౧౨ దినములు భేదమున్నది. అనఁగ చాంద్రవత్సరము సౌరసంవత్స

రమునకంటె ౧౨ దినములు ముందుగనే పూర్తియయ్యెడిది. కనుక దీనిని సౌరసంవత్సరముతో సరిచేసికొనుటకై చాంద్ర సంవత్సరమునకు ౧౨ దినములు అధికముగ కలుపవలసి వచ్చెను. ఈరీతిగ చాంద్రసౌరమానములను సరిచేసికొనుటకై అధికదినములను లేక అధికమాసములను చేర్చుకొనవలసివచ్చెను. ఋగ్వేదమునందును, తైత్తిరీయ, వాజసనీయ సంహితలయందును అధికమాసములనుగూర్చి స్పష్టముగఁ జెప్పఁబడియున్నది [తై. సం. I. 4, 14; వాజసనేయసంహితా 7, 30; ఋ. I, 25, 8: ఋ. IV, 33, 7; అథ. వే. IV, 11, 11, తై. బ్రా.,I, 1, 9, 10.]

సౌరచాంద్రమానములకు ౧౨ దినములు భేదమున్నది. దీనినే, ఋ. I, 33 లో ఇట్లు వర్ణించియున్నారు. ఋతువుల కధిష్ఠానదేవతలగు "ఋభువులు" తమగమనవేగమును తగ్గించుకొని సంవత్సరముపొడుగునను తాము పడినశ్రమనంతను బాపుకొని, సూర్యుని దయవలన కొంతకాలము హాయిగ సుఖించుచున్నారు." మఱియు, అథర్వవేదము [IV, 11, 11] లో నిట్లని వర్ణింపఁబడినది. "యజ్ఞాధిష్ఠానదేవతయగు ప్రజాపతి ప్రాతసంవత్సరపు యజ్ఞమును పూర్తిచేసిన పిమ్మట, తిరిగ క్రొత్తసంవత్సరపు యజ్ఞమునకై కావలసిన యేర్పాట్లను చేసికొనుటకు కొంతవ్యవధి గావలె"నట. సౌర [illegible]దమానములకుగల ౧౨ దినములవ్యత్యాసమే యీ [illegible]ధి యని యెఱుంగవలెను. ఈ ౧౨ దినములను మన [illegible]ు యజ్ఞానకర్మకాండలలో వదలిపెట్టకుండ తీసికొనియే

వచ్చుచున్నారు. సంవత్సరయాగములను చేయఁదలచుకొనిన వా రెవరైననుసరే ౧౨ దినములు (ద్వాదశాహము) యజ్ఞోపక్రమణపూర్వకముగ కొన్నికర్మలను చేయవలెనని మనవారు నియమించియున్నారు. కనుక, సౌరచాంద్రమానములను సరిపుచ్చుటకు మనవారొక యుపాయమును కనిపెట్టి గలిగి రనుట స్పష్టము. ఏసంవత్సరమున కాసంవత్సరము చివరనే యీ ౧౨ దినములను కలిపెడివారా? లేక వీని నన్నిటిని చేర్చి ఒకపర్యాయమే—ఒక అధికమాసముగ ఏర్పాటుచేసెడివారా? అనునది వివాదాంశము. కాని నాకుఁ జూడగ, పూర్వము ఏసంవత్సరమున కాసంవత్సరము చివరనే యీ ౧౨ దినములను కలుపుచుండెడివా రని నాయభిప్రాయము. ఏల ననఁగ; అప్పటి వార్షికయజ్ఞములనుబట్టి చూడగ ఈపద్ధతియే ప్రచారములో నుండియున్నట్లు గాన్పించుచున్నది.


సౌరచాంద్రమానములకుఁ గలయీభేదమును గనుఁగొని సరిపుచ్చుకొనగల తెలివితేటలు ప్రాచీనపుటార్యులకు లేవని వీబరు మొదలగు పాశ్చాత్యపండితులు ఆక్షేపించుచున్నారు. నిజపరిస్థితులు కండ్లకుఁగట్టినట్లు స్పష్టముగఁ గాన్పించుచున్నను, శంకాకళంకితదృష్టితోఁ [illegible]క్షితు కవిగాన్పింపకపోవుట బహువి[illegible]

చంద్రునిగతినిబట్టి మాసముల నిర్ణయించు[illegible], సూర్యునిగతినిబట్టి సంవత్సరముల నిర్ణయించుకొను[illegible], యీరెంటికిఁ గలభేదమును ఋతువులమార్పుచేఁ గనిపెట్టుచు

యీభేదమును అధిక దినములచేగాని, అధికమాసములచే గాని సరిపుచ్చుకొనుచు, మనప్రాచీనపుటార్యులు కాలమానాదులఁ దెలిసికొనుచుండెడివా రని నాతాత్పర్యము. వేదకాలమునాఁటి పంచాంగపద్ధతి యిదియే యని నాయభిప్రాయము.

సౌరమానముకూడ స్థిరమైనది కాదు. దీనిలోఁగూడ రెండువిధములసంవత్సరము లున్నవి. ఇట్లు రెండువిధము లుండుటకు కారణమేమో దెలిపెదను. ఖగోళమధ్యరేఖయు, రాశిచక్రమును కలియుచోటికి "విషువత్" అనిపేరు. అది ఒకబిందువు (Point) మాత్రమే. ఈవిషువత్ యొక్క విశేష మేమనఁగ; — సూర్యుఁడీ 'విషువత్' వద్ద నున్నప్పుడు రాత్రింబవళ్ళు సమానపరిమితిగల వగును; వసంతర్తువు ప్రారంభమగును. ఈ విషువత్ బిందువు స్థిరమైనదిగాదు. దీనికి చలనము గలదు. ఉత్తరధ్రువమును, దాని ననుసరించి ఖగోళమధ్యరేఖయు చలింపుచుండుటచే ఈ విషువత్ బిందువుకూడ రాశిచక్రమువెంట సంవత్సరమునకు ౫౦ సెకండులచొప్పున వెనుకవైపునకు నడచుచుండును. ఈవిషువత్ చలనమునుబట్టి రెండురకముల సంవత్సరము లేర్పడుచున్నవి. (౧) సూర్యుఁడేచోటనుండి బయలుదేరెనో, తిరిగి ఆచోటికి వచ్చుటకు పట్టుకాలము — (Sidereal year — యథాస్థానికవత్సరము) (౨) వసంతర్తువు మొదలు తిరిగివసంతర్తువు ప్రారంభమగువఱకు పట్టుకాలము — (అనఁగ) విషువత్ నుండి, తిరిగి విషు

వర్షావటకు పట్టుకాలము. — (Tropical year: వాసంతిక వత్సరము.)



అ: అనునది అశ్వనీనక్షత్ర మనుకొనుము. వి.౧ అనునది విషువత్ బిందువుయొక్క మొదటిస్థానమనుకొనుము. ఈరెండును ఒకచోట నేయున్నవనుకొనుము సూర్యుడు కూడ అ. వి౧ చోటనేయున్నాం డనుకొనుము. సూర్యుడువిషువత్ బిందువులో నుండుటచే రాత్రింబవళ్లు సమానముగ నుండును; వసంతర్తువు ప్రారంభమగును. ఇదియే సంవత్సరాది యనుకొందము. సూర్యుడు సంవత్సరాదినాడు (అ, వి౧) నుండి బయలుదేరి బాణముచే చూపబడినవైపుగ దిరుగుచు కొంతకాలమునకు (షుమారు ౩౬౫ దినములకు) తిరిగి అ వి౧ అనుచోటికి చేరును. ఇది మొదటి రకము సంవత్సరము (Sidereal year: యథాస్థానికవత్సరము) ఇక రెండవరకపు సంవత్సర మేదనగ సూర్యుడు బాణము చూపువైపునకు దిరుగుచుండగా, విషువత్ బిందువు వెనుకవైపునకు మెల్లగ జరుగుచుండు నని చెప్పియుంటిమిగద

కనుక సూర్యుడు తనసంచారములో విషువత్ బిందువును (వి ౨) అనుచోటనే— అనగ మొదటతాను బయలుదేరిన అ వి ౧ చోటికి రాకపూర్వమే, అనగ అది యింకను ౫౦ సెకండులదూరములో నున్నదనగనే కలుసుకొనుచున్నాడు. సూర్యుడు విషువత్ బిందువును వి ౨ అనుచోటనే కలుసుకొనుటచేత, తత్క్షణమే, అచ్చటనే, సమరాత్రులును, వసంతర్తువును ప్రారంభమగుచున్నవి. కనుక, మొదట వసంతర్తువు వి౧ వద్ద నుండగ నైనను, ఇప్పుడు వి౨ వద్ద నుండగనే మైనది. కనుక, ఋతువులనుబట్టి చూచినచో, మొదటివసంతమునకును, రెండవ వసంతమునకును మధ్య ౫౦ సెకండుల దూరము భేద మున్నది. అనగ, (౨౦ ని. ౨౪ సె) కాలమ్ము భేద మున్నది. ఈప్రకారము చూచినచో మొదటిరకపు యథాస్థానికవత్సరమునకును, రెండవ రకపు వాసంతిక వత్సరమునకును, ౨౦. ౪ నిమిషములభేద మున్నది. అనగ, ఋతువులుసంవత్సరమునకు ౨౦. ౪ నిమిషముల కాలము వెనుకబడుచుండును. దీనినిబట్టిఋతువులు షుమారు రెండు వేల సంవత్సరములకొక నెలచొప్పున వెనుకబడుచుండును. అనగ, నిప్పుడు వసంతర్తువు చైత్ర శుద్ధ పాడ్యమినాడు ప్రారంభమైన దనుకొందము. ఇంక రెండువేలసంవత్సరములకు ఫాల్గుణ శుద్ధపాడ్యమినాడే వసంతర్తువు ప్రారంభమగునని తాత్పర్యము. కనుక ఋతువులను రెండువేలసంవత్సరముల కొకపర్యాయము ఒకనెలచొప్పున వెనుకకు నెట్టుకొనుచుండవలెను. లేనిచో పంచాంగములుతప్పును.


ఇప్పుడు బయలుదేరిన సమస్య యేమనఁగ:—పూర్వము వేదకాలమునంటి ఋషులకు ఈరెండు రకముల సంవత్సరములు దెలియునా? లేక ఒకరకమే దెలియునా? రెండురకముల సంవత్సరము లేర్పడుటకు విషువద్బిందువుయొక్క చలనమే కారణముగద. ఈచలనము బహుసూక్ష్మమగుటచే ఆదియందు మనయార్యులు దీనినిగుర్తించియుండకపోవచ్చును కొన్నివందల సంవత్సరములు గడచినఁగాని ఋతువులలో భేదమున్నట్లు గాన్పింపదుగద. ఋతువులలో బాహ్యదృష్టికి బాగుగ గోచరమగునంతభేదము గలిగినప్పుడు మనవారు దీనిని తప్పక గుర్తించిరి. దీనిని గుర్తించినప్పుడు మనయార్యుల కెంతటియాశ్చర్యమును, ఆనందమును గలిగెనో యెవనికెఱుక!

కాని, ఆదికాలమందు మనవారు మొకటిరకపు (యథాస్థానిక) వత్సరమునుమాత్రమే యెఱిఁగియుందురు. సూర్యుఁడొకస్థానమునుండి బయలుదేరి తిరిగి యాస్థానమునకెప్పుడు వచ్చునో అదియే సంవత్సరప్రమాణముగ వారు గ్రహించిరి. ఎట్లనగ, వారు ప్రతియుదయమునను సూర్యునకు సమీపమందున్న నక్షత్రమును గుర్తించుకొనుచుండెడివారు. తిరిగి సూర్యుఁడానక్షత్రమువద్ద కెప్పుడువచ్చునో అప్పుడే సంవత్సరము పూర్తియయ్యెనని వారు తలచుచుండెడివారు. [తై. బ్రా. I. 5, 2, 1—యత్పుణ్యం నక్షత్రం తద్బ

ట్కుర్వీతోపవ్యుషం। యదా వై సూర్య ఉదేతి। అథ నక్షత్రం నైతి। యావతి తత్ర సూర్యో గచ్ఛేత్। యత్ర జఘన్యం పశ్యేత్। తావతి కుర్వీత। యత్కారీ స్యాత్। పుణ్యాహ ఏవ కురుతే॥]— ఈవాక్యములనే మనవారు ఇప్పటికిని పుణ్యాహవాచనకర్మయందు పఠింపుచుందురు. కాని రానురాను బాహ్యదృష్టికిఁ గాన్పించు వసంతాదిఋతువులు వెనుకఁబడుచుండుటచే వారు "సంవత్సరాది"ని రెండుమూఁడుపర్యాయములు వెనుకకు నెట్టుకొనవలసివచ్చెను. వారీప్రకారము సంవత్సరాదిని వెనుకకు నెట్టుకొన్నట్లు స్పష్టముగ నిదర్శనములుఁగలవు. ఈఋతువు లిట్లు వెనుకఁబడుటకు కారణమేమో వారూహించియుందురు. ఇట్లూహించినపిమ్మట దీనికిఁగల నిజమైనకారణము "విషువత్" యొక్క చలనమే యని తెలిసికొనియుందురు. అటుపిమ్మట దానియొక్క గతినికూడ నిర్ణయించియుందురు. [దానియొక్క గతి సంవత్సరమునకు ౫౪ సెకండులని మనయార్యులు నిర్ణయించిరి. ఇప్పటిపాశ్చాత్యులు కొందరు ౫౦.౨౪ సెకండుల నిర్ణయించిరి. గ్రీకులు ౩౬ సెకండులని నిర్ణయించిరి.]

దీనిపిమ్మట మనము యోచింపవలసిన సమస్యయేమనగ:- ప్రాచీనకాలమందు నూతనసంవత్సరము నెప్పుడు ప్రారంభించెడివారు? పూర్వము "సంవత్సరము," "యజ్ఞము" అనుపదములు రెండును సమానార్థకములుగ నుండెడివని పైన దెలిపియుంటిమి. కనుక, ఒకదానియొక్క ప్రారంభమే రెండవదా

నికికూడ ప్రారంభ మగునని మన మూహించవచ్చును.



సూర్యుడు హిమసంక్రమణమునం దుండగ నూతనసంవత్సరము ప్రారంభమయ్యెడి దని వేదాంగ జ్యోతిషములో చెప్పఁబడియున్నది,

“గవాంఅయనం” మొదలగువార్షికసత్రములుకూడ ఆసమయమందే (హిమసంక్రమణమందే) ప్రారంభము గావలయునని శ్రౌతసూత్రములు పల్కుచున్నవి. అదిగాక, ‘దేవ

కర్మలన్నియు ఉత్తరాయనములోనే జరుగవలయు నని జైమినిమొదలగువారు సూచించియున్నారు, (ఉత్తరాయనమనగ హిమసంక్రమణము మొదలు గ్రీష్మసంక్రమణమువరకు గల కాలమని జ్యోతిషగ్రంథములు పల్కుచున్నవి) దీనినిబట్టి సంవత్సరము, యజ్ఞము, ఉత్తరాయణము — యీ మూఁడును హిమసంక్రమణమువద్దనే ప్రారంభ మగుచున్నట్లు గాన్పించుచున్నది. ఈస్థితి ప్రాచీనకాలమునుండి యున్నదో, లేక తదుపరి వాడుకలోనికివచ్చినదో చూడవలెను. దీనిలోని నిజానిజములను మనమిప్పుడు సూక్ష్మముగ పరిశీలించి చూడవలెను.

వార్షికసత్రముయొక్క మధ్యదినమునకు ‘విషువత్’ దినమని పేరు. ‘విషువత్’దినము సంవత్సరమును రెండుసమభాగములుగ విభజించుచున్నట్లే, యీమధ్యదినముకూడ ఈసత్రమును రెండుసమభాగములుగ విభజించుచున్న దని స్పష్టముగ వర్ణింపఁబడియున్నది. [ఐ. బ్రా IV, 22, తై. బ్రా. I,2, 3, 1 — తం. బ్రా, IV, 7, 1] కనుక సత్రము (లేక యజ్ఞము) అనగ సంవత్సరమునకు నకలని చెప్పవచ్చును. ‘విషువత్’ అనఁగ సమరాత్రింబగళ్లని అర్థము [Equinox = Equal nights & days] పైనచెప్పినప్రకారము ఆదికాలమున హిమసంక్రమణమునందే సంవత్సరము ప్రారంభమైయుండినయెడల, విషువత్ దినము సంవత్సరము మధ్యమందు వచ్చుటకేవలము అసంభవమగును. ఆరీతిగనే యజ్ఞముయొక్కమధ్యమదినముకూడ విషువత్ దిన మగుట

అసంభవ మగును. కనుక, దీనినిబట్టి సంవత్సరములు సత్రములునుకూడ వసంతవిషువత్తువద్దనే ప్రారంభమై యుండి యుండవలెను. సంవత్సరముగాని, సత్రముగాని (వసంత) విషువత్తువద్ద ప్రారంభమైనచో శరద్విషువత్‌దినము ఈరెంటికిని మధ్యదిన మగును. అప్పుడే పైవర్ణనకు సరియైనసమాధానము కుదురును.

ఇక ఉత్తరాయణ మనుపదమునకు నిజమైనఅర్థమేమో విచారించిచూచెదముగాక. దీనికి రెండువిధములుగ అర్థము చెప్పుటకు అవకాశ మున్నది. "దక్షిణపుకొననుండి ఉత్తరమువైపునకు నడుచుట" అనిగాని, లేక "ఉత్తరార్థగోళమందు సంచార మొనర్చుట" అనిగానిచెప్పవచ్చును. మొదటియర్థము సంగీకరించినచో ఉత్తరాయణము హిమసంక్రమణములో ప్రారంభమగు ననియు, నూతనసంవత్సరముకూడ అప్పుడే ప్రారంభమగుననియు తాత్పర్యము. ఇక రెండవయర్థము నంగీకరించినచో ఉత్తరాయణమును, దాని ననుసరించి నూతనసంవత్సరమునుకూడ వసంతవిషువత్‌వద్ద ప్రారంభ మగుననియు తాత్పర్యము. ఈరెంటిలో దేని నంగీకరింపవలెను? వార్షికసత్రముయొక్క మధ్యమదినమునకు "విషువన్" దినమని పేరిడుటచేతను, ఋతువులలో వసంతర్తువు ప్రథమఋతు వని యంగీకరించుటచేతను, [తై. బ్రా. I. 1, 2, 6— ముఖంవా ఏతదృతూనాం యద్వసన్తః] ఆగ్రయణేష్టుల ననగ పాగ్మాన క్రతువులను వసంతశరదృతువులలో నాచరింపవలె నని

విధించుటచేతను, ఉత్తరాయణ మనుపదమునకు రెండవయర్థమే యంగీకార్యమని సిద్ధించుచున్నది.

అయినను ఈయంశమునే యింకనుసూక్ష్మముగ విచారించి చూచెదముగాక. వేదసంహితలయందు ఉత్తర దక్షిణాయనములకుమారుగ దేవ, పితృ, యానములు వర్ణింపబడియున్నవి. బృహదారణ్యకోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తులలోకూడ వీనిని విపులముగ వర్ణించిరి. దేవయాన మనగ దేవతలమార్గ మనియు ఇచ్చట సదా పగ లనియు, కావలసినంత వెలుతురు, అగ్ని యుండుననియు, సూర్యుడు ఆరునెలలు ఉత్తరముగ నుండుననియు వర్ణించిరి. పితృయాన మనగ పితరులమార్గమనియు, ఇచ్చట సదా రాత్రిగనుండి, చీకటిగను, ధూమావృతముగను ఉండుననియు, ఇచ్చట సూర్యుడు దక్షిణముగ నుండుననియు వర్ణించిరి. ఉత్తరాయణమును భగవద్గీతలలోకూడ వర్ణించియుండిరి. ఈవర్ణనలకన్నిటికిని నిజమైన అర్థమేమి? భాష్యకారులందఱును మొదటియర్థమునే (హిమసంక్రమణము మొదలు గ్రీష్మసంక్రమణమువఱకు ననియే) చెప్పిరి. ఈయర్థము ఇటీవలి శాస్త్రజ్ఞుల మతమునకు సమ్మతమేయైనను, ప్రాచీన వేదకాలమునకు మాత్రము సమ్మతముగాజాలదు. దీనికిపై ప్రమాణము శతపథబ్రాహ్మణము (II, 1-3; 1-3) నుండి చూపెదను. [వసంతో గ్రీష్మోవర్షా। తే దేవా ఋతవః। శరద్ధేమంతః శిశిరస్తే పితరో య ఏవా పూర్యతేఽర్ధమాసః। స దేవా యోఽపక్షీయతే స పితరోఽహరేవ దేవా రాత్రిః పితరః పునరహ్నః పూ

ష్ణో దేవా అపరాహ్ణః పితరః.............। సయత్రఉదగా వర్తతే దేవేషు తర్హిభవతి దేవారిస్త్వర్హ్యభిగోపాయత్యథ యత్రదక్షిణావర్తతేపితృషు తర్హిభవతిభవతి పితౄంస్త్వర్హ్యభిగోపాయతి॥]

శతపథబ్రాహ్మణమునందు ఈరీతిని స్పష్టముగ వర్ణనగలదు.

"వసంతగ్రీష్మవర్షర్తువులు దేవఋతువులు; శరత్, హేమంత, శిశిర ఋతువులు పితృఋతువులు. వృద్ధిబొందుపక్షము దేవపక్షము. క్షీణించుపక్షము పితృపక్షము. పగలు దేవతలది; రాత్రి పితరులది; పగటిలో మొదటిభాగము దేవతలది; పగటిలో రెండవభాగము పితరులది; (సూర్యుఁడు) ఉత్తరమునకు తిరిగినప్పుడు దేవతలలోనుండి వారిని కాపాడుచుండును. దక్షిణమునకు తిరిగినప్పుడు పితరులలోనుండి వారిని కాపాడుచుండును." ఈవాక్యములు పూర్తిగ సంశయవిచ్ఛేద మొనర్చుచున్నవి.

కనుక దేవయానమనగ, వసంత, గ్రీష్మ, వర్షర్తువులని సిద్ధించుచున్నది. కనుక ఉత్తరాయణమనగ వసంతవిషువత్ మొదలు శరద్విషువత్ వరకు నని తాత్పర్యము. సూర్యుఁడు ఉత్తరార్ధగోళములో సంచార మొనర్చు కాలమునకు ఉత్తరాయణ మనియు, దక్షిణార్ధగోళమునఁ సంచార మొనర్చు కాలమునకు దక్షిణాయనమనియు ఆదికాలమునాఁటి ప్రాచీన వేదకాలమునాఁటి యర్థమైయున్నది. కనుక ఉత్తరాయణము, వసంతము, నూతనసంవత్సరము, వార్షికసత్రము —

యివన్నియు ప్రాచీన వేదకాలమున వసంతవిషువత్ వద్దనే ప్రారంభమైనవని సిద్ధించుచున్నది. వర్షర్తువు పూర్తియైన పిమ్మట వచ్చుశరద్విషువత్ దినమే సంవత్సరమునందును, సత్రమునందును మధ్యమదినముగ యెన్నికకువచ్చెను.

కాని సూర్యుఁడు హిమసంక్రమణమునందుండగ నూతన సంవత్సరము ప్రారంభమయ్యెడిదని వేదాంగజ్యోతిషములో చెప్పబడి యుండుటకు కారణమేమి? ఈయభిప్రాయమునే శ్రౌతసూత్రములును జైమినియు చెప్పుటకు కారణమేమి? దీని కొక్కటేసమాధానముగలదు. ఈమార్పు ఇటీవల జరిగియుండియుండవలెను. ఎప్పుడు జరిగినదో ఖండితముగ చెప్పుటమాత్రము కష్టము. ఏదియెట్లున్నను, వసంతవిషువత్ కృత్తికలలోనికి రాకపూర్వము చాలకాలముక్రిందటనే యీమార్పు జరిగియుండియుండవలెను. (ఏలనన, కృత్తికయుగములో నున్న భారతకాలమునకుపూర్వమే యీమార్పు జరిగియుండెనని భీష్ములవారిమరణవృత్తాంతమువలన గోచరమగుచున్నది. ఈమార్పు జరిగినప్పటినుండియు సంవత్సరముయొక్క ప్రథమభాగమును దెల్పుటకు "ఉత్తరాయణ మను పదము వాడుకలోనికి వచ్చెను (అనగ హిం॥ సం॥ మొదలు గ్రీ. సం॥వరకు) అంతకుపూర్వము దేవయానము దేవలోకము అనుపదములే తప్ప ఉత్తరాయణ మనుపదము లేనేలేదని నాయభిప్రాయము. ఋగ్వేదములో ఉత్తరాయణ మనుపదము అసలు లేనేలేకపోవుటచే నాయభిప్రాయము మఱింతబలపడుచున్నది. ఈమార్పు జరిగినపిమ్మటనే ఉత్త

రాయణమునకు హిమసంక్రమణము మొదలు గ్రీష్మసంక్రమణమువఱకు గలకాలము అను అర్థము వచ్చెను. కనుక ప్రాచీనవేదకాలమునాఁటి యాచారవ్యవహారములనుగూర్చి మాట్లాడుచున్నప్పుడు ఉత్తరాయణపదమునకు మన యీ కాలమునాఁటి యర్థమునే మనస్సునఁ బెట్టుకొనఁగూడదు. ఈయర్థమును మనస్సులో పెట్టుకొని వ్యవహరించినకారణముచేతనే భాస్కరాచార్యులవంటి గొప్పపండితుఁడు సైతము తికమకపడవలసివచ్చెను. ("ఆర్యుల ఉత్తరధ్రువనివాసము" అనుగ్రంథమును చూడుఁడు.) మేరువువద్ద (ఉ. ధ్రు) నున్న దేవతలకు ఉత్తరాయణము పగలనియు, దక్షిణాయనము రాత్రియనియు సంహితాగ్రంథములలో గలదు. సూర్యుఁడు వసంతవిషువత్ వద్దనుండి బయలుదేరి శరద్విషువత్ వద్దకు సంచారముచేయుచున్న ౬ మాసములకాలమందే ఉ. ధ్రు. (మేరువు) వద్దనున్నవారికి పగలగును. ఇదియే దేవతలకు పగలు. అనగ ఉత్తరాయణము, సూర్యుఁడు శరద్విషువత్ నుండి బయలుదేరి ఖగోళరేఖకు దక్షిణభాగమందు సంచారమొనర్చి తిరిగివసంతవిషువత్ వద్దకు వచ్చు ౬ మాసములును ఉ. ధ్రు. (మేరువు) వద్దనున్నవారికి చీకటియగును- అనగ దేవతలకు రాత్రియగును. అనగ, దక్షిణాయనము - కనుక ప్రాచీనకాలమునాఁటి యుత్తరాయణసంజ్ఞకు నేను చెప్పినయర్థమే సరియైనదని సంహితాగ్రంథములు మఱింతబలపఱచుచున్నవి.

ఈరీతిని సంవత్సరాదిదినము వసంతవిషువత్ నుండిమాఱి హిమసంక్రమణమువద్దకుపోగనే దానిననుసరించియున్న సత్రముల ప్రారంభదివసముకూడ హిమసంక్రమణమునకే మార్చబడెను. అప్పటినుండియు విషువత్ దినముయొక్క నిజార్థము పోయి, దానికి సత్రముయొక్క మధ్యదినమని అప్రాముఖ్యమగు (Secondary) అర్థము వచ్చెను. ఈమార్పు తైత్తిరీయ సంహితాకాలమునాఁటికే జరిగియుండెను.

[కాని, కొన్ని కారణాంతరములచే ఇప్పటికి షుమారు ౧౫౦౦ సం॥ల క్రిందట వరాహమిహిరుఁడు వచ్చి సంవత్సరాదిని మరల వసంతవిషువత్ వద్దకు చేర్చెను. అయినను, ఉత్తరాయణప్రారంభము మాత్రము హిమసంక్రమణమువద్దనే నిలిచిపోయెను. వరాహమిహిరుడు దానినిమాత్రము మార్చలేదు.] కావుననే నర్మదానదికి దక్షిణముననున్న మనమందఱమును నూతనసంవత్సరాదిని ఇప్పుడు వసంతవిషువత్ వద్దనే ప్రారంభించుచున్నాము. మఱియు, ఉత్తరాయణములో చేయవలసినవని చెప్పబడినకర్మలనన్నిటిని హిమసంక్రమణముతోడనే ప్రారంభించుచున్నాము.

—♦ కృత్తికలు ♦—

మొట్టమొదట ప్రాచీనపుటార్యులు తమనూతన సంవత్సరమును వసంతవిషువత్తువద్ద ప్రారంభించిరనియు, అటు పిమ్మట కొంతకాలమునకు దానిని హిమసంక్రమణమువద్ద కు మార్చిరనియు పైయధ్యాయములో చెప్పియుంటిమి. సంవత్సరాదిని యీప్రకారముమార్చినను నక్షత్రక్రతువు మొదలగు కొన్నిక్రతువులనుమాత్రము విషువత్తువద్దనే ప్రారంభించుచుండెడివారని గర్గుడుబల్కుచున్నాడు.

విషువచ్చలనమువలన ఋతువులు వెనుకబడుచుండుటచే యీమార్పును దెలియబరచుటకు ప్రాచీనపుటార్యులు తమ పంచాంగములలో కూడ తదనుగుణముగ మార్పులనేమైన చేసికొనెడివారో లేదో విచారించి చూచెదముగాక.

విషువత్ యిప్పుడు రేవత్యంతమందున్నదనుభావముతో యిప్పటికాలపు పంచాంగములు గుణింపబడుచున్నవి. అందుచేతనే నక్షత్రములను అశ్వనీతో ప్రారంభించుచున్నాము. కాని విషువత్ యిప్పుడు రేవతినుండి ౧౯ డిగ్రీలు వెనుకకు నడచినది. ఆ ౪౯౦ సం॥ లో (అనగ, ౧౪౩౦ సంవత్సరముల క్రిందట) విషువత్ రేవత్యంతమందుండియుండవచ్చునని 'విట్నీ' పండితుడు చెప్పుచున్నాడు. దీనినిబట్టి విషువత్బిందువు రాశిచక్రములవెంబడి యెప్పుడేయేనక్షత్రములలోనుండెనో పరిశీలించి చూచెదముగాక.

రాశిచక్రములో ౨౭ నక్షత్రములున్నవి. రాశిచక్రమును ౨౭ సమభాగములుగ విభజించినచో ఒక్కొక్కనక్షత్రప్రమాణము ౩౬౦°/౨౭=౧౩°-౨౦″ (౧౩ డిగ్రీల ౨౦ నిమిషములగును.) అనగ, గణితశాస్త్రప్రకారము ఒకనక్షత్రమునకును, మరియొకనక్షత్రమునకును మధ్య దూరము ౧౩ డిగ్రీల ౨౦ నిమిషములై యుండవలెను. కాని, ఆకాశమును పరీక్షించిచూచినచో, యీనక్షత్రము లీరీతిగ సరిసమానమగు దూరములలో లేవు. కొన్నిదగ్గరగను, మరికొన్ని దూరముగను నున్నవి. ప్రాచీనపుటార్యులు సూర్యునిస్థలమును నిర్దేశించుటకై ప్రతియుదయమునను సూర్యునకు సమీపముననున్న నక్షత్రమును గుర్తుంచుకొనెడివారని పైయధ్యాయములో ప్రమాణసహితముగ దెలిపియుంటిమి. కనుక, గణితశాస్త్రప్రకారము వచ్చు నక్షత్ర ప్రమాణమునకును, కేవల మాకాశమందు మనకంటికగపడు నక్షత్రప్రమాణమునకును తప్పక భేదముండితీరును. వేదవాక్యములతాత్పర్యమును నిర్ణయించునప్పు డీభేదమును ముందు మనస్సునందు బాగుగ గుర్తుంచుకొనవలెను. ప్రాచీనపుటార్యులు ఆకాశమందు తమకండ్లకు ప్రత్యక్షముగ గాన్పించు నక్షత్రప్రమాణములనే ఆధారముగ గైకొనిరిగాని, యిట్టిగణితశాస్త్రప్రకారము సరిసమానముగవచ్చు ౧౩°-౨౦″ల ప్రమాణము గైకొనలేదని మనము బాగుగ గుర్తుంచుకొనవలెను. (ముఖ్యముగ యీయధ్యాయమందీయంశమును జ్ఞాపకముంచుకొనవలెను.) ప్రత్యక్షనక్షత్రమే యాధారముగాని, కృత్తి

మమగుగణితవిభాగము ఆధారముగాదు. దీని ప్రయోజనము ముందు దెలియనగును. ఈ ౧౩°-౨౦" నక్షత్రప్రమాణమునకే "అంశ" మని పేరిడుదుము. ఒక్కొక్కనక్షత్రమునకు ఒక్కొక్కఅంశ.

"సూర్యుడు కృత్తికనక్షత్రములో నున్నాడ"ని వేదములో నొకవాక్యమున్నదనుకొనుము. అనగ అర్థమేమి? సూర్యుడు ఆకాశములో ప్రత్యక్షముగ కృత్తికనక్షత్రముదగ్గరగ నున్నాడనియే అర్థమగునుగాని గణితశాస్త్రప్రకారము కృత్తికలకై కృత్రిమముగ నియమింపబడిన ౧౩°, ౨౦'' ల పరిమితిగలరాశి చక్రభాగముయొక్క కొన (ఇ) యందున్నాడని అర్థముకానేరదు.

విషువత్ చలనమువలన హిమసంక్రమణమునకును, తక్కిన ప్రధానస్థానములకునుకూడ చలనము తప్పకగలిగితీరును. విషువత్ చలించినట్లు ప్రాచీనగ్రంథములలో నెచ్చటనైన గన్పట్టినప్పుడు, తక్కినస్థానములుకూడ, తదనుగుణ్యముగ చలించినట్లు గన్పట్టుచున్నదా లేదాయని విచారించిచూడవలెను. నేనీగ్రంథము నందవలంబింపబోవు పద్ధతియిదియే.

ఇక విషువత్ ఒకప్పుడు కృత్తికలలోనున్నట్లు చెప్పు ప్రమాణవాక్యములనుగూర్చి విమర్శింతము.

1 వరాహమిహిరునికాలములో విషువత్ రేవత్యంతమందుండెను. క్రీ. సం. పునర్వసులోనుండెను. వరాహమిహిరుడు తనకుపూర్వకాలమందున్న గ్రంథములలో నుదహరింపబడిన

ఖగోళస్థితిగతుల నిట్లువర్ణించియున్నాడు. 'సూర్యుడు ఆశ్లేషార్ధమునుండి తిరిగినప్పుడు, అయనముసరిగనుండెను. కాని యిప్పుడది పునర్వసునుండియే జరుగుచున్నది. [ఆశ్లేషార్ధా దాసీద్యాదానివృత్తిః కిలోష్ణకిరణస్థ యుక్తమయనంతదాసీత్సాంప్రతమయనంపునర్వసుతః]. ఇట్లే బృహత్సంహితలోకూడ పైచెప్పినరీతిని క్రీ. సం. కు రెండుస్థానములు వర్ణింపబడినవి. ఈరెంటిలో నేదిసరియైనదో పాఠకులే ప్రత్యక్షముగ ఆకాశమును పరీక్షించిచూచి నిర్ణయించుకొనవలసినదని గ్రంథకారుడు చెప్పియున్నాడు (ఆశ్లేషార్ధా ద్దక్షిణముత్తరమయనం రవేర్ధనిష్ఠాద్యమ్ నూనంకదాచి దాసీద్యేనోక్తం పూర్వశాస్త్రేషు॥ సాంప్రతమయనం సవితుః కర్కటకాద్యం మృగాదితశ్చాన్యత్ । ఉక్తాభావోవికృతిః ప్రత్యక్షపరీక్షణైర్వ్యక్తిః ॥

గర్గ:— యదామావస్య శుక్లస్య ప్రతిపద్యుత్తరాయణం। సహోదయంశ్రవిష్టాభిః సోమార్కౌప్రతిపద్యతః ॥ —

భట్టోపాధ్యాయ:— శ్రవిష్టాద్యాత్పౌష్ణార్ధం చరతః శిశిరః ॥—

అమర I 4 13:— ద్వాద్వామావాది మాసౌస్యాదృతుస్తైరయనంత్రిభిః॥—

హి॥ సం॥ ధనిష్ఠాంశాద్యమందును, గ్రీష్మసంక్రమణము ఆశ్లేషార్ధమునందును గలవని చెప్పుపురాతనగ్రంథములు వరాహమిహిరునికాలములో. నుండెనని దీనివలన స్పష్టమగుచున్నది. [గర్గ: పరాశర:— యదామావస్య శుక్లస్యప్రతిద్యు

త్తరాయణం । సహోదయం శ్రవిష్ఠాభిః సోమార్కౌ ప్రతిపద్యతః॥—

శ్రవిష్ఠాద్యాత్పౌష్ణార్ధంచరతః శిశిరః॥—

పైనుదహరించిన దానినిబట్టి సూర్యుడు హిమసంక్రమణమువద్దనుండగనే నూతనసంవత్సరము ప్రారంభమైనచో మాఖమాసమే సంవత్సరాది యగునని తెలుచున్నది.

[పౌర్ణమినాడు చంద్రుడుసూర్యునకు ౧౮౦ డిగ్రీలదూరములో నుండును. పౌర్ణమినాడు చంద్రుడేనక్షత్రమువద్దనుండునో, ఆ నెలకు ఆనక్షత్రముపేరేవచ్చును. సూర్యుడు ధనిష్ఠలో (హిమసంక్రమణమువద్ద) నున్నప్పుడు చంద్రుడు (ఆనెలలో పౌర్ణమినాడు) ఆశ్లేషార్ధమందుగాని మఖయందుగాని యుండును. కనుక ఆమాసము మాఖమాసమగును.] కనుక సూర్యుడు ధనిష్ఠలో— హిమసంక్రమణమువద్ద నున్నప్పుడది మాఖమాసము. కాబట్టి నూతనసంవత్సరాది మాఖమాసములో వచ్చును. వేయేల? పూర్వమొకప్పుడు నూతనసంవత్సరమును మాఖమాసముతో ప్రారంభించినట్లనేక నిదర్శనములున్నవి. ఋతువనగ రెండుమాసములనియు, ఋతువులు మాఖమాసముతో ప్రారంభమయ్యెడివనియు అమరసింహుడు చెప్పుచున్నాడు. [అమర. I, 4, 13:— ద్వౌద్వౌమాఖాదిమాసౌ స్యాదృతుస్తైరయనంత్రిభిః॥—

శుశ్రుత, వాగ్భటములను వైద్యగ్రంథములుకూడ యీ తాత్పర్యమునే చెప్పుచున్నవి. [శుశ్రుత I. 6, వాగ్భట. (అష్టాంగహృదయ: సూత్రస్థానము III, 2)

అంపశయ్యయందున్న భీష్మాచార్యులవారు ఉత్తరాయణముకొరకు (సూర్యుడు హిమసంక్రమణమునుండి ఉత్తరమునకు తిరుగుటకొరకు) వేచియుండెననియు, అప్పుడు ఉత్తరాయణము మాఖశుద్ధమందువచ్చెననియు మహాభారతము అనుశాసనపర్వములోనున్నది. దీనినిబట్టి ఆకాలములో హిమసంక్రమణము ధనిష్ఠాంశాద్యమందు వచ్చెననియు స్పష్టమగుచున్నది. వేదాంగజ్యోతిషములో చెప్పినదానికిది సరిపోవుచున్నది.

వసంతవిషువత్ రేవత్యంతమందున్నప్పటికాలమునకంటె పూర్వకాలమందొకప్పుడు నూతనసంవత్సరమును మాఖమాసములో హిమసంక్రమణమునుండి ప్రారంభించెడివారనియు. అప్పుడు వసంతవిషువత్ భరణియొక్క చతుర్థపాదమందో లేక కృత్తికయొక్క ప్రథమపాదమందో యుండెననియు సిద్ధించుచున్నది, ఈయంశమే వేదాంగజ్యోతిషములోకూడా వర్ణింపబడినది.

వేదాంగజ్యోతిషమనునది వేదకాలమునాటి జ్యోతిషగ్రంథము. దీనిలో కొన్నివాక్యములిప్పటికిని బోధపడకున్నవి. కాని కొన్నిప్రధానాంశములను మాత్రము దీనినుండి గ్రహింపవచ్చును. అప్పటిఖగోళస్థితినిగూర్చి వేదాంగజ్యోతిషములో నిట్లువర్ణింపబడియున్నది.

(౧) హిమసంక్రమణము శ్రవిష్ఠాంశాద్యమందున్నది.

(౨) వసంతవిషువత్ భరణి పది డిగ్రీలలో (చతుర్థపాదములో) నున్నది.

(3) గ్రీష్మసంక్రమణము ఆశ్లేషార్ధమందున్నది.

(౪) శరద్విషువత్ విశాఖానక్షత్రము ౧౩౦ ౨౦'' లలో నున్నది.

సూర్యచంద్రులిరువురును ధనిష్ఠాంశార్ధమందున్నప్పుడు హిమసంక్రమణముతో నూతనసంవత్సరాది ప్రారంభమయ్యెను. ఉత్తరాయణముకూడ అప్పుడే ప్రారంభమాయెను. [ప్రమాణం; వేదాంగజ్యోతిషము: ౭ వ. శ్లో. ప్రపద్యేతే శ్రవిష్ఠాదౌ సూర్యాచంద్రమసావుదక్ సార్పార్ధే దక్షిణార్కస్తుమాఘ శ్రావణయోః సదా] అదిగాక, ఒక్కొక్కనక్షత్రమునకు ఒక్కొక్క అధిష్ఠానదేవతకలదట ఈదేవతలను లెక్కించుటలో మొట్టమొదట కృత్తికానక్షత్రమునకధిష్ఠానదేవతయగు అగ్నితో ప్రారంభించెడివారట. [వే జ్యో. ౨౫ శ్లో అగ్నిః ప్రజాపతిః సోమో etc] పైనవర్ణితమైన ఖగోళస్థితి క్రీ. పూ. ౧౨౬౯ సం ల క్రిందటనో లేక ౧౧౮౧ సంవత్సరముల క్రిందటనో యుండియుండవలెనని జ్యోతిశ్శాస్త్రజ్ఞులు గణితశాస్త్రరీత్యా నిర్ణయించియున్నారు. వేదాంగజ్యోతిషములోని యంశములను బలపరచుచు, వేదకాలము ఇంకను వెనుకకు తీసికొనిపోవు ప్రమాణములు పెక్కులుగలవు. నక్షత్రగణనమును కృత్తికలతో ప్రారంభించు వాక్యములనేకములు తై॥ సం॥, తై॥ బ్రా॥ మొదలగు

ప్రాచీనగ్రంథములందు గలవు. [తై. సం. IV, 4, 10, తై. బ్రా. III, 1-1-6; I, 5, 1, 2,] "కృత్తికలు నక్షత్రములకు ముఖమని తై॥ బ్రా॥ I, 1, 21 లో స్పష్టముగనున్నది. [కృత్తికాస్వాగ్నిమాదధీత । ముఖం వా ఏతన్నక్షత్రాణాం యత్కృత్తికాః.] ఋతువులకు వసంతర్తువు "ముఖ"మైనట్లుగానే, నక్షత్రములకు కృత్తికలు ముఖమైయున్నవి. నక్షత్రములలో కృత్తికలకు ప్రథమస్థానమిచ్చుటకు అర్థమేమి? పూర్వము నూతనసంవత్సరమును వసంతవిషువత్ వద్దగాని హి॥ సం॥ వద్దగాని ప్రారంభించెడివారని చెప్పితిమి. అయితే యీకృత్తికలు యీరెండుస్థానములలో నెచ్చటనుండెడివి? లేక, మరియింకెచ్చటనైన నుండెడివా? కృత్తికలు గ్రీ॥ సం॥ వద్ద వున్నవని చెప్పినచో తై॥ సం॥ క్రీ॥ పూ॥ ౨౨ వేలసంవత్సరముల క్రిందట పుట్టినదని చెప్పవలెను. ఇది అసంభవము దీనిని బలపరచు ఆధారములేమియులేవు. ఆరీతిగనే కృత్తికలు శరద్విషువత్‌లో వున్నవని చెప్పినచో తై॥ సం॥ క్రీ॥ పూ॥ ౧౫॥ వేలసం॥ ల క్రిందట పుట్టినదని చెప్పవలెను. ఇదియు అసంభవమే. ఇదిగాక, యిక హి॥ సం॥ ము వసంతవిషువమును మిగిలినవి. వసంతవిషువత్ భరణి చతుర్థపాదములో నున్నదను వేదాంగజ్యోతిషపు వర్ణనను బట్టి చూడగ కృత్తికలు తైత్తిరీయ సంహితాకాలమునాటికి వసంతవిషువత్‌లో నున్నవని నిర్ణయించుట యెక్కువ యుక్తముగనుండును.

కాని, మన మింతటితోనే తృప్తిజెందియుండ నక్కరలేదు. దీనిని బలపరుచుట కింకను ప్రమాణములు గలవు. తైత్తిరీ

య బ్రాహ్మణము I, 5, 2, 7 లో [దేవగృహా వై నక్షత్రాణి । .... । కృత్తికాః ప్రథమం । విశాఖేఉత్తమం । తాని దేవనక్షత్రాణి । అనురాధాః ప్రథమం । అపభరణీరుత్తమం తాని యమనక్షత్రాణి యాని దేవనక్షత్రాణి తాని దక్షిణేన పరియంతి । యాని యమనక్షత్రాణి తాన్యుత్తరేణ॥

“నక్షత్రములు దేవగృహములు... దేవనక్షత్రములు కృత్తికలతో ప్రారంభమై, విశాఖతో అంతమొందుచున్నవి. యమనక్షత్రములు అనూరాధతో ప్రారంభమై అపభరణితో అంతమొందుచున్నవి.” ఈ విభాగము కూడ యిదివరలో వర్ణింపబడిన దేవపితృయానములను బోలియున్నది. సూర్యుడు ఉత్తరార్ధగోళమందు వసంత, గ్రీష్మ, వర్షర్తువులలో సంచరించుచున్నపుడు దేవతలను రక్షించుచున్నాడని శతపథ బ్రాహ్మణములో స్పష్టముగ నున్నది. కనుక ఉత్తరార్ధగోళము [అనగ వసంతవిషువత్ మొదలు శరద్విషువత్ వరకు] దేవతలకును, దక్షిణార్ధగోళము పితరులకును ప్రత్యేకింపబడినట్లు గాన్పించుచున్నది. కనుక ఉత్తరార్ధగోళమందలి నక్షత్రములు దేవనక్షత్రములనియు, దక్షిణార్ధగోళమందలి నక్షత్రములు యమనక్షత్రములనియు వర్ణింపబడినవి. ఈరీతిగ విభజించినప్పుడు కృత్తికలు ఉత్తరార్ధగోళములో ప్రథమ నక్షత్రములుగ నుండుననుమాట స్పష్టము. (అనగ వసంతవిషువత్ లో నుండుననుట స్పష్టము) దానికి వెనుకనున్న ‘అప-భరణి’ దక్షిణార్ధ గోళములోనికి పోవునుగద.

దేవనక్షత్రములు దక్షిణపువైపునకు తిరుగుచున్నవనియు, యమనక్షత్రములు ఉత్తరపువైపునకు తిరుగుచున్నవనియు (పరియాంతి) తైత్తిరీయ సంహిత వర్తమానకాల సూచకముగ వర్ణించినది. కనుక, యిది ప్రత్యక్షముగ ఆకాశమువంక జూచి చెప్పినమాటయని యూహింపవలసి వచ్చుచున్నది. దేవనక్షత్రములు దక్షిణపువైపుగ తిరుగుచున్నవనగ అర్ధమేమి? అనగ వసంతవిషువత్ నుండీ గ్రీష్మసంక్రమణముమీదుగ శరద్విషువత్ వరకు— దక్షిణార్ధగోళము ప్రారంభమగువైపునకు తిరుగుచున్నవన్నమాట. అట్లేయమనక్షత్రములు శరద్విషువత్ నుండి హిమసంక్రమణముమీదుగ ఉత్తరముఖముగ— ఉత్తరార్ధగోళము ప్రారంభమగువైపునకు తిరుగుచున్నవన్నమాట. ఈప్రమాణములనుబట్టి తైత్తిరీయ సంహితాకాలమునాటికి వసంతవిషువత్ కృత్తికలలోనున్నదని స్పష్టమగుచున్నది.

ఇదిగాక తైత్తిరీయ సంహిత VII, 4, 8 లోనున్న వాక్యములనుబట్టి పైసిద్ధాంతము మరింతబలమగుచున్నది. సంవత్సరముపొడువునను చేయవలసిన “గవాం అయనం” వంటి సత్రములను (అనగ యజ్ఞములను) ప్రారంభించుట కేసమం చిదనమో యీక్రిందవాక్యములలో చర్చచేయబడియున్నది.

తైత్తిరీయ సంహితా VII, 4, 8.

సంవత్సరాయ దీక్షిష్యమాణా ఏకాష్టకాయాం। దీక్షేరన్నేషా వై సంవత్సరస్య పత్నీ యదేకాష్టకైతస్యాం వా ఏష

తా రాత్రింవసతి సాక్షాదేవ సంవత్సరమారభ్య దీక్షంత
ఆర్తం వా ఏతే సంవత్సరస్యాభిదీక్షంతేయ ఏకాష్టకా
యాందీక్షంతేం తనామానావృతూ భవతోఽవ్యస్తంవా ఏతే
సంవత్సరస్యాభిదీక్షంతే యఏకాష్టకాయాం దీక్షంతేత నా
మానావృతూ భవతః ఫల్గునీ పూర్ణమాసే దీక్షేరన్ముఖం వా
ఏతత్ సంవత్సరస్య యత్ఫల్గునీ పూర్ణమాసో ముఖత ఏవ
సంవత్సర మారభ్య దీక్షంతే తస్యైకైవనిర్యా యత్సామ్మే
ధ్యే విషూవాన్త్సంపద్యతే చిత్రాపూర్ణమాసే దీక్షేరన్ము
ఖం వా ఏతత్సంవత్సరస్య యచ్చిత్రాపూర్ణమాసో ముఖత
ఏవ సంవత్సరమారభ్య దీక్షంతే తస్యనకాచన నిర్యాభవతి
చతురహే పురస్తాత్ పౌర్ణమాస్యై దీక్షేరన్తేషామేకా
కాయాంక్రియః సంపద్యతే తేనైకాష్టకాం నఛంబట్కు
ర్వంతి తేషాం పూర్వపక్షేసుత్యా సంపద్యతే పూర్వపక్షం
మాసా అభిసంపద్యంతే తే పూర్వపక్షఉత్తిష్ఠంతి తానుత్తి
ష్ఠత ఓషధయో వనస్పతయోఽనూత్తిష్ఠంతి తాన్కల్యాణీ

కీర్తిరనూత్తిష్ఠత్యరాత్సురిమే యజమానాఇతి తదనుసర్వే రా
ధ్నువంతి॥

తండ్య బ్రాహ్మణ్యము : V: 9.

ఏకాష్టకాయాందీక్షేరన్ ॥

ఏషా వై సంవత్సరస్య పత్నీయదేకాష్టకైతస్యాం వా ఏతా
రాత్రిం వసతిసాక్షాదేవతత్సంవత్సర మారభ్యదీక్షంతే ॥౨॥

తస్యసానిర్యాం యదపోఽనాభినందంతోఽభ్యవయంతి ॥3॥

విచ్ఛిన్నం వా ఏతే సంవత్సరస్యాభిదీక్షంతే య ఏకాష్ట
కాయాం దీక్షంతేఽంత నామానావృతూభవతః ॥౪॥

ఆర్తం వా ఏతే సంవత్సరస్యాభిదీక్షంతే యోఽంతనా
మానావృతూ అభిదీక్షంతే ॥౫॥

తస్యాదేకాష్టకాయాం న దీక్ష్యమ్ ॥౬॥

ఫాల్గునేదీక్షేరన్ ॥౭॥

ముఖం వా ఏతత్సంవత్సరస్యయత్ఫాల్గునీ ముఖత ఏవ
తత్ సంవత్సరమారభ్యదీక్షంతే ॥౮॥

తస్యసానిర్యాయత్సమ్మేఘే విషువాన్ సంపద్యతే ॥౯॥

చిత్రాపూర్ణమాసే దీక్షేరన్ ॥౧౦॥

చతుర్వా ఏతత్ సంవత్సరస్య యచ్చిత్రాపూర్ణమాసో ముఖతో వైచతుర్ముఖత ఏవతత్ సంవత్సరమారభ్యదీక్షంతే తస్యనిర్యాస్తి ॥౧౧॥

చతురహే పురస్తాత్ పౌర్ణమాస్యై దీక్షేరన్ ॥౧౨॥

తేషామేకాష్టకాయాం క్రయః సంపద్యతే తేనైకాష్టకాం నసంవట్ కుర్వంతి ॥౧౩॥

ఏషాం పూర్వపక్షే సుత్యా సంపద్యతే పూర్వపక్షే మాసాః సంతిష్ఠమానాయంతి పూర్వపక్ష ఉత్తిష్ఠంతి తానుత్తిష్ఠతః పశవః ఓషధయోఽనూత్తిష్ఠంతి తాన్ కల్యాణీవాగభివదత్యరాత్సురిమేసత్రిణ ఇతి తే రాధ్నువంతి ॥౧౪॥

ఈపై వాక్యముల భావమిట్లు వ్రాయుచున్నాము. [సంవత్సరము=యజ్ఞము] "యజ్ఞముచేయదలచుకొనువారు "ఏకాష్ట దినమందేదీక్షితులుగావలెను, [ఏకాష్టకమనగ మాఘబహుళాష్టమి] ఏకాష్టకము సంవత్సరమునకు పత్ని. "సంవత్సరము" ఆరాత్రి ఆమెతోనుండును. కనుక ఏకాష్టమునాడు దీక్షితులైనవారు కొంచెము యించుమించుగ సంవత్సరారంభముననే దీక్షితులైనట్లెంచుకొనవచ్చును. (కాని) అట్లుయే కాష్టమునాడు దీక్షితులైనవారు "ఆర్త" దినములలో దీక్షితులగుచున్నారు. ఇది చిట్టచివర నుదహరింపబడిన ఋతువు (అదిగాక) ఏకాష్టమునాడు దీక్షితులైనవారు "వ్యస్త" కాలమునందు దీక్షితులగుచున్నారు. ఇదిచిట్టచివర నుదహరింపబడిన ఋతువు. ఫాల్గుణపౌర్ణమినాడు దీక్షితులుగావలెను.

ఫాల్గుణపౌర్ణమి సంవత్సరమునకు ముఖమైయున్నది. (అట్లయినచో) వారు సంవత్సరముఖమునందే దీక్షితులైనవారయ్యెదరు. కాని దీనిలో నొకలోపమున్నది. ఏమనగ, విషువద్దినము (యజ్ఞముయొక్క మధ్యదినము) వర్షములలో పడిపోవును. చైత్రపౌర్ణమినాడు వారుదీక్షితులు గావచ్చును. చైత్రపౌర్ణమి సంవత్సరమునకు ముఖమైయున్నది. (అట్లయినచో) వారుసంవత్సరముఖమందే దీక్షితులైనవారయ్యెదరు. దీనిలో లోపమేమియులేదు. (కాని) పౌర్ణమికి (మాఘపౌర్ణమికి) నాలుగురోజులు ముందుగనే దీక్షితులుగావలెను. (అట్లయినచో) వారిసోమ "క్రయ"ము ఏకాష్టక దినమందు జరుగగలదు. ఇందువలన, ఏకాష్టమును నిష్ప్రయోజనమును చేయనివారగుదురు. వారియొక్క "సుత్య"ము (అనగ, సోమరసమునుపిండి తీయుపని) పూర్వ (శుక్ల) పక్షమందే జరుగును. వారిమాస యజ్ఞములుకూడశుక్లపక్షమందే జరుగును. వారుతమ (మాస) యజ్ఞములను పూర్తిచేసి శుక్లపక్షమందే లేవగలరు. వీరులేవగనే, వీరితోబాటు ఓషధులును, వనస్పతులును కూడలేచును. అటుపిమ్మట వీరికికల్యాణము జరిగినదనకీర్తికూడప్రబలును. అటుపై, అందరికిని కల్యాణమగును.

యజ్ఞము చేయదలచుకొన్నవారు నూతనసంవత్సర మింకను కొలదిదినములకు ప్రారంభముగు ననగనే దీక్షితులు కావలసియున్నారు. ఏకాష్టము (అనగ మాఘబహుళాష్టమి) చాలముఖ్యమైనదినము దీనినెట్లైనను యజ్ఞదీక్షకు ప్రారంభ దినముగ చేయవలయునని మనవారెంతయో యాతురపడు

చుండినట్లు పైవాక్యములనుబట్టి గన్పట్టుచున్నది. కాని దీనికి ముఖ్యముగ మూడు అభ్యంతరములు గలిగెను. ఏమనగ ఒకటి [౧] ఈఏకాష్టము "ఆర్త" దినములలో [అనగ, శబరుని వ్యాఖ్య ప్రకారము—అతి చలి కాలములో] పడిపోయెను; లేక శాయన వ్యాఖ్య ప్రకారము—ప్రాతసంవత్సరము నశించిపోయి క్రొత్త సంవత్సరమువచ్చిన తరువాతి దినములలో పడిపోయెను, ఇక రెండవ యభ్యంతర మేమనగ:— ఆఏకాష్టదినము చిట్టచివరి ఋతువులో [అనగ శిశిరఋతువులో—అతిచలి కాలములో] పడిపోయెను. ఈ రెండభ్యంతరములును ఒకటే; ఇవియంత ముఖ్యమైనవి కావు. ఇకమూడవ యభ్యంతర మేమనగ:— ఈ యేకాష్టదినము "వ్యష్ట" కాలములో [అనగ, సూర్యుడు హిమసంక్రమణమునుండి తిరిగిపోయిన తరువాత కాలములో] పడిపోయెను. కనుక, ముఖ్యముగ యీ మూడవ యభ్యంతరమును తొలగించుకొనుటకై మాఖ పౌర్ణమి కింకను నాలుగురోజులు ముందుగనే [మాఖ శుద్ధ యేకాదశినాడే] యజ్ఞదీక్షకు బూనవలెనని నిశ్చయించిరి. అట్లయినచో; సూర్యుడు హిమసంక్రమణమునుండి ఉత్తరమునకు తిరుగక పూర్వమే యజ్ఞదీక్షకు బూనినట్లగును. [నూతన సంవత్సరము ప్రారంభము కాకపూర్వమే దీక్షితుడయి యుండవలెనని పైన చెప్పియుంటిమిగద] అట్లయినచో సోమరసక్రయము ఏకాష్టమునాడు [అనగ, దీక్షితుడైన ౧౨ వ రోజున] జరుగును గనుక యీ యేకాష్టమును యేదో యొక విధముగ వినియోగించుకొన్నవారగుదురు.

ఈ వాక్యములనుండి మనము గ్రహింపవలసిన యంశములుకొన్ని గలవు. అవేవనగ:—

(౧) తై॥ సం॥ కాలములో హిమసంక్రమణము మాఖ శు ౧౧ కిని మాఖ బ ౧ కిని మధ్య వచ్చెడిదని స్పష్టమగుచున్నది. అనగ మాఖశుద్ధ పౌర్ణమినాడే వచ్చెడిదని నిశ్చయింపవచ్చును.

(౨) ఆదినమే నూతనసంవత్సరాది యనికూడ స్పష్టము కాగలదు.

[3] ఫాల్గుణ, చైత్ర పౌర్ణమీలుకూడ సంవత్సరారంభములేయని పైవాక్యములోనున్నది. సంవత్సరములో మూడు సంవత్సరాదులుండజాలవు. కనుక, యీరెండును తత్పూర్వ యుగములలోని సంవత్సరాదులను సూచించుచున్నవని గ్రహింపవలెను. దీనినిగూర్చి రాబోవు అధ్యాయములో చర్చించెదము.

[౪] ఫాల్గుణ పౌర్ణమినాడు దీక్షగైకొన్నచో విషువత్,-అనగ యజ్ఞమధ్యదినము— వర్షములలో పడిపోవునని చెప్పబడినది. దీనినిబట్టి విషువత్ అను పదముయొక్క నిజార్థము మారిపోయి, కేవలము యజ్ఞమధ్యదినమని మాత్రము అర్థమువచ్చినదని గ్రహింపవలెను.

ఈ తై॥ సం॥ వాక్యమువలన హిమసంక్రమణము ఆకాలమున మాఖశుద్ధపౌర్ణమినాడు జరిగెడిదని తెలియుచున్నది. కనుక, వసంతవిషువత్ కృత్తికలలో నున్నదని ఋజువగుచు

న్నది. తై॥ సం॥ కాలమున విషువత్ కృత్తికలలో నున్నదని తెలుపుటకు మనకిప్పటికి షుమారు ౬ ప్రమాణములు దొరికినవి.

(౧) వేదాంగజ్యోతిషములోని వర్ణనము; వరాహమిహిరుని వాక్యములు—

(౨) తై॥ సం॥; తై॥ బ్రా॥ లలో వర్ణితమైన నక్షత్రాధిష్ఠానదేవతల క్రమము.

(3) కృత్తికలు నక్షత్రములకు 'ముఖ' మని చెప్పు తై॥ బ్రా॥ లోని ప్రత్యక్షవాక్యము.

[౪] కృత్తికలు దేవనక్షత్రములలో ప్రథమనక్షత్రములని చెప్పు ప్రత్యక్షవాక్యము.

[౫] హిమసంక్రమణము మాఘశుద్ధపౌర్ణమినాడు జరిగెడిదని చెప్పు పైవాక్యము. —[తై॥ సం॥ VII, 4,8]

[౬] మఖానక్షత్రమునకు పితరులు అధిష్ఠానదేవతలని తై॥ సం॥ IV 4, 10, 1, లో చెప్పబడియున్నది.— అనగ, కృత్తికలు విషువత్పద్దనున్నప్పుడు, మఖానక్షత్రము గ్రీష్మసంక్రమణములో నుండును. ఈ గ్రీష్మసంక్రమణము వద్దనే (యిప్పటి) దక్షిణాయనము— లేక పితృయానము— ప్రారంభమగును. కనుక మఖానక్షత్రమునకు పితరులధిష్ఠాన దేవతలనుట సమంజసమే.

దీనినిబట్టి తై॥ సం॥ కాలమును నిర్ణయించుదము. [కృత్తికలనగ ఆకాశమందు మనకు ప్రత్యక్షముగ గాన్పించు కృత్తికా నక్షత్రములగుంపే యని యెరుంగ వలెను— అంతియే

గాని, గణితశాస్త్రరీత్యా నిర్ణయింపబడిన ౧౩°—౨౦'ల అంశముయొక్క ఆదిబిందువుగాదని గుర్తించు కొనవలెను.] ఈ ఆదిబిందువునకును, నక్షత్రముల గుంపునకును ౧౦°—౧౫'—ల దూరమున్నదని సూర్యసిద్ధాంతము [VIII, 2, 9] చెప్పుచున్నది. ఈప్రకారము గుణించినచో తై॥ సం॥ కాలము క్రీస్తుకు పూర్వము ౨౩౫౦ సంవత్సరము లగునని "విట్నీ" పండితుడు తేల్చెను.


కాని, కృత్తికలనగ కృత్తి కాంశముయొక్క ఆదిబిందువే యని యూహించి, బెంట్లీపండితుడు విషువత్ నుం౧౦°—౧౫' అనగ షుమారు ౧౧ డిగ్రీలు వెనుకకు నెట్టెను. ఈలెక్క ప్రకారము తై॥ సం॥ కాలము క్రీస్తుకు పూర్వము ౧౪౨౬ సంవత్సరములగునని బెంట్లీ గుణించెను. కాని యీబెంట్లీ పండితుని యూహ సరిగాదని క్రిందటి అధ్యాయములోనే దెలిపియుంటిమి. ఏలననగ:— ఖగోళమందు హిమసంక్రమణము వంటి కృత్రిమ బిందువును గుర్తించుకొనగల శక్తి క్రీ॥ పూ॥ ౧౨౦౦ సంవత్సరములనాడు భారతీయులకు లేదని పాశ్చాత్య పండితులు ఆక్షేపించిరి. ఇప్పుడుతమ వాదన కనుకూలముగ నున్నదన యూహతో— [వేదకాలమును తగ్గించుటకు వీలుగనున్నదను యూహతో] కృత్రిమములేయైన నక్షత్రాంశ విభాగములను క్రీ॥ పూ॥ ౧౫వందల సంవత్సరములనాడు భారతీయు లెరుంగుదురని మొగము పెట్టుకొని యీపాశ్చాత్య పండితులు చెప్పుచున్నారు.

కాని, బెంట్లీగారింకొకగొప్పయూహ జేయుచున్నారు. "విశాఖాః నక్షత్రమునకు ఆపే రెట్లువచ్చినది? విశాఖ అనగ రెండుశాఖలు గలది. వసంతవిషువత్ కృత్తికాంశపు ప్రథమబిందువువద్ద నున్నచో, శరద్విషువత్ సరిగ విశాఖాంశముయొక్క మధ్యభాగమందుండును, అనగ, విశాఖలో సగము భాగము ఉత్తరార్థ గోళమందును, మరియొక సగము దక్షిణార్థగోళమందును పడును. ఈప్రకారము విశాఖానక్షత్రము సరిసమానమైన రెండుభాగములుగ చీల్పబడినదనియు, దీనినిబట్టి వసంతవిషువన్ కృత్తికాంశపు ప్రథమ బిందువు వద్దనే యున్నదిగాని, కృత్తికానక్షత్రముల గుంపులో లేదనియు బెంట్లీగారు తలంచుచున్నారు, ఇది చాల తెలివిగైన యూహాయనుట కేమియుసందియము లేదు— కాని, దీనికి వేదమం దెచ్చటను ఆధారము లేకపోగా తై॥ సం॥ వాక్యముల కిది ప్రత్యక్షవిరుద్ధముగ నున్నదని నిరూపించెదను.

తై॥ సం॥ కాలములో హి॥ సం॥ మాఖ శుద్ధ పౌర్ణమి నాడు జరిగెనని పైనచెప్పితిమి. కాని, వేదాంగజ్యోతిషకాలమునాటి కది మాఖశుద్ధపాడ్యమినాడే జరుగుచుండెనని వేదాంగజ్యోతిషములోనున్నది. అనగ, అప్పటికి ౧౫రోజులు వెనుకబడెను. ఋతువులు ఒక్కమాసము వెనుకబడుటకువిషువత్ షుమారు ౨౭°-౪౦' వెనుకకు జరుగవలెను. అనగ, ౧౫ దినములు వెనుకబడుటకు ౧౩°—౨౦' లేక షుమారు ౧౪ డిగ్రీలు వెనుకకు జరుగవలెను.

భరణిలో ౧౦ డిగ్రీలు గడచినపిమ్మట విషువన్ గలదని వేదాంగ జ్యోతిషములో చెప్పబడియున్నది. అక్కడనుండి కృత్తికాంశపు ప్రథమ బిందువునకు ౩°—౨౦' లు మాత్రమే దూరముగలదు- [ఇది ౧౫ రోజుల వ్యవధికి చాలదు]- కాని, భరిణిలో ౧౦ డిగ్రీలనుండి కృత్తికానక్షత్రము వరకు కొలిచినచో ౩°—౨౦'+౧౦°—౫౦'=౧౪°—౧౦' అగును. [ఈదూరము ౧౫ రోజుల వ్యవధికి సరిపోవును.] [మూడవపటము చూడుడు] బెంట్లీలెక్కను గ్రహించినచో తై॥సం॥కును వేదాంగ జ్యోతిషమునకును మధ్య ౩°—౨౦' లేయుండును. కాని యిది ౧౫ దినముల వ్యవధికి చాలదు. మన సిద్ధాంతప్రకారమైనచో యీరెంటికిని మధ్య షుమారు౧౪° దూరముగలదు. ఇది ౧౫ దినముల వ్యవధికి సరిపోవుచున్నది. కనుక, బెంట్లీయూహ సరియైనదిగాదు. అయినను, బెంట్లీమాటను పూర్తిగ త్రోసివేయుటకును వీలులేదు. విశాఖలో నున్నవని చెప్పబడిన రెండు శాఖలును సరిసమానముగ నున్నవని యేల చెప్పవలెను? ఒకటి పెద్దదిగను, రెండవది చిన్నదిగను ఉండి ఉండవచ్చును. వసంతవిషువత్ కృత్తికా నక్షత్రముల వద్దనున్నచో, శరద్విషువత్ విశాఖాంశం లోపడి దానిని రెండుగ (సమభాగములు కాదు) చీల్చియుండవచ్చును. ఇంతవరకు మాత్రమే మన మంగీకరింపవచ్చును. ఈకారణముచే తై॥ సం॥ కాలము క్రీ॥పూ॥ ౨౩౫౦ సంవత్సరము లేగాని, ౧౪౨౭ కాదనినిర్ణయ మగుచున్నది.

ఇంతటితో వేదకాల నిర్ణయము కాలేదు. మనమింకను పైకి పోవచ్చును. ఫాల్గుణం, చైత్ర పౌర్ణమాలు సంవత్సర ముఖములని పై నుదహరించిన తై. సం. వాక్యములలో నున్నది. ఈ వాక్యములలోని నిజభావమేమియో గ్రహింతము గాక.



మృగశీర్ష

౨వ అధ్యాయం

"అగ్రహాయణ"

తైత్తిరీయ సంహిత VII, 4, 8 లో చిత్రాపూర్ణమాసయు ఫల్గుణీపూర్ణమాసయు సంవత్సరాది దినములుగ వర్ణింపబడినవి. ఈ దినములకే "చైత్రీ" యనియు "ఫల్గుణీ" యనియు జైమినీసూత్ర, తండ్యబ్రాహ్మణములందు క్రమముగ నామాంతరములు గలవు. వీనికి క్రమముగ చైత్ర పౌర్ణమి, ఫాల్గుణపౌర్ణమి అని అర్థము. ఈరెండును దినములను సూచించు పదములేగాని మాసములను సూచించు పదములు గావని గుర్తించుకొనవలెను.

ఫల్గుణీ, చైత్రీదినములు సంవత్సరాదిదినము లెట్లగును? ఈ రెండుదినములును వసంతర్తువులో వచ్చినందున వీనికిట్టి వర్ణన సరిపోవునని శాయనులవారు తలంచుచున్నారు. కాని, క్రిందటి యధ్యాయములో చెప్పినట్లు హిమసంక్రమణము వద్ద మాఘపౌర్ణమితో సంవత్సరము ప్రారంభమగునెడల, ఫాల్గుణ చైత్ర పౌర్ణమాలు వసంతర్తువులో నెట్లుపడగలవు? ఇది అసంభవము. దీనిని సమర్థించుటకు శాయనుల వారు సౌర చాంద్రమానముల ననుసరించి రెండు వసంతము లేర్పడునని యేమేమో శ్రమపడిరి. కాని, యీ ప్రకా

గ మాలోచించినను— అధికమాసమును కలుపుకొనక పోయినచో— సౌర వసంతము మరియొక మాసము ముందునకే జరుగునుగాని వెనుకకు రాజాలదు. కనుక వీరిసమాధానము సరిగ లేదు.

ఇంగాక, సుశ్రుత గ్రంథములో కూడ ఫాల్గుణ మాసము వసంతర్తువులో పడినదని యొక వాక్యముగలదు. కాని యీవాక్యమును యిటీవల యెవరో యిరికించినట్లు స్పష్టమగుచున్నది. ఏలననగ, సుశ్రుత గ్రంథములో పరస్పర విరుద్ధములగు వాక్యములు రెండు ఒకేచోట గన్పట్టుచున్నవి. అవేవనగ :— [సుశ్రుత: సూత్రస్థానం: అధ్యాయం ౬ :— తత్ర మాఘాదయో ద్వాదశ మాసా ద్వైమాసిక మృతుం కృత్వా షడృతవో భవంతి। తే శిశిర వసంత గ్రీష్మ వర్షాశరద్ధేమంతాః। తేషాం తపస్తపస్యౌ శిశిరః।......। అయనే ద్వే భవతః। దక్షిణముత్తరంచ। తయోర్దక్షిణం వర్షాశరద్ధేమంతాః ...। స ఏష నిమేషాది యుగపర్యంతః కాలశ్చక్రవత్పరివర్తమానః కాలచక్రముచ్యత యిత్యేకే॥

ఇహతు వర్షాశరద్ధేమంత వసంత గ్రీష్మ ప్రావృషః షడృతవో భవంతి। ...। తే తు భాద్రపదాద్యేన ద్వైమాసికేన వ్యాఖ్యాతాః। తద్యథా భాద్రపదాశ్వయుజౌ। వర్షాః కార్తికమార్గశీర్షౌ శరత్। పౌషమాఘౌ హేమంతః। ఫాల్గుణ చైత్రౌ వసంతః। వైశాఖజ్యేష్ఠౌ గ్రీష్మః। ఆషాఢశ్రావణౌ ప్రావృడితి॥......]

మొదటి వాక్యములోని వర్ణనము కొంతకాలమునకు

మారిపోవుటచే అప్పటి దేశకాలాదులకు సరిపోవునట్లుగ పై వాక్యములను మార్పదలచి యే మహామహుడో యీ రెండవ వచనమును తదుపరి వ్రాసియుండును. లేనిచో, మూలగ్రంథమందే యిట్లు పరస్పర విరుద్ధములగు వచనములుండుట అసంభవము. రెండవ వచనమునకు మొదటనున్న "ఇహతు" అను పదముతే దీనికి నిదర్శనము. సుశ్రుత, చరక గ్రంథములను సంపుటీకరించిన వాగ్భటుడుకూడ మొదటి వచనమునే గ్రహించెనుగాని, రెండవ వచనమును గూర్చి ప్రశంసింపనైన లేదు. కనుక, తైత్తిరీయ సంహితా కాలములో ఫాల్గుణమాసము వసంతర్తువులో నుండెననుటకు వీలు లేదు.

ఫాల్గుణ పౌర్ణమి సంవత్సరాదిగనుండెనని తైత్తిరీయ సంహితా వాక్యమునకు శాయణులవారు చెప్పదలచిన సమాధానము సరిగ లేదు. అదియటుండ, ఒక్క తైత్తిరీయ సంహితయేగాకుండ, శతపథ బ్రాహ్మణము (VI, 2. 2, 18) లో ఫాల్గుణ పౌర్ణమి సంవత్సరములో "ప్రథమరాత్రిః" అని చెప్పబడియున్నది. తై॥ బ్రా॥ I, 1, 2, 8; సాంఖ్యాయన బ్రాహ్మణము IV, 4; V, 1,—లలోకూడ యిట్టి వాక్యములే గలవు. గోపథ బ్రాహ్మణము I, 19లో సంవత్సరముయొక్క రెండు కొనలును ఉత్తర, పూర్వ ఫల్గునుల యందు కలియునని వర్ణనగలదు- తాండ్య బ్రాహ్మణములో కూడ నిట్లేయున్నది. [శత॥ బ్రా॥ VI, 2.2-18. ఏషాహ సంవత్సరస్య ప్రథమా రాత్రి ర్యత్ఫాల్గునీ పౌర్ణమాసీ);

(తై॥ బా॥ I, 1, 2, 8:—ఏషావై ప్రథమారాత్రిః సంవత్సరస్య యదుత్తరే ఫల్గునీ। ముఖత ఏవసంవత్సరస్యాగ్ని మాధాయవశీయాన్ భవతి॥) సాంఖ్యాయన IV, 4:—ముఖం వా ఏతత్సంవత్సరస్య యత్ఫాల్గునీ పౌర్ణమాసీ॥); గోపథ బ్రాహ్మణ I, 19:—ముఖముత్తరే ఫల్గున్యౌ పుచ్ఛం పూర్వే। తద్యథా ప్రవృత్తస్యాంతౌ సమేతౌస్యాతాం ఏవమేతత్సంవత్సరస్యాంతౌ సమేతౌ భవతః॥

సూత్రకారులుకూడ యీయూహలనే బలపరుచుచున్నారు. "వార్షికసత్రములను చైత్ర పౌర్ణమినాడైనను లేక ఫాల్గుణ పౌర్ణమినాడైనను ప్రారంభింపవలె" నని సూత్రకారుల వాక్యములుగలవు. అనగ, యివిసంవత్సరాది దినములని సూచన దీనినిబట్టి ఫాల్గుణపౌర్ణమి యొకానొకప్పుడు సంవత్సరాదిగ నుండెననుట స్పష్టము:—అట్లే చైత్రపౌర్ణమికూడ ఫాల్గుణ పౌర్ణమిసంవత్సరాది యెట్లయ్యెనో ముందుపరిశీలింతము.

ఫాల్గుణపౌర్ణమి వసంతవిషువత్ వద్దకువచ్చెనని చెప్పుట అసంభవము. అట్లయినచో వసంతవిషువత్ ను తీసికొనిపోయి ఉత్తరాభాద్రలోపెట్టవలెను. అనగ క్రీ॥ పూ॥ ౨౦ వేలసంవత్సరములు వెనుకకుపోవలెను. ఇదిఅసంభవముకనుక దీనికింకొక గత్యంతరమేమనగ, హిమసంక్రమణమువద్ద ఫాల్గుణ పౌర్ణమితో నూతనసంవత్సరము ప్రారంభమయ్యెడిదని చెప్పవలెను. ఇవన్నియు నొకవాక్యములో నుండుటచేత, మాఖ పౌర్ణమికివర్తించినభావమే యీ ఫాల్గుణచైత్ర పౌర్ణమీలకు కూడవర్తించును. ఈయర్థమునే భాస్కరభట్టాచార్యులవారు

కూడతమ భాష్యములోవ్రాసియున్నారు. దీనినిబట్టి తై॥ సం॥ లోని వాక్యమునకు నిజమైనఅర్థమేమనగ; ఈతై॥ సం॥ కాలమునకంటె పూర్వకాలమునందొకప్పుడు హిమసంక్రమణము వద్దఫాల్గుణపౌర్ణమినాడు నూతనసంవత్సరాది వచ్చుచుండెడిదనియు, ఆపూర్వగాథనే యీసంహితలలోను బ్రాహ్మణములలోను నుదహరించిరనియు దీనిభావము. అట్లయినచో వేదకాలమింకొక రెండువేల సంవత్సరములు వెనుకకుపోవును. [ఋతువులు సుమారు రెండువేల సంవత్సరములకొక నెలచొప్పున వెనుకబడుచుండుననుసంగతిని మరువకూడదు.]

హిమసంక్రమణమువద్ద ఫాల్గుణపౌర్ణమితో సంవత్సరము ప్రారంభమయ్యెయెడల అప్పటిఖగోళస్థితి యీ క్రిందివిధముగనుండి యుండవలెను.

(౧) హి॥ సం॥:—ఉత్తరాభాద్ర ౩°-౨౦ లలో నుండవలెను.

(౨) వసంతవిషువత్:— ఆర్ద్రా ఉదయమందుండవలెను.

(3) గ్రీ॥ సం॥—ఉత్తరఫల్గుణీ ౧౦° డిగ్రీలలో నుండవలెను.

(౪) శరద్విషువత్:— మూలార్థమందుండవలెను.

గణితశాస్త్రరీత్యా వచ్చిన కృత్రిమాంశ విభాగములను వదలివేసి చూచినచో—కొంచెమించుమించుగ—ఖగోళస్థితి యీక్రిందివిధముగ నుండును:—

(౧) హి॥ సం॥:— ఉత్తరాభాద్రా నక్షత్రమునకు బహుదగ్గరగనుండును.

(౨) వ॥ విషువత్॥— మృగశీర్షానక్షత్రమునకు తూర్పున క౦లలో నుండును,

(3) గ్రీ॥ సం॥:— ఉత్తరఫల్గుణీ నక్షత్రమునకు తూర్పున త్రి౦లలో నుండును,

(౪) శ॥ వి॥:— మూలానక్షత్రమునకు తూర్పున గి౦లలోనుండును.

కనుక, ఫాల్గుణపౌర్ణమిహిమసంక్రమణమువద్ద వచ్చినప్పుడు వసంతవిషువత్ మృగశీర్షానక్షత్రమువద్ద నుండితీరవలెనని పైవివరణమునుబట్టి స్పష్టమగుచున్నది. తై॥ సం॥ కాలములో వసంతవిషువత్ కృత్తికలలోనున్నది. ఇప్పుడుమృగశీర్షలోనున్నది. అనగ రెండునక్షత్రములు ముందునకు నడచినది. ఫాల్గుణపౌర్ణమి హిమసంక్రమణమువద్దకు వచ్చుటయే నిజమైనచోవసంతవిషువత్ మృగశీర్షలోనుండితీరవలెను, వసంతవిషువత్ యీరీతిగ ఒకప్పుడు మృగశీర్షలో నున్నదని తెలుపుటకేమైన ప్రమాణములుగలవా? లేవా? యనివిచారింపవలెను. మనమిప్పుడుదీనికి ఉపక్రమింతము.

నక్షత్రములలోనికెల్ల కృత్తికానక్షత్రము ప్రథమనక్షత్రమనువర్ణననుబట్టి వసంతవిషువత్ ఒకప్పుడక్కడనుండెనని పైప్రకరణములో సిద్ధాంతీకరించితిమి. మృగశీర్షనక్షత్రము విషయమైకూడ అట్టివర్ణన యేదైననున్నదా? నక్షత్రములలోనికెల్ల మృగశీర్షానక్షత్రము ప్రథమనక్షత్రమను వర్ణనము

మనకెచ్చటనైన దొరికినచో, పైప్రకరణములోవలెనే యిచ్చటకూడమనపని చాలా తేలికయగును. కాని, మనదురదృష్టవశాత్తు అంతఖండితమైన వాక్యములెచ్చటను గానరావు. అయినను భయములేదు:—

అమరసింహుడు [I, 3, 23] తనకోశమునందు మృగశీర్షనక్షత్రమునకు "ఆగ్రహాయణి" అను నామాంతరము నిచ్చియున్నాడు: "ఆగ్రహాయణి" అనగ సంవత్సరమును ప్రారంభించు అనిఅర్థము. ఈపేరు యీనక్షత్రమునకెట్లువచ్చినది, పాణినీయ వ్యాకరణరీత్యా, అసలు యీపేరు సరియైనదగునా! కాదా? కానిచో, దీనికి సరియైనపేరేమి? అనునీయంశములనెల్ల నిప్పుడు విచారించెదముగాక.

మృగశీర్షానక్షత్రమునకు "ఆగ్రహాయణీ" అను పేరును అమరసింహుడెట్లిచ్చెను? మాసములలో మార్గశీర్షమాసము ప్రథమమాసమని అమరసింహుడుభాగ్భటుడు మొదలగుపండితులెల్లరును ముందుగ నొకవిపరీత సిద్ధాంతమునుబయలుదేరదీసిరి. దీనికి బయలుదేరదీయుటకొక్కటే గొప్పకారణమున్నది.ఏమనగ:-భగవద్గీతవంటిమహాగ్రంధములో॥మాసానాం మార్గశీర్షోఽహం ఋతునాం కుసుమాకరః" అని (X, 35 లో) శ్రీకృష్ణుడు అర్జునునకు జెప్పెను. ఈవాక్యములలో నిజముగ "మాసములలో మార్గశీర్ష మాసము ప్రథమమాసము" ను భావమున్న మాట వాస్తవమే. కాని, యీభగవద్గీతలోని భావముకూడ సరియైనదిగాదు. ఇంకొన్ని యపోహలపై చేయబడిన తప్పుడు సిద్ధాంతమైయున్నది. ఇదెట్లు

తప్పును సిద్ధాంతమో పిమ్మట వివరించెదను. ప్రస్తుతాంశ మేమనగ:—భగవద్గీతయంత యుత్కృష్టగ్రంథములో చెప్పబడిన భావములోకూడ దోషముండునాయను భ్రమచేత అమరసింహుడు వాగ్భటుడు మొదలైన పండితులెల్లరును ఆతప్పు సిద్ధాంతమునే యంగీకరించిరి. తదుపరి వచ్చిన వ్యాఖ్యాతలును జ్యోతిశ్శాస్త్రజ్ఞులునుకూడ యీసిద్ధాంతము నేదోరీతిగ అతుకులుపెట్టి సమర్థింపజూచిరి. ఈతప్పును సిద్ధాంతముయొక్క ఆధారముతో మృగశిరానక్షత్రమున కమరసింహుడిచ్చిన ,,ఆగ్రహాయణి'' అను పదమును తదుపరి వచ్చిన వ్యాఖ్యాతలు యీక్రిందిరీతిగ సమర్థింపజూచిరి,

మార్గశిర పౌర్ణమిసంవత్సరములో ప్రథమరాత్రియను నూహాతో వీరు బయలుదేరిరి. నూతనసంవత్సరమును ప్రారంభించురాత్రిగనుక యీమార్గశిరపౌర్ణమికి,, ఆగ్రహాయణి'' అనుపేరువచ్చినదట! నూతనసంవత్సరమును ప్రారంభించుపౌర్ణమి మార్గశిరమాసములో వచ్చినదగనుక ఆమార్గశిరమాసమునకు ,,ఆగ్రహాయణిక" అనుపేరువచ్చినదట. సరే ఇంతవరకు బాగుగనేయున్నది. కాని, ,,ఆగ్రహాయణి" అను పేరుగల ఆమార్గశిర పౌర్ణమినాడు పూర్ణచంద్రుడు మృగశిరానక్షత్రమువద్దనుండుటచే ఆమృగశిరా నక్షత్రమునకుకూడ ,,ఆగ్రహాయణి'' అనిపేరువచ్చినదట! దీనిపై ఆక్షేపణయేమనగ:ఇదితలక్రిందు వ్యాపారముగనున్నది. నక్షత్రముయొక్క పేరునుబట్టి నెలకుపేరు వచ్చునుగాని, నెలయొక్క పేరునుబట్టి నక్షత్రమున కెప్పుడును పేరురాదు. దీనికి ప్రమాణముపాణిని

[iv,2, 21, సాస్మిన్ పౌర్ణమాసీతి సంజ్ఞాయామ్] పోసి, నెలయొక్క పేరును బట్టియే నక్షత్రమునకు పేరువచ్చినదన్నను పాణిని iv, 2, 3, ప్రకారం [నక్షత్రేణ యుక్తః కాలః] నక్షత్రముయొక్క పేరులో మొదట "ఆ' (దీర్ఘము) ఉండుటకు వీలు లేదు; చివరనున్న 'ఇ' కారముకూడ అసంభవము కనుక మృగశిరానక్షత్రమున కమరసింహుడిచ్చిన 'ఆగ్రహాయణి" అనుపేరు సరియైనదికాదు. పాణినిసూత్రముల ప్రకారము యీక్రమమును తలక్రిందు చేయువలెను. ఎట్లనగ:— అసలు నక్షత్రముపేరు 'అగ్రహాయణ"(అగ్ర+హాయన) ఈనక్షత్రముయొక్క పేరునుబట్టి, యేదినమందు పూర్ణచంద్రుడీనక్షత్రమువద్దనుండునో ఆదినమునకు 'ఆగ్రహాయణి" అను పేరు పాణిని(IV, 2, 3, IV, 1, 15,) సూత్రములనుబట్టి వచ్చును. ప్రథమాక్షరమునకు దీర్ఘమును; తుదను స్త్రీలింగరూపమగు "ఇ' కారమునువచ్చును. ఈసూత్రముచేతనే "చిత్ర'' నక్షత్రమునుండి "చైత్రీ' అనుపేరు చైత్రపౌర్ణమికివచ్చినది; అట్లే ఫల్గుణినక్షత్రమునుండి 'ఫాల్గుణీ" యనుపేరు ఫాల్గుణపౌర్ణమికివచ్చినది. పాణిన్యాచార్యులవారు "ఆగ్రహాయణి' అను పదమును ,,మార్గశిరపౌర్ణమి,, అనుఅర్థములో ప్రయోగించిరేగాని 'మృగశిరానక్షత్రమ,,ను అర్థములో నెచ్చటను ప్రయోగింపలేదు.

పౌర్ణమియొక్క పేరునకు ,,ఠక్'' ప్రత్యయము చేర్చుటచే నెల యొక్క పేరువచ్చునని పాణిని [IV, 2, 22 ఆగ్రహాయణ్యశ్వత్థాట్ఠక్] సూత్రమునుబట్టి తెలియుచున్నది. ఈప్రకార

ముగ "ఆగ్రహాయణి"నుండి "ఆగ్రహాయణిక" అనుపేరు మార్గశిరమాసమునకువచ్చినది. ఈసూత్రము ననుసరించియే "చైత్రీ" నుండి "చైత్రిక" అనుపేరు చైత్రమాసమునకు వచ్చినది, పాణిన్యాచార్యులవారు "ఆగ్రహాయణిక" అనుఒక్కపదమునే "మార్గశీర్షమాసము" అను నర్థములో ప్రయోగించిరిగాని, యింకొక పదమును ప్రయోగింపలేదు. కనుక యీపదమును "అగ్రహాయణ", అనునక్షత్రపు పేరునుండియే పైసూత్రముప్రకారము గ్రహించియుండవలెను. ఇంతవరకు చెప్పినమార్పుల నిట క్లుప్తముగ వివరించెదను.

(౧) "అగ్రహాయణ":—ఇది మృగశిరా నక్షత్రముయొక్క పేరు.

(౨) "ఆగ్రహాయణి":— ఇది మార్గశిర పౌర్ణమిపేరు	దీర్ఘము: పాణిని IV,2,3. "ఈ" పాణిని IV,1,15.
(౩) "ఆగ్రహాయణిక":— ఇది మార్గశిరమాసంపేరు:	"ఠక్" ప్రత్యయం: IV, 2, 22. పాణిని:

కనుక, అసలు మృగశిరానక్షత్రముయొక్క పేరు "అగ్రహాయణ". అమరసింహుడిచ్చిన "ఆగ్రహాయణి" అను పేరు తప్పు.

మృగశిరానక్షత్రమునకు "అగ్రహాయణ" అను పేరుండుటచే అది యొకప్పుడు మొదటి నక్షత్రమైయుండవలెను. కృత్తికలు ప్రథమ నక్షత్రమైనట్లే అగ్రహాయణ లేక మృగశీర్షానక్షత్రముకూడ ప్రథమ నక్షత్రమైయుండవలెను. అనగ విషువన్ ఒకప్పుడు అచ్చటయుండి యుండవలెను. ఈవిధ

ముగ, నక్షత్రమున కివ్వవలసిన ప్రథమస్థానమును మాసమున కిచ్చుటచేత, మార్గశిరమాసము ప్రథమమాసమను భ్రమలో భగవద్గీతారచయితలును, యిటీవలి పండితులునుకూడ పడిపోయిరి. ఇట్లొక్కసారి భగవద్గీతారచయితలే పొరబాటులో పడిన పిమ్మట, తరువాత వచ్చిన వ్యాఖ్యాతలు దీనికెట్లో అతుకులుపెట్టి సమర్థింప జూచిరి. మార్గశిర మాసమునకు "ఆగ్రహాయణిక" అను పేరున్నది గనుక ఇది మొదటి మాసమని ఒక సౌరపండితుడీ గీతావాక్యమును సమర్థించెను! ఆహా! నోటికిపెట్టవలసిన కళ్ళెమును తోకకుపెట్టుటచే యెట్టి అనర్థములు వాటిల్లెనో తెలుపుటకిదియే గొప్ప నిదర్శనము. "ఆగ్రహాయణిక" అనగ మొదటి మాసము కాదు; మొదటి నక్షత్రముతో కూడుకొనియున్న పౌర్ణమిగల మాసమని అర్థము—యిట్టి మాసము మొదటి మాసముకాజాలదు. ఎట్లనగ, మనకిప్పుడు "అశ్వని" నక్షత్రము మొదటి నక్షత్రము. అంతమాత్రముచే, ఆశ్వీజమాసము (అనగ, అశ్వనినక్షత్రముతో కూడుకొనియున్న పౌర్ణమిగల మాసము) మొదటి మాసమగునా? కాదు. అట్లే, 'అగ్రహాయణ' నక్షత్రముతోకూడిన పౌర్ణమిగల "ఆగ్రహాయణిక" మాసము ప్రథమ మాసము కాజాలదు.

అయినను, కానిమ్ము; మార్గశిరమాసమే ప్రథమమాసమైనచో వచ్చిన అనర్థమేమి? ఏమనగ:— మార్గశిరమాసమే ప్రథమమాసమైనచో, హిమసంక్రమణమువద్ద మార్గశిరపౌర్ణమినాడు సంవత్సరారంభమయ్యెనని అర్థమగును. అన

గ, మృగశిరానక్షత్రము గ్రీష్మసంక్రమణములో నున్నదని అర్థమగును. ఇట్లుజరుగుట కింకను షుమారు ౬౦౦౦ సంవత్సరములైనను పట్టును; లేదా ౨౦ వేల సంవత్సరములక్రిందట నైన జరిగియుండవలెను. కనుక యిది అసంభవము. పోనీ, మార్గశిరపౌర్ణమి వసంతవిషువత్ వద్దనుండగ సంవత్సరారంభమైనదన్నచో, అదియు సరిపడదు. ఎట్లనగ:— దీనివలన మనము క్రీ॥ పూ॥ ౨౦ వేల సంవత్సరములు వెనుకకు పోవలసివచ్చును. ఇదనిరాధారమైన యంశము. కనుక, ఎటుచూచినను మార్గశిరమాస మెన్నటికిని ప్రథమమాసము కాజాలదు.

తై॥ సం॥లో చెప్పినరీతిని హిమసంక్రమణమువద్ద ఫాల్గుణ పౌర్ణమితో సంవత్సర మారంభమైనప్పుడు, వసంతవిషువత్ మృగశీర్ష నక్షత్రములోనుండెను. అనగ, మృగశీర్షమొదటినక్షత్రమయ్యెను. అందువలననే, దానికి "అగ్రహాయణ" అనుపేరువచ్చినది. మృగశిర ప్రథమనక్షత్రమని ఖండితముగ జెప్పు ప్రత్యక్ష ప్రమాణపూర్వకములగు వాక్యములు లేకపోయినను "అగ్రహాయణ" యను యీపేరునుబట్టి మనము దీనియొక్క నిజస్వభావమును కనుగొనవచ్చును. కనుక, పై తైత్తిరీయ సంహితావాక్యము నిది బలపరచుచున్నది.

ఇంకను పరీక్షించెదముగాక. వసంతవిషువత్ మృగశిరలో నున్నచో, శరద్విషువత్ మూలానక్షత్రములో నుండవలెను. 'మూలా' నక్షత్రమొకప్పుడు ప్రథమ నక్షత్రమగుటచే, దానికా పేరువచ్చెనని బెంట్లీ పండితుడు తలంచుచున్నాడు.

కాని దీనికాధారమేమియు గన్పింపదు. కాని, మనమింకొక యూహ చేయవచ్చును. వసంతవిషువత్ మృగశీర్షలోనున్న కాలములో సూర్యుడు మృగశీర్షలోనికి వచ్చినప్పుడు సూర్యాస్తమయముతోకూడ పశ్చిమదిక్కున మృగశీర్షా నక్షత్రము గ్రుంకుచుండగ, యిట తూర్పున 'మూలా' నక్షత్రము ఉదయించుచుండెడిది. మృగశిర సూర్యుని వద్దనుండుటచే గుర్తించుటకు వీలుండెడికాదు. కావున, సాయంకాలపుపూట తూర్పున మూలా నక్షత్రము ఉదయించినకాలమే విషువత్ కాలమని మనవారికి గుర్తుగనుండెడిదిగాబోలు! అందుచేతనే, దీనిని మూలా నక్షత్రమని పిలుచుచుండిరని మనమూహించుకొనవచ్చును. ఈ యూహకూడ మనసిద్ధాంతమును బలపరుచుచున్నది. ఇంకనుమరికొన్ని ప్రమాణములు విమర్శింతము.

ఫాల్గుణ పౌర్ణమితో హిమసంక్రమణమువద్ద సంవత్సరాదియగుచున్నది. అనగ, అప్పుడే ఉత్తరాయణ మారంభమగుచున్నది. ఫాల్గుణ పౌర్ణమి మొదలుకొని ౬ మాసములవరకు —అనగ భాద్రపద పౌర్ణమి వరకు—ఉత్తరాయణము. భాద్రపద పౌర్ణమి గడచిన మరుదినమునుండియు—గ్రీష్మసంక్రమణము దాటిన తరువాత—తిరిగి ఆరు మాసములవరకు దక్షిణాయనము. అనగ, భాద్రపద బహుళ పాడ్యమినుండి దక్షిణాయనము, లేక పితృయానము ప్రారంభమగును. భాద్రపద మాసములో బహుళ పక్షమంతయు పితృయానములోని ప్రథమపక్షమగును. ఆ కారణముచేతనే, మనవారిప్పటికిని

యీ భాద్రపద బహుళ పక్షమును పితృపక్షమనియు, లేక మహాలయ పక్షమనియు చెప్పుచుందురు.

ఇప్పుడు దక్షిణాయనము (పితృయానము) ఆషాఢమాసములోనికి జరిగినను మనవారిప్పటికిని యీ వెనుకటి యాచారమును మాత్రము విడువలేదు. పూర్వమొకప్పుడు వసంత విషువన్ మృగశీర్షలోనుండెనని తెలుపుటకిదియొక ప్రబల నిదర్శనము.

ఒక్క హిందువులేగాక, పారశీకులుకూడ యీపక్షమందే పితరులనర్చింతురు. కనుక, పూర్వకాలమున మృగశీర్ష యుగములో హిందువులును, పారశీకులును కలిసియుండిరనియు, అప్పుడే యీ యాచారము ప్రబలెననియు చెప్పుటకు మన కొకమంచి ప్రమాణము లభించుచున్నది. వారియొక్క నెలల పేర్లనుబట్టికూడ మనమృగశీర్ష సిద్ధాంతము ధృవపడుచున్నది.

సింహావలోకనము:—

(౧) ఒక్క తై॥ సం॥ లోనేగాకుండ, అనేకమైన బ్రాహ్మణములలోను, సూత్రములలోనుకూడ ఫాల్గుణపౌర్ణమినాడు హిమసంక్రమణమువద్ద సంవత్సర మారంభమయ్యెనని చెప్పబడియున్నది.

(౨) మృగశిరా నక్షత్రముయొక్క “అగ్రహాయణ” యను నామాంతరమునుబట్టి, అదినక్షత్రములలోనికెల్ల ప్రథమ నక్షత్రమనియు, ఆకాలమున వసంతవిషువన్ అచ్చట నుండెననియు ధృఢమగుచున్నది.

(3) మూలానక్షత్రము శరద్విషువన్‌వద్ద నుండుటచేతను,

వసంతవిషువత్ కాలములో సాయంకాలము ఆనక్షత్రము తూర్పున నుదయించుటచేతను దానికి “మూల”యనుపేరు వచ్చినది. ఈవ్యుత్పత్త్యర్థముకూడ మనసిద్ధాంతమునే బలపరుచుచున్నది.

(౪) హిందూ, పారశీకమతములలో భాద్రపద బహుళ పక్షము పితృపక్షమగుటచే భాద్రపదపౌర్ణమినాడు గ్రీష్మసంక్రమణము తటస్థించెనని తెలియుచున్నది.

ఈనాల్గంశములును మనమృగశీర్ష సిద్ధాంతమును బలపరుచుచున్నది. ప్రధానమైన నాలుగుస్థానములును (వ॥ విషువత్ గ్రీ॥సం॥; శ॥విషువత్; హి॥సం॥) సరిగనున్నవి. ఇంతకంటె యెక్కువ ప్రమాణ మేమికావలెను? అయినను, ముందు అధ్యాయములో యింకను విమర్శింతుముగాక.

మృగశీర్ష

౫ వ అధ్యాయము

మృగశిరము


నిర్మలమగు నిశీథసమయమున బ్రహ్మాండగోళమువంక దృష్టి నిగిడించి పరికించినచో యీమృగశీర్షా నక్షత్రమున్న ప్రదేశమెంతయో రమ్యముగను మనోనయనానందకరముగను గన్పట్టును. నిరుపమాన తేజమును వెలిగ్రక్కుచు జ్యోతిర్మూర్తులవలె ప్రకాశించు నక్షత్రపంచకమును, మధ్యమధ్య మిణుకు మిణుకుమనుచుండు ననంఖ్యాకములగు తారాగణములును, తత్సమీపమున బారుచుండు పాల మిన్నేటి తరంగములును బ్రహ్మాండకటాహమున కెంతయు వన్నె వెట్టుచున్నవి. అత్యంత రామణీయకమును, గంభీరమును నగు నిట్టి ప్రకృతి సౌందర్యమును కన్నులారా గాంచినప్పుడు మన ప్రాచీనపుటార్యుల కెంతటి హృదయాహ్లాదము ముప్పతిల్లెనో! సూర్యభగవానుడీ రమ్యప్రదేశమునకు వేంచేసినప్పుడు వసంతోదయమగుటచే ప్రకృతి కాంతమరింత శోభాయమానముగ వెలుంగజొచ్చెను. ఉత్తేజకరమగునిట్టి ప్రకృతిసందర్శనముచే ప్రాచీనఋషీశ్వరుల భావరసముపొంగి పొరలి వెల్లువలై యనంతముఖముల పారెననుటకేమియు సందేహము లేదు. తమ కవితామాధుర్యముచేతను, అనర్గళమగు భావనా పటిమచేతను,

ప్రాచీన ఋషీశ్వరులీ సుందరతరమును దృశ్యమును గేయములచే కీర్తించిరి; అలంకారములచే వర్ణించిరి; వాక్కుసుమములచే పూజించి యానందించిరి; ఒకరినిమించి యొకరు ఉపమానములను, ఉత్ప్రేక్షలను కల్పించిరి; గాథలనల్లిరి. యీ గాథలన్నియు వేదవాఙ్మయము నందంతటను విరివిగ గాన్పించుచున్నవి. ఈ గాథలకును, యీ అలంకారములకును సరియైన యేకవాక్యతను యింతవరకెవరును సంతృప్తికరముగ చేసియుండలేదు. కాని, వీనినన్నిటిని పరిశీలించి చూచినచో మన మృగశీర్ష సిద్ధాంతము మరింత బలపడుటకేమియు సందియము లేదు. కాన యీయధ్యాయములో యీజ్యోతిర్కూటమునకు సంబంధించిన గాథలనుగూర్చి కొంచెము విమర్శించి చూతము.

ఈ జ్యోతిర్కూటమును కొందరు "మృగముయొక్క శిరస్స'ని వర్ణించిరి; మరికొందరు "మృగ" మేయని వర్ణించిరి; మరికొందరు "మృగరూపమునుధరించిన ప్రజాపతి" యనియు లేక యజ్ఞోపవీతమును (పటకాను) ధరించిన పురుషుడ'నియు వర్ణించిరి. "నడుమునకు పటకాపెట్టుకొన్న వేటకాడ" ని గ్రీకులు వర్ణించిరి. ఈయొక్క జ్యోతిర్కూటమే యిందరికిన్ని విధములుగ నెట్లుగాన్పించెనో చూడవలెను.

మొట్టమొదట "పటకాతోనున్న వేటకాడ" ను గ్రీకుల వర్ణననుగూర్చి విచారింతము.

ఇది గ్రీకుల వేటకాని (ఓరియన్) వర్ణనము.



(లేక) యజ్ఞోపవీతధారియైన ప్రజాపతి.

పైనవ్రాసినపటమును పరిశీలించినచో వేటకానియొక్క తలయు, రెండుభుజములును, రెండు మోకాళ్లును, ఆతడు నడుమునకుపెట్టుకొన్న పటకాయు, పటకానుండి వ్రేలాడుచున్న కత్తియు గోచరము కాగలవు. ఆకాశమందు చెదరిపడియున్న యీనక్షత్రములలోనుండి ప్రాచీనులీవేటకాని రూపమునెట్లు కల్పించుకొనిరో చూడుడు! ఈరూపమునే „యజ్ఞోపవీతధారియైన ప్రజాపతి' యని హిందువులు వర్ణించిరి.

ఈనక్షత్ర సమూహమునుండియే కొందరు మృగమును (జింకను) కల్పించుకొనిరి. పైపటములోనివేటకానితలను జింకతలతోడను, వేటకానియొక్క మోకాళ్లను భుజములను జింకయొక్క నాలుగు గొరిజలతోడను పోల్చుకొనిరి; తక్కినశరీరమంతయు ఆకాశములోపల నున్నదని చెప్పిరి.

కాని, వేదవాక్యములలో జింకయొక్క తలనుగూర్చి చెప్పబడినది. జింకనుగూర్చి చెప్పబడలేదు. ఈజింక తలయేది? పైపటములో సూచింపబడిన వేటకానితలయే యీజింకతలయందుమా మనకుజింకతలయొక్క స్వరూపమువచ్చుటలేదు. కనుక, మృగముయొక్క శిరస్సును వేటకానితలతో పోల్చుటకువీలులేదు. అయితే, యిక వేదములో చెప్పబడిన మృగముయొక్క శిరస్సు యెక్కడనున్నది? శతపదబ్రాహ్మణము II, 28 లో రుద్రుడు "ప్రజాపతి తలను బాణముతో నరికెననియు, అంతట ఆతల బాణముతోకూడా ఆకాశమున కెగిరిపోయి అచ్చటనేయుండెననియు వర్ణనగలదు.

[ఇషుణాతస్య శిరశ్చిచ్ఛేద్.....ఇషుః శిరశ్చేత్యుభయమంతరిక్షు ముత్ప్లుత్య నక్షత్రాత్మనావమ్ థితంద్దృశ్యతే]

ఐ. బ్రా. III, 33 లో కూడ యిట్టి వర్ణనయేగలదు. వృత్రుడు మృగరూపమునరాగా, యింద్రుడు వానితలను బాణముతో నరికెనని ఋగ్వేదములో ననేకచోట్లగలదు. గ్రీకుగాథలలోకూడ నిట్టివరనలేగలవు. కనుక, మనకిప్పుడు" బాణ

ము గ్రుచ్చబడియున్న జింకతల" కావలెను. ఈ రూపము మనకీ క్రింది విధముగ సిద్ధించును.

పైపటములో గని, వేటకాని మొలపటకాయే:—జింకతల,తలలోని బాణము.

వేటకాని ఎడమభుజము, కుడి మోకాలు ... ... } జింకయొక్క రెండు చెవులు.

వేటకాని ఎడమమోకాలు:—జింకయొక్క ముట్టె.

వేటకాని పటకాక్రిందగాన్పించు రెండు నక్షత్రములు ... } జింకయొక్క కళ్ళు.



జింక తలమీదనున్న మూడు నక్షత్రములకే "ఇల్వల"ములని పేరు. ఇప్పటికినిఆకాశమందున్న యీ మూడు నక్షత్రములనే "మృగశిరా" నక్షత్రమని మనవారు చూపించుచుందురు. కనుక, గ్రీకుల "ఓరియాన్" అను వేటకాడును, హిందువుల "మృగశీర్ష" లేక "ప్రజాపతి" లేక "మృగరూపుడును" యజ్ఞరూపుడునునైన ప్రజాపతి"—యీ వర్ణనలన్నియు ఒక్క జ్యోతిర్కూటమునే వర్ణించుచున్నవి. ఓరియానునియొక్క మొలపటకాయే ప్రజాపతియొక్క యజ్ఞోపవీతము.

దీనినే వీట్లీపండితుడిట్లని వర్ణించెను:—సౌందర్యవతియు, ముగ్ధయునైన రోహిణిని కామాతురుడైన ప్రజాపతి వెంటనంటుచుండగ, వెనుకనుండి మృగవ్యాధుడు (Sirius) (కిరాతరూపధారియైన రుద్రుడు) తనయొక్క బాణముచేత ప్రజాపతిని పడగొట్టెను. [పటముచూడుడు]. ఈ కథయే కొలది భేదముతో పురాణాదులలో వర్ణింపబడినది. ఈ వర్ణనమంతయు బహు సమంజసముగనున్నది. ఈ విధముగ యిచ్చటనున్న నక్షత్రములనన్నిటిని ఆర్యులుగుర్తించిరి. రోహిణీనక్షత్రమే ముగ్ధమైన స్త్రీ. గ్రీకుల ఓరియాననువేటకాడే కామాతురుడైన ప్రజాపతి. దానికి వెనుకనున్న "మృగవ్యాధ" (Sirius) నక్షత్రమే కిరాతరూపధారియైన రుద్రుడు. ఈ నక్షత్రగణముప్రక్కనున్న తెల్లనిపట్టీని మనవారేమని వర్ణించిరి? దీనిని పాశ్చాత్యులు "మిల్కీ-వే (Milky-way)" (పాలప్రవాహము) అని చెప్పుదురు. మనవారు ఆకాశగంగ లేక "పాలమిన్నేరు" అని యందురు. ఈ పాలమిన్నేటిని గూర్చినగాథలేమైనగలవేమో విచారింతము.

దేవయానమొకప్పుడు వసంతవిషువత్ వద్ద ప్రారంభమయ్యెనని యిదివరలో వివరించియుంటిమి. విషువత్ మృగశీర్షలోనికివచ్చినప్పుడు, యీ దేవ పితృయానములకు సంబంధించిన గాథలనన్నిటిని తీసికొనివచ్చి యీ నక్షత్ర సమూహమునకంటగట్టిరి. తదుపరి యీగాథలనే యనేకవిధములుగ పెంచిరి. ఈరీతిని విచారింపగ, విషువనులు దేవ పితృలోకముల రెంటికి మధ్యనున్న సరిహద్దులుగ గ్రహింపబడినవి. ఆకారణముచేతనే.

విషువనులు దేవలోకమునకు "ద్వారములు" గ భావింపబడినవి. ఈ ద్వారములు కుక్కలచే కాపాడబడుచుండెను. ఋ I, 48, 15లో "ఉషస్సు దేవలోకద్వారములను వెలిగించుచున్నద" ను వర్ణనగలదు. ఋ I, 13, 6; II, 3, 5 లలో కూడ యీ ద్వారములను గూర్చిన ప్రశంసగలదు. వాజసనేయ సంహితలో కూడ యిట్టి ప్రసంగమేగలదు. యజ్ఞవేదిక నమర్చుటలోకూడ యీ ద్వారము లీగోళమును రెండు సమభాగములుగ విభజించుచున్నట్లు యేర్పాటుచేయబడినది. గ్రీకుపురాణములలోకూడ యిట్టి వర్ణనలేగలవు.

పారశీకుల ప్రాచీనగ్రంథములుకూడ యిట్లే వర్ణించినవి. ఈవిషువన్ అనునది దేవలోకమునకు ద్వారమనియేగాకుండ, యిదియొక "వంతెన" యనికూడ చెప్పబడియున్నది. దీనికి "చిన్ వత్ వంతెన" అని పారశీగ్రంథములలో పేరుపెట్టిరి. ఇది దేవపితృలోకముల రెంటిని కలుపునట. ఈవంతెనను కుక్కలు కావలాకాయుచుండునట. ఈకుక్కలసహాయముతోడనే చనిపోయిన మనుష్యులయొక్క ఆత్మలు యీవంతెనను దాటి పితృలోకమునకు పోవునట. దీనికిని హిందూగాధలకును సామ్యముగలదు. నరకద్వారమువద్ద మూడుతలల కుక్కయుండుననియు, యమలోకమునకు పోవుత్రోవలో నాలుగుకండ్లుగల యమునికుక్కలుండుననియు ఋX,14,10 లో వర్ణింపబడియున్నది. దీనిలోని భావమేమి? విషువత్ ఒకప్పుడు మృగశీర్షలోనుండెనని తలచినచో దీనికి చక్కని సమాధానము కుదురును. విషువత్ అనునది దేవయమలోకముల మధ్య

నున్న ద్వారము. "శ్వాన్", "ప్రశ్వా"—అనునక్షత్రములు రెండును యీద్వారమును గాపాడుచున్నకుక్కలు(ఈరెంటిమధ్య నుప్రవహించుచున్న పాలమిన్నేరే వైతరణీనది) ఈనదిమీద నున్న వంతెననే పారశీకులు "చిన్వత్" వంతెనయందురు. ఈ వంతెన "దేవపితృలోకములమధ్య ప్రవహించుచున్ననది మీదకట్టబడియున్నద"ని గియర్ పండితుడువర్ణించెను. యమలోకమునకుచేరకముందు ఆత్మలన్నియు "వైతరణీ" నదినిదాటవలసియుండునని మనపురాణములలో గలదు. గ్రీకులలో కూడ నిట్టిప్రశంసయేగలదు. ఈ వైతరణిఅనగనేమి? పైనుదహరింపబడిన "పాలమిన్నేరే". ఇదే దేవపితృలోకములమధ్యనున్నది. దీనికే తదుపరి "స్వర్ నది" అనేపేరువచ్చినది. ఈ నదిలో నొక "నౌక" గలదనియు యీనదికి రెండువైపులను కుక్కలు కావలాకాయుచున్నవనియు గ్రీకులువర్ణించిరి. ఈ నౌకను ముఖపటములో చూడనగును. ఋX,63,10, లో ఈ నౌకనుగూర్చిన ప్రశంసగలదు. 'దేవలోకమునకు చేరుటకై మంచిచుక్కానిగల దేవనావలో (దైవీంనావం) పోవలెను,, అని యిచ్చట వర్ణింపబడెను. ఈవిధముగ జూచినచో వైతరిణిలో నొకనావ యున్నదనియు, యీనదికి రెండుప్రక్కల కుక్కలు కావలాయున్నవనియు మనగ్రంథములలోకూడ గలదు. హిందూ, పారశీక, గ్రీకుగాథలనుబట్టి, మనకు ఆకాశమందు ప్రత్యక్షముగ గాన్పించు తెల్లనిపట్టియే వైతరిణియనియు, అందలి నక్షత్రములే నావయనియు, దాని కిరుప్రక్కలనున్న నక్షత్రగణములే యమునికుక్కలనియు, యిచ్చట

విషువత్ ఉండుటచే యీనది దేవయమలోకములమధ్య నున్నదనియు, మనపూర్వులు తమపురాణగాథలను తీసికొనివచ్చి తమకాకాశమందు ప్రత్యక్షముగ గాన్పించు తారాగణములతో పోల్చిరనియు సిద్ధించుచున్నది. దీనిపై నింకను వన్నెలు చిన్నెలు గలవు.

వసంత, గ్రీష్మ, వర్షర్తువులు దేవయానమని శతపథబ్రాహ్మణముII, 1, 3, 1, లోనున్నది. "కుక్కతో సంవత్సరారంభమయ్యె' నని ఋI, 161, 13, లోనున్నది. దీనినిబట్టి విషువత్ ఒకప్పుడు మృగశీర్షలోనుండెనని సిద్ధించుచున్నది.

ఋగ్వేదమందలి కుక్కలకును పారశీగ్రంథములోనికుక్కలకును చాలవరకు పోలికగలదు. "వెండిడాడ్" అనుపారశీగ్రంథములో యీకుక్కలను 'పెషుపన' అనివర్ణించిరి.—అనగ, ,,యమలోకమునకు పోవుత్రోవనుకాపాడుచుండు" అని అర్థము. ఈకుక్కలనే 'చత్రుచష్మె'' అనిపారశీగ్రంథములోను ,,చతుర్-అక్షొ,, అనిఋగ్వేదములోను (X, 14, 11) వర్ణించిరి. ఈ రెండుపదములును సమానార్థకములే (అనగ ,,నాలుగుకండ్లుగల,, అనిఅర్థము. కాని, వీనిరంగుమాత్రము భిన్నముగ వర్ణింపబడినది. పారశీగ్రంథములు వీనిని పసుపుపచ్చరంగుగల కుక్కలనివర్ణించినవి. కాని, యమునికుక్కలకు ,,శబలౌ,, (పొడలుగల) అనువిశేషణమును ప్రయోగించిరి. ఈభేదమంతగ గమనింపదగినది కాదు. అయినను, సూర్యుని మృగములు ,హారిత, (పసుపు) వర్ణములు గలవని ఋX, 8[illegible], 3

లో వర్ణనగలదు. ఈ కుక్కలును, మృగమును ఒకచోటనుండుటచే ఒకదానిరంగు మఱియొకదానికి చెప్పియుండవచ్చును. ,,మృగ,, మనగ మృగశీర్షలోనున్నమృగమని అర్థము చేసికొన్నచో పారశీవర్ణనమునకును దీనికిని విశేషభేదముండదు. ,అదిగాక, యమునివద్ద దూతకృత్య మొనర్చు కుక్కలు ,,శ్యామ,, ,,శబల,, వర్ణములుగలవని అథర్వవేదముVIII, 1.9లో వర్ణనగలదు. ఈవర్ణనము పారశీవర్ణనమునకు సరిపోవుచున్నది. ఈరీతిగపోల్చి చూచినచో, పారశీగ్రంథములలోని కుక్కలును ఋగ్వేదమందలి కుక్కలును ఒకటేనని తేలుచున్నది.

ఋగ్వేదములో వర్ణింపబడిన ,,సారమ,, యనునది యీ కుక్కయే కావచ్చునని మన మూహింపవచ్చును. ఈయూహను బలపరుచుట కొకచిన్నకథ గలదు. ఇంద్రుడు తనయావులను (వెలుతురును) వెదకుటకై ,,సారమ,,ను (కుక్కను)పంపెనట: కాని, యీయావుల నెత్తుకొనిపోయిన వృత్రుడు యీ ,సారమ, కు పాలుపోసి (లంచమిచ్చి) పంపివేసెనట. అంతట ,సారమ, మరలివచ్చి తనకెచ్చటను ఆవులు కనిపించలేదని యింద్రునితో అబద్ధ మాడెనట. అంతట యింద్రుడు ,సారమ, ను తన్నెనట. తన్నగనే ,సారమ, పాలను వెడలగ్రక్కెనట. అదిగాక, ఋIV,57,5 లో ,,శునాశీరు,, లను గురించి యొకప్రార్థన గలదు. మీరు దేవలోకములో చేయు పాలను మాభూమిమీదకు వర్షింపజేయుడని యొకప్రార్థన

గలదు, ఈపాలు యేమైయుండవచ్చును ఇవి 'పాలమిన్నే'టి, లోని పాలైయుండవలెను. ఈసారమ, సునాశీర యనునవి యీయేటిదరిని కాపలాయున్న కుక్కలైయుండవలెను. ఈ యంశమునే మాక్సిముల్లరు పండితుడుకూడ బలపరుచు చున్నాడు. 'సునాశీరా' అనుపదమునుండి 'శీర్య' యను పదము పుట్టియుండవచ్చుననియు, దానినుండి 'సిరియస్' (Sirius) అనుపదము పుట్టియుండవచ్చుననియు, ఆత డూహించెను. 'శ్వన్' అనునక్షత్రమునకే 'సిరియస్' అని యింగ్లీషుపేరు. కనుక యీపోలిక సరిగనే యున్నది. అదిగాక, శతపథబ్రాహ్మణము II, 1,2,9 లో మృగశీర్షను గురించి ప్రశంసించుచు, రుద్రునిచే పొడువబడిన ప్రజాపతి శరీరమునకు 'వాస్తు' అని పేరుపెట్టిరి. ఈవాస్తును కాపాడుట కై 'వాస్తోష్పతి' కుక్కరూపమును ధరించెనట. ఈకుక్కకు ఋVII, 55,2—లో 'సారమేయ' యను నామముగలదు, ఈసారమేయము యెర్రగను, ప్రకాశమానముగను గలదట. దీనికోరలు మిక్కిలి తీక్ష్ణమైనకాంతులతో మెరయుచున్న వట. ఈవర్ణనము 'శ్వన్' నక్షత్రవర్ణనతో సరాసరి సరిపో వుచున్నది. ఆకాశమందలి నక్షత్రములలోనికెల్ల యీ 'శ్వన్' నక్షత్రము మిక్కిలి ప్రకాశమానమైనది. దీనికంటె ప్రకాశ మానమైన నక్షత్ర మింకొకటిలేదు. వాస్తోష్పతికుక్క రూప ముతోవచ్చి ప్రజాపతిశరీరమును కాపాడుచున్నాడను వర్ణన మెంతయు సమంజసముగనున్నది. ఇది మనసిద్ధాంతమును బలపరచుచున్నది.

దీనియన్నిటికంటెను యింకను బలవత్తరమైన ప్రమాణ ములుగలవు. ఋI, 161,13లో 'సంవత్సరాంతమందు శ్వాన మువచ్చి ఋభువులను (ఋతువులకధిష్ఠానదేవతలను) మేల్కొ లిపెను' అనియున్నది. దీనికర్థమేమి? 'శ్వాన' మనగ 'గాలి' యని శాయనాచార్యుల వారర్థము జెప్పిరికాని, యిదతప్పు ఋI,105,11—నుగూర్చి శాయనులవారుచేసినవ్యాఖ్య సరిగ నున్నది. అచ్చటనేమున్నదనగ:—'యమలోకజలములను దా టివచ్చి శ్వానము తూర్పుదిక్కున గన్పట్టెనట! వెంటనే ఆ శ్వానము సూర్యకిరణములలో మునిగిపోయెనట—దీనిభావము స్పష్టమగుచునేయున్నది. అనగ, పితృయానము పూర్తికాగనే వసంతవిషువత్ వద్ద శ్వానము—'శ్వన్' నక్షత్రము—గన్ప ట్టెననుట స్పష్టము.

ఋగ్వేదములో వర్ణింపబడిన కుక్కలు ఎరుపు, నలుపు, వగైరా రంగులు గలవిగను ప్రకాశమానమైనవిగను, నాల్గు కండ్లుగలవిగను, యమలోకమును యమలోకమార్గమును కా పాడుచున్నవిగను, పాలను వెడలగ్రక్కుచున్నవిగను, పాలను చేయుచున్నవిగను, సంవత్సరమును ఉపక్రమించు(ప్రారంభించు) చున్నవిగను, గన్పట్టుచున్నవి. దీనినిబట్టి గ్రీకు, హిందూ, పార్సి, గ్రంథములలో వర్ణితమైన కుక్కలన్నియు ఒకటెనని అర్థమగు చున్నది. అనగ, ఆకాలమున,—యీ జాతులన్నియు ఒకచో టనే కాపురమున్నప్పుడు—శ్వాననక్షత్రము (Dog-Star) వద్ద విషువత్ ఉండగ, నూతనసంవత్సరాదియు, దేవయానము ప్రారంభమయ్యెడివని మొత్తముమీద సారాంశము.

అయితే, యీకుక్కలకు నాల్గు కండ్లెక్కడనుండివచ్చినవి.? ‟పాలమిన్నేటి” దరినున్న నాల్గు నక్షత్రములే ‟శ్వాన” నక్షత్రము. ఈనాల్గునక్షత్రములను నాల్గుకండ్లుగపోల్చిరి. ఈ ఈనాల్గుకండ్లును తలమీదనే యుండనక్కరలేదు. (ఇంద్రుని కండ్లు శరీరమునందంతటను వ్యాపించినట్లే) యీ కుక్కలకండ్లుకూడ శరీరమందంతటను వ్యాపించియున్నవన్నచో దోషమేమి? ఈకుక్క ‟నీటిలో”నుండి పుట్టినదనియు, దీనిగృహము ఆకాశమందున్నదనియు, ఇది తనకాంతిచే నలుదిక్కులను వెలింగించుచున్నదనియు అథర్వవేదము VI, 80, 3 ను బట్టి గ్రహింపవచ్చును.

సూర్యునితో కూడ యీ శ్వానముదయించునప్పుడు వసంతోదయమయ్యెను. వసంతర్తువు మిక్కిలి ఆనందసంధాయకముగ నుండును. ప్రకృతికాంత నవనవారుణకాంతులతో శోభిల్లుచుండును. సాత్త్వికతేజోనిధియైన విష్ణుమూర్తియందు విశిష్టమైయున్న అనంతకల్యాణ గుణములనుదాల్చి వసంతుడా కాలమున ప్రకృతికాంతతో జగన్మోహనాకారముగ క్రీడసల్పుచుండును.

మరియు, యీ శ్వానము దేవయానాంతరమందు—అనగ, సూర్యుడు శరద్విషువత్ వద్దనున్నప్పుడు— సూర్యాస్తమయము కాగనే తూర్పునగన్పట్టును. సూర్యాస్తమానమందు తూర్పుదిక్కున శ్వానముదయించినప్పుడది వర్షాంతము నుదెలుపును. ఆకారణముచేతనే, యీశ్వాననక్షత్రమునకు ‟వర్ష—నక్షత్రము,, అనికూడ పేరువచ్చియుండును. వర్షాంతమైనను అప్పటికింకను మేఘములుండియుండవచ్చును. ఉరుములు, మెరుపులతో ఆకాశము భయంకరముగ గన్పట్టియుండవచ్చును. ఈరీతిని శ్వాననక్షత్ర మొకప్పుడు సాత్త్వికగుణప్రధానమైన వసంతమును, మరియొకప్పుడు భయంకరరూపమైన వర్షర్తువు సూచించెను.

యమలోకద్వారమువద్ద ‟కెర్ బెరోస్,,—‟ఆర్ థ్రోస్,,— అను రెండుకుక్కలు గలవని గ్రీకుగాథలలో గలవు. ‟కెర్-బెరోస్,, అనగ ‟శార్వర,, అనియు, ‟ఆర్ థ్రోస్,, అనగ ‟వృత్ర,, అనియుశబ్దశాస్త్రజ్ఞులు నిర్ణయించిరి. అయితే, వృత్రుడీయమద్వారముకడ నేలయుండవలెను? ఈ‟ఆర్ థ్రోస్,,- (వృత్రుడు)— ‟హెరాక్లిస్,, చేత చంపబడెనట. దీనిభావమేమి? ఇంద్రశత్రువునకు వృత్రుడనియు, నముచియనియు ననేకపేర్లుగలవు. ఈవృత్రుడు మృగరూపముధరించి పోరాడెనని ఋగ్వేదములో పలుతావులందు గలదు. ఇంద్రుడీ మృగరూపధారియైన వృత్రుని తలనరికెను. అయితే, రుద్రుడు మృగరూపధారియైన ప్రజాపతి తల నరికెనని పైనచెప్పితిమి. ఈరెండుతలలును (మృగశీర్షములును) ఒక్కటేనా? ఇంద్రుడు నముచితలను యెచ్చటనో దూరప్రదేశములో (పరావతి) నరికెనట; ఎచ్చటనో తెలియదు. కాని, యింద్రుడు నముచితలను నరుకుటచే దేవయానమార్గము ఖాళీయయ్యెనని ఋ X, 73,7 లో గలదు. అనగ, యింద్రుడు నముచితలను దేవయానద్వారమువద్ద నరికెననిస్పష్టమగుచున్నది. వా

జననేయసంహిత 10—14 కూడ దీనిని బలపరచుచున్నది. ఈయజ్ఞములో పురోహితుడొకలోహపుముక్కను పులితోలుతో కప్పి యజమానునిచుట్టుత్రిప్పి, వసంతము మొదలు శిశిరమువరకు ఋతువులపేర్లన్నియుచదివి, తుదకు—"ఇదిగో, నముచితల పారవేయబడినది," అనిచెప్పి, దానిని దూరముగ పారవేయునట. అనగ, నముచితల సంవత్సరాంతమందు (శిశిరాంతమందు)— పితృయానాంతమందు— దేవయానద్వారము వద్ద నరికివేయబడినదని భావార్థము. దీనినిబట్టి "ఆర్ థ్రోస్,"-(వృత్ర)- యనుద్వారమువద్ద నేలనుండెనో, దానిని "హెరాక్లిస్," యెట్లుచంపెనో స్పష్టమగుచున్నది. దీనినిబట్టి చూడగ, ఒకనక్షత్రగణమునే కొందరు ఋషులు ప్రజాపతితలతోడను, కొందరు వృత్రునితలతోడను పోల్చిరి. అనేకఋషులనేకరీతులుగ తమగాథలనెల్ల తీసికొనివచ్చి తమయిష్టము వచ్చినట్లు యీనక్షత్రముల కంటగట్టుచుండిరనుట స్పష్టము.

గ్రీకు గ్రంథములలో వర్ణింపబడిన "ఆర్ థ్రోస్"—అను మొదటి కుక్కనుగూర్చి చెప్పితిమి. ఇక రెండవ కుక్క పేరు "కెర్ బెరోస్" దీనిని మృగశీర్షలోనున్న మూడు నక్షత్రములతో (ఇ॒ల్వకానక్షత్రములతో) పోల్పవచ్చును. దీనికే మూడు తలల కుక్కయని గ్రీకు గ్రంథములలోగలదు. దీనిని "ఇ॒ల్వకా," తో—అనగ, "త్రిశీర్షా" అని ఋ X, 99, 6 లో వర్ణింపబడినదానితో—పోల్పవచ్చును. ఇంద్రుడు మూడు తలలును, ఆరు కండ్లును గలిగినట్టి రాక్షసినిచంపెనని X, 99, 6 లో గలదు. వృత్రాసురుని (ఆర్ థ్రోస్) తలను గ్రీకులు కుక్కగ పోల్చిరి. హిందువులు మృగముగ పోల్చిరి. ఆరీతినే, "ఇ॒ల్వకా" నక్షత్రములను గ్రీకులు "మూడు తలలకుక్క" గ (కెర్ బెరోస్)—పోల్చిరి. హిందువులు "త్రిశీర్షా" అను రాక్షసిగ పోల్చిరి. ఈరెంటిని చంపినవానికి 'హెరాక్లిస్' అని గ్రీకులు పేరుపెట్టిరి; దీనికే హిందువులు 'ఇంద్రుడ' ని పేరుపెట్టిరి. మృగశిరానక్షత్రములును శ్వాననక్షత్రములును బహు సమీపమునందుండుటచే వానిలో వానికే కొందరు మృగమనియు, కొందరు కుక్కయనియు, అనేకు లనేకరీతులుగ పేర్లు పెట్టియుందురు. కనుక, యీపోలికలను దూరముగనుంచి మొత్తముమీద భావార్థమును గ్రహించుటయే మనకర్తవ్యము.

ఈ పురాణగాథలింకను పూర్తిగాలేదు. ఇంద్రుడును నముచియు నొక ఒడంబడిక చేసికొనిరట—'రాత్రి పగలుగాని సమయమందునను, తడిపొడిగాని ఆయుధముతోడను' ఇంద్రుడు నముచిని చంపవలెనట. ఈ ఒడంబడిక తండ్య బ్రాహ్మణము XII, 6, 8-లో నున్నది. ఇంద్రుడు తుదకు నముచిని ఆప్రకారమే చంపెనట. రాత్రిపగలు—దేవతలకు రాత్రిపగలు కానిసమయమందు, అనగ దేవపితృయానముల సంధికాలములో ఇంద్రుడు నముచిని చంపెను. అనగ, సంవత్సరారంభమందు దేవయాన ద్వారమువద్ద చంపెనని పైనవివరించితిమి. ఇక తడిపొడిగాని ఆయుధ మేది? నీటిపై నురుగు. ఋ VIII, 14, 13లో యింద్రుడు నముచి తలను నీటి నురుగుతో నరికెననివర్ణింపబడియున్నది. ఈనురుగు యెక్కడిది?

దీనిభావమేమి? ఇంద్రుడు నముచిని దేవయాన ద్వారమువద్ద చంపెను. అచ్చటనే పాలమిన్నేరుగలదు. కనుక, యీనురుగు ఆయేటిలోనిదే. ఆకాశమునంత నొకసముద్రముగను, నక్షత్ర గణములు నందలి నురుగుగను కవులు వర్ణింతురు. మహిమ్న స్తోత్రములలో రుద్రుని స్వరూపమిట్లు బహుమనోహరముగ వర్ణింపబడినది.

[నేదం నభోమండల మంబురాశిర్నైతాశ్చతారా నవ ఫేనభంగా। వియద్వ్యాపీ తారాగణగుణిత ఫేనోద్గమరుచిః। ప్రవాహో వారాంయః పృషతలఘు దృష్టశ్శిరసితే। జగద్ద్వీపాకారంజలధివలయం తేన కృత। మిత్యనేనైవోన్నేయం ధృతమహిమదివ్యం తవ వపుః॥

ప్రజానాథంనాథ ప్రసభమభికంస్వాం దుహితరం। గతం రోహిద్భూతాం రిరమయిషు మృష్యస్యవపుషా। ధనుష్పాణేర్యాతం దివమపిసపత్నీకృతమముమ్। ననంతం తేఽద్యాపిత్యాజతిన మృగవ్యాధరభసః॥]

ఇది జటాజూటమందు గంగను ధరించిన శివునివర్ణనము. రుద్రుని తలమీదనున్న గంగాప్రవాహములోని నురుగులు ఆకాశములోనున్న నక్షత్రములచే మరింతశోభాయమానముగ ప్రకాశించుచున్నవి.

ఈశ్లోకమందు రుద్రుడు ప్రజాపతితలను నరుకుటకూడ వర్ణింపబడినది. ఈకథయంతయు ఆకాశమందు వర్ణితమై యున్నదని యాకవి చెప్పుచున్నాడు. కిరాతరూపధారియైన రుద్రుని (మృగవ్యాధనక్షత్రము) మీదుగ ప్రవహించుచున్న పాలమిన్నేటిచే యీకథ వ్యక్తమగుచున్నది.

మహిమ్నస్తోత్రకారునకే పాలమిన్నేటిలో నురుగులు గాన్పించినప్పుడు వేదకాలమునాటి ఋషీశ్వరులకు గన్పించుటలో నాశ్చర్యమేమి? పార్శీగ్రంథములలోకూడ నిట్టిగాథయే గలదు. కనుక, ఒకప్పుడు మృగశీర్ష నక్షత్రమువద్ద విషువ మండెనని యూహించినచో యీ నముచివృత్తాంతమును బహు సమంజసముగ అర్థము చేసికొనవచ్చును. ఇంకొకవిధముగ నముచి వృత్తాంతమునకు భావార్థము కుదురదు.

కిరాతవేషధారియు, భయంకరరూపుడునైన రుద్రుడు మృగరూపధారియైన ప్రజాపతివెంట బరుగెత్తెనను గాథనెట్లు సమర్థింపవచ్చును. రుద్రుడు తనజటాజూటమందు గంగను ధరించెను. ఆతనికి రుద్రభూమియే ప్రియమైనవాసస్థానము. రుద్రుడు కిరాతరూపధారి. ఈవర్ణనల నెట్లు సరిపుచ్చవచ్చును. ఆకాశమందు గన్పించుచున్న మృగవ్యాధనక్షత్రమే రుద్రుడు; మృగవ్యాధుడనగ కిరాతుడు. ఈనక్షత్రమునకు పైభాగమందు గాన్పించు తెల్లనిప్రవాహమే (పాలమిన్నేరే) రుద్రుని జటాజూటమందున్న గంగాప్రవాహము. ఈనక్షత్రము పితృయాన సమీపమందుండుటచే రుద్రుని ప్రేతభూమి నివాసమును దెలుపుచున్నది. ఈమృగ వ్యాధనక్షత్రమునకు ముందున్న మృగశిరానక్షత్రమే మృగరూపుడైన ప్రజాపతి; దీనికి ముందున్న రోహిణీనక్షత్రమే ప్రజాపతి కూతురైన రోహిణి.

ప్రజాపతి కామాతురుడై తన కుమార్తెయైన రోహిణివెంట బడుచుండగ, వెనుకనుండి కోపముతో రుద్రుడు కిరాతరూపధారియై పరుగెత్తుకొనుచువచ్చి తన బాణముతో మృగరూపుడైన ప్రజాపతితలను నరికెను.

మన సిద్ధాంతమును బలపరచుచు సంవత్సరారంభమును సూచించు కథలింకనుగలవు. ''వృత్రుని చంపినచోటనే,, సంవత్సరము ''సముద్రములోనుండి లేచివచ్చినది,, ఋ X, 192, 2లో గలదు, ఈరీతిగనే వసంతవిషువత్ మృగశీర్షలో నున్నప్పుడు మృగరూపుడైన ప్రజాపతి సంవత్సరము నుపక్రమించెనని చెప్పవచ్చును. రుద్రుడు ప్రజాపతిని చంపెను. ప్రజాపతి=సంవత్సరము=యజ్ఞము=యివన్నియు సమానార్థకములే. రుద్రుడు యజ్ఞరూపధారియైన ప్రజాపతిని సంవత్సరారంభమందుచంపెను.అందుచేతనే రుద్రునకు "యజ్ఞధ్వంసి,, యను పేరువచ్చినది. రుద్రుడు దక్షాధ్వరధ్వంసియను పురాణగాథకలదు. మహాభారతము; సౌప్తికపర్వము 18, 13-14-లో [తతఃసయజ్ఞం వివ్యాధరౌద్రేణహృదిపత్రిణా । అపక్రాంతస్తతోయజ్ఞో మృగోభూత్వాసపావకః । సతుతేనైవ రూపేణదివంప్రాప్య వ్యరాజత్ । అన్వీయమానో రుద్రేణ యుధిష్ఠిర నమస్తలే॥—

'రుద్రుడు తన బాణముతో యజ్ఞము (ప్రజాపతి) యొక్క హృదయములో గ్రుచ్చెను. ఇట్లుపొడువబడియజ్ఞము నిప్పులు గ్రక్కుచు మృగరూపముతో ఆకాశమునకెగసెను. ఈప్రకారముగ రుద్రునిచే తరుమబడుచు యీ మృగము ఆకాశమందు వెలుగుచున్నది" ఈకారణముచే రుద్రునకు ''యజ్ఞధ్వంసి'' యను పేరువచ్చినది.

కొన్నిచోట్ల ప్రజాపతియేయజ్ఞరూపమునుధరించితనంతట తానే దేవతలకు యజ్ఞార్థమై సమర్పించుకొనెనని వర్ణింపబడియున్నది. [తండ్య బ్రాహ్మణము: VI1, 2, 1] అంతట దేవతలు ప్రజాపతిని వారియుదయకాలమందుచంపి యజ్ఞమును చేసిరట. కనుక ప్రతివారును సంవత్సరారంభమందు అశ్వమేధము చేయవలెనని తై॥ బ్రా॥ 1II, 9, 22 లో చెప్పిరి. ఈకథలయొక్క భావార్థము తెల్లమగుచునేయున్నది. అనగ, మృగశీర్షవద్ద సంవత్సరారంభమయ్యెనని తాత్పర్యము. ఇది కాలసూచకమైనకథ.

పార్శీ గ్రంథములో 'తిస్త్ర్య' అను నక్షత్రముగలదు. 'తీర్ త్రేయా' అను పారశీనెల మనమార్గశీర్షమాసముతో సరిపోవుచున్నది. కనుక, యీ 'తిస్త్ర్య' నక్షత్రమును మన 'ఇల్వకా'లతో పోల్చవచ్చును. ఈపదము 'త్రి—స్త్రి' నుండి యుత్పన్నమైయుండవచ్చును, "త్రిస్త్రి" అనగమూడు నక్షత్రములని అర్థము. ఈమాటక్రమముగ. 'తిస్త్ర్య', 'త్రిస్తర్' అనురూపాంతరములను పొందును. 'తిస్తర్' లేక 'తీర్' అనగ 'బాణ' మని పార్శీ అర్థము. రుద్రుని బాణములో మూడు నక్షత్రములున్నవని ఐతరేయ బ్రాహ్మణములోగలదు. కనుక యీవర్ణనము సరిపోవుచున్నవి.

కనుక పార్సీ భాషలోని 'తిస్త్ర్యి' అను పదమును, గ్రీకు భాషలోని 'కెర్‌బెరోస్' అనుపదమును, సంస్కృతములోని 'త్రిశీర్షా' యను పదమును సమానార్థకములే. ఇవన్నియు మృగశీర్షలోని 'ఇల్వలా' నక్షత్రములను తెల్పుచున్నవి. దీనికే రుద్రుని బాణమనియు, ఓరియానుని మొలపటకాయనియు అనేకవిధమైన గాథలుపుట్టినవి.

వసంతవిషువత్ మృగశీర్షలోనున్నదని చెప్పినచో, మన పురాణములలోని త్రిమూర్తుల గాథలను సరళముగ సమన్వయింపవచ్చును. విష్ణుమూర్తి తన సత్వగుణముచే ఆనంద సంధాయకమగు వసంతర్తువు గల్పించుచున్నాడు. రుద్రుడు భీకరాకారమునుదాల్చి ఉరుములను మెరుపులను గల్పించుచున్నాడు. ప్రజాపతి నూతన సంవత్సరము నుపక్రమించుచున్నాడు. ఈత్రిమూర్తులును ఒకచోటనే కూడియున్నారు. ఇచ్చోటనేవిష్ణుమూర్తి వరాహమునుచంపెను. (ఋ I,61,7) ఇచ్చోటనే యింద్రుడు వృత్రాసురుని సంహరించెను. ఇచ్చోటనే రుద్రుడు మృగరూపుడైన ప్రజాపతిని వెంటనంటెను. ఇచ్చోటనే, దేవపితృలోకమును వేరుచేయు ఆకాశగంగా ప్రవాహము ప్రవహించుచున్నది. ఈనదిని (వైతరణిని) దాటియే యమలోకమునకు పోవలసియున్నది. ఈరీతిని చూచినచో త్రిమూర్తులును యీఒక్క తావుననే చేరియున్నారు. దీనినే తరువాతి కవులు వర్ణించినట్లు, త్రిశిరములు దాల్చిన దత్తాత్రేయుడును, ఆతనివెంట శ్వాన (కుక్క) రూపములధరించిన చతుర్వేదములును, ఇచ్చట మూర్తీభ

వించినవని చెప్పవచ్చును. ఇల్వకములనబడు యీమూడు నక్షత్రములే దత్తాత్రేయుని మూడుశిరములు; ఆవెంటనున్న శ్వాననక్షత్రమే చతుర్వేదములు. ఈగాథలన్నియు యింత మనోహరముగ, ఒక్కచోటనే, కలిసియున్నతావు యీఖగోళమందు మరియెచ్చటను కానరాదు.

మృగశీర్ష

ఆరవ యధ్యాయము

—♦ ఓరయన్; అతని మొలపటకా ♦—

హిందూ, గ్రీకు, పారశీకులు మొట్టమొదట కలిసియున్నప్పుడే యీమృగశీర్షానక్షత్రమును పూర్తిగ గుర్తించిరని యీక్రింద జెప్పబోవు గాధలవలన మరింతస్పష్టముగాగలదు. ఈమూడు జాతులవారి గాధలును ఒక్కపోలికగలవే యగుటచే యీసిద్ధాంతము మరింత బలపడుచున్నది. ఒకప్పుడు వసంతవిషువత్ మృగశీర్షానక్షత్రములో నుండియుండిననేగాని యీగాధలకు సరళమైన భావార్థము కుదురదు.

,,అగ్రహాయణ" యనుపేరు పాణినికాలములోనుండెనని పైన వివరించితిమి. ఇదియొక నక్షత్రమునకు పేరుగనుండెను. పాణినికంటె పూర్వకాలమందుకూడ యీశబ్ద మీయర్థములో ప్రయోగింపబడియుండవలెనని మన మూహింపవచ్చును. అయినను, యిట్లూహించుట కాధారమేమైన గలదేమో విచారింతము. ,,హాయన" యను పదము ఋగ్వేదమందు గానరాకపోయినను అధర్వవేదమందును బ్రాహ్మణములందును యీపదము గాన్పించుచున్నది. ,,హాయన" యనుపదము ,,హా"= వెళ్లుట యను ధాతువునుండియు, ,,అయన" శబ్దము ,,ఇ" లేక ,,ఐ,,= వెళ్ళుట యను ధాతువునుండియు యుత్పన్నమైనవని పాణిని (VIII, 1,48) చెప్పుచున్నాడు. ,,హాయన', శబ్దమునకు ,,కాలము,, లేక "వ్రీహి యనుధాన్యము అని రెండర్థములను పాణిని చెప్పుచున్నాడు. ఈశబ్దమునకు రెండర్థము లెట్లువచ్చినవో మన మింకొకరీతిగ వ్యుత్పత్త్యర్థమునుదీసివివరింపవచ్చును. ,హాయన శబ్దమును కాలవాచికములగు ,,అయన,, ,,అగ్రయన,, శబ్దములతోడను, వానినుండి యుత్పన్నమైన షాణ్మాసక్రతువులతోడను పోల్చిచూడవచ్చును. ఎట్లనగ:—సంవత్సరమును దేవయానమనియు పితృయానమనియు రెండుసమభాగములుగ విభజించుట బహుప్రాచీనమైన యాచారమనుట కెంతమాత్రమును సందేహములేదు. ఇచ్చట ,,అయన,, శబ్దము కాలవాచికముగ నున్నది. దీనికి ముందు ,,హా,, కారమును చేర్చినచో ,,హాయన,, యనుపదము వచ్చును; ఇదియే తదుపరి ,,హాయన,, యనుపదముగ మారియుండవచ్చును. ఈరీతిగ, ,ఐ, లేక ,ఇ, అను ఒక్కధాతువునుండియే ,,అయన,, ,,హాయన,, శబ్దములు రెండును కాలవాచికములుగ సిద్ధించుచున్నవి. పాణినివలె రెండుధాతువులను గ్రహింపవలసిన పనిలేదు. ,అయన, శబ్దము క్రమముగ ,హాయన, మైనప్పుడు, ,అగ్రయన, శబ్దముకూడ క్రమముగ ,,అగ్రహాయన,, మగును. ఈరెంటిలో ,అయన, శబ్దము అర్ధసంవత్సరమును హాయనశబ్దముపూర్ణసంవత్సరమును సూచించుటకు ప్రయోగింపబడి యుండవచ్చును.

,అయన, శబ్దము మొట్టమొదట గమనమును అనగ సూర్యగమనమును సూచించెను. అటుపిమ్మట కాలవాచిగ మా

తెను. దానినుండియే "అగ్రయనేష్టు" లను షాణ్మాసక్రతువులు పుట్టినవి. ఈక్రతువులు సంవత్సరమునకు రెండుసార్లు —అయనారంభములందు—ఆచరింపబడుచుండెడివి. అశ్వలాయన శ్రౌతసూత్రములపై వ్యాఖ్యానముచేయుచు గార్గ్యనారాయణుడు 'అగ్రయన' శబ్దమున కిట్లు అర్థము వ్రాసెను. "అగ్ర+అయన" 'అయన' అనగ 'తినుట' యని యర్థము చెప్పెను. అనగ, ఈక్రతువుచేసిన పిమ్మట భోజనముచేయవలెనట. అనగ, క్రొత్తసంవత్సరపుపంటను తినుటకు ముందు యీక్రతువును చేయవలెనని భావము. "అగ్రయనేష్టు" లనగ క్రొత్తపంటలనుగూర్చి చేయుక్రతువులని యిటీవల మనువుకూడవర్ణించియున్నాడు. కాని, యీవ్యాఖ్యానములు యిటీవల—ఋతువులు మారినపిమ్మట— చేయబడినవి. ఇటీవలివారు సంవత్సరములో మూడుక్రతువులు చేయవలెననిరి. వసంతర్తువులో "వ్రీహి" యను ధాన్యముతోడను, వర్షర్తువులో "శ్యామక" మను ధాన్యముతోడను క్రతువులు చేయవలెనని యిటీవలి వ్యాఖ్యాతలు రెంటిని మూడు క్రతువులుగ మార్చిరి. వసంత, శరదృతువుల ప్రారంభములో—(ప్రాచీన దేవ పితృ యానారంభములో) యీఅగ్రయనేష్టులను చేయవలెనని అశ్వలాయన సూత్రములలో గలదు. తై॥ సం॥ V, 1,7, 3, లో కూడ "సంవత్సరములలో రెండుపర్యాయములు ధాన్యమును పండవలె" నని గలదు. దీనినిబట్టికూడ అగ్రయనేష్టులు అసలు రెండేగ్గాని, మూడుకావని స్పష్టమగుచున్నది. ఈక్రతువులపేర్లుకూడ కాలసూచక

ముగనుండుటయేగాక, మనసిద్ధాంతమునకు చేయూతనొసంగుచున్నవి. పాణిని కాలమందు 'అగ్రహాయణ' శబ్దము నక్షత్రనామముగ నున్నమాట నిజమేగాని దీనికి వేదమునందు కూడ నేమైన ఆధారముగలదా? పాణిన్యాచార్యుడు మృగశీర్ష నక్షత్రమునకు పెట్టిన "అగ్రహాయణ" మను పేరు తత్పూర్వమునుండియు పరంపరగ వచ్చుచున్న పేరే యైయుండవలెను. ఏలననగ, ప్రతిఅయనమును యేదోయొక నక్షత్రముతో ప్రారంభము కావలెను. కనుక మొదటి (లేక అగ్ర) అయనముతో ప్రారంభమగు నక్షత్రమునకు "అగ్రయన" మను పేరు క్రమేణవచ్చియుండవచ్చును. కనుక 'అగ్రయన' మనగ మొదటి లేక అగ్ర అయనముతో నుదయించు నక్షత్రము అనిపేరు. "అగ్రయన" శబ్దము మృగశీర్షానక్షత్రమును దెల్పుచున్నదను ప్రత్యక్షవాక్యము లేమియు వేదమునం దింతవరకును గానరాలేదు. ఇంతప్రత్యక్షవాక్యములు లేకపోయినను, తదితరప్రమాణములనుబట్టి యీభావమే నిష్పన్న మగుచున్నది.

ఉదాహరణ:— తై॥ సం॥ VI, 4, 11, 1లో—యజ్ఞవేదికపైకొన్ని పాత్రలనుపెట్టుదురు. వీనిలో మొదటిపాత్రకు "అగ్రయన" మనిపేరు అనగ, సంవత్సరమును, లేక అయనమును ప్రారంభించునక్షత్రమునకు అగ్రయనమని పేరు, దీనిలోనిభావము సువ్యక్తమగుచునే యున్నది. కనుక, పూర్వకాలమున యజ్ఞయాగాదిక్రతువులకొరకై కూడ మృగశీర్షనక్షత్రమును "అగ్రయన"మని పిలుచుచుండెడివారనుట స్పష్టము. తదు

పరి 'అగ్రయనేష్టి'యొక్క మూలార్థము నశించిపోగనే ఈ నక్షత్రముపేరుకూడ వెనుకబడెను. అటుపిమ్మట, 'అగ్రయన'మనగ, ఆ క్రతువులను చేయు మాసమునకే పేరయ్యెనుగాని మృగశీర్షనక్షత్రమునకు తరుచుగ ప్రయోగింపబడుచు రాలేదు. కనుక, ఆపేరు మరుపునకువచ్చెను.

ఆకాశమందింత మనోహరముగ గన్పట్టు యీ నక్షత్రగణములపై యెందరెన్నివిధములుగ తమతమ పురాతనగాథలనెల్ల తీసికొనివచ్చి యంటగట్టిరో మనముక్రిందయధ్యాయములో చూచియున్నాము. ఒకానొకడు కామాతురుడై యొక స్త్రీవెంటపరుగెత్తుట; వానినిమరియొకడు వెనుకనుండి బాణముతో కొట్టుట; దానితో వానితల తెగుట; యివి—యీగాథలలోనెల్ల ప్రధానాంశములు. హిందూ, పారశీక, గ్రీకుగాథ లీరీతిగనున్నవి. అదిగాక, 'తేలుకుట్టుటచే ఓరయన్ చనిపోయె'నని గ్రీకులలో నొకకథగలదు. కాని యిది యిటీవల — మేషాదిరాసులు కల్పింపబడినపిమ్మట — పుట్టిన గాథయైయున్నది. దీనిఅర్థమేమనగ:— పశ్చిమమున మృగశీర్ష (ఓరయన్) అస్తమించుచున్నప్పుడు తూర్పుదిక్కున వృశ్చికరాసి యుదయించుచుండును.

ఇక జర్మనుగాథలుకూడ మనసిద్ధాంతమునే బలపరుచుచున్నవి. సంవత్సరాదికిముందు ౧౨ రోజులు (ప్రాతసంవత్సరముముగిసి, క్రొత్తసంవత్సరమింక ౧౨ రోజులుకు రాబోవుననగ). జర్మనీదేశములో, పల్లెటూళ్లలో పగటివేషములు వేయుదురట, ఇద్దరుమనుష్యులు ఒకడు జింక (మొగది)

వేషమును, మరియొకడు లేడి (ఆడది) వేషమును వేసికొని వీధులవెంట బయలుదేరుదురట, ఒకదానినొకటి ప్రేమించుచున్నట్లుగ పాటలుపాడుదురట, ఈరెండునిట్లు సల్లాపములాడుచుండగ వెనుకనుండి ఒక వేటగాడువచ్చి బాణముతో వీనినికొట్టునట, దీనిభావమేమి? అనగ 'జింక'తో —'మృగశీర్ష'తో సంవత్సరముప్రారంభమయ్యెనని దీని అంతరార్థము. ఈకథకూడ మృగరూపుడైన ప్రజాపతిని రుద్రుడుచంపిన కథను పోలియున్నది. ఇవి ప్రాచీనపరిస్థితులనుదెల్పు చిహ్నములైయున్నది. ఇక యీ ౧౨ రోజులకర్థమేమి? ఇవి మన హిందువుల 'ద్వాదశాహములే' క్రొత్తసంవత్సరము రాకముందు — క్రొత్తసంవత్సరపు యజ్ఞముప్రారంభించుటకు ౧౨ రోజులు యజ్ఞోపక్రమణమునకై దీక్షితుడు కావలసియుండునని పైన చెప్పితిమి. ఈ దినములు హిందూవులకు చాలముఖ్యమైనవి. అదిగాక, సంవత్సరములో సౌరచాంద్రమాసములకుగల భేదము ౧౨ రోజులు ఈ ౧౨ రోజులను అధికముగ గలిపినగాని చాంద్రసంవత్సరము సౌరసంవత్సరముతో సరిపోదు. వీనికే అధికదినములని పేరు. వీనిని ప్రతిసంవత్సరమును కలుపుకొనుచుండుటకంటె, మొత్తముగ పేనిచ్చి ఒకపర్యాయమే "అధికమాసము"గ చాంద్రసంవత్సరమునకు కలుపుచున్నారు. వీనినే పాశ్చాత్యదేశములలో "కుక్క—దినములు" (Dog Days) అనిచెప్పుదురు. అనగ, సంవత్సరాదిని సూచించుటకు శ్వాన (కుక్క) నక్షత్రముదయించినప్పుడు యీదినములకీపేరు వచ్చియుండును. ఈ భావమే

ఋగ్వేదములో కూడగలదు. "శ్వానము (కుక్క) వచ్చి (ఋతువుల కధిష్ఠానదేవతలగు) ఋభువులను మేల్కొలిపెను," (I, 161, 13,)

ఈరీతిగ, ఒక్క హిందువులగాధలే గాకుండ జర్మన్, గ్రీకు, పారశీక, గాథలు కూడ మనసిద్ధాంతమునకు బలమునిచ్చుచున్నవి. ఆర్యసంతతివారైన వారందరును కలసి ఒకచోట నున్నప్పుడే యీ గాథలుపుట్టియుండవలెను. ఈ గాథలు పుట్టినపిమ్మటనే, యీజాతులన్నియు వేర్వేరు చీలిపోయి యుండవలెను.

ఆకాశమందు ఓరయాన్ అనువేటకాడు చేతితో నొకదండమును, సింహపుతోలును, ఖడ్గమును, మొలకొకదట్టీని (పటకాను) ధరించి కాన్పించుచున్నాడని గ్రీకు గాథలు చెప్పుచున్నవి. ఈవర్ణనము హిందువులలోను పారశీకులలోనుకూడ గలదేమో విచారించిచూతము. మృగశీర్షానక్షత్రమునకు 'సోమ' దేవత యధిష్ఠానదేవతయని వేదవాఙ్మయమందుగలదు. సోమశబ్దమే పారశీకభాషలో 'హామ' శబ్దమగుచున్నది. 'హోమయాష్ట్' అను పార్సీ గ్రంథములో ౨౬వ శ్లోకము సర్వవిధములచేతను మనహిందువుల యజ్ఞోపవీతధారణమంత్రమును పోలియున్నది.

'ఫ్రతే మజ్దో బరత్ (1) పౌర్వనిమ్ (2) ఐవ్యోంఘనెమ్ స్తెహర్—పైసంఘెమ్ మైన్యు (3) తస్ తెమ్ వంఘుహిమ్ దైనమ్ మజ్దయాస్నిమ్॥'

(1) పౌర్వనిమ్=పురస్తాత్; (2) ఐవ్యోంఘనెమ్ (యజ్ఞోపవీతం) లేక కుస్తీ' (3) మైన్యు-తస్ తెమ్=సహజమ్.

ఈపార్సీ శ్లోకమున కర్థమేమనగ:—'భగవంతుడు, హోమకు ఒకదట్టీని లేక పటకానుయిచ్చెను. ఇది అతనికి సహజమైనదియు, నక్షత్రములతో పొదుగబడినదియు, పురాతనమైనదియునైయున్నది.' ఈదట్టీనే పారశీకులు 'కుస్తీ' యనెదరు. ఇదియొక పవిత్రమైనదారము. దీనిని పారశీకులు నడుము చుట్టుధరింతురు. గ్రీకులువర్ణించిన ఓరియనుని 'పటకా'యే అనగ, మృగశీర్ష నెత్తిపై సరళరేఖగనుండు మూడునక్షత్రములే యీదట్టీ (లేక కుస్తీ) యని తెలిసికొనవలెను. దీనినే భారతీయులు యజ్ఞోపవీతమనిరి. 409

'మృగశీర్ష' కు 'ప్రజాపతి' యని దేవవాఙ్మయము చెప్పుచున్నది. 'ప్రజాపతి' యన్నను, 'యజ్ఞ' మన్నను సమానార్థకమే. ప్రజాపతియొక్క — అనగ 'యజ్ఞ' ముయొక్క - నడుము చుట్టునున్న వస్త్రమునకే యజ్ఞోపవీతమని పేరు. యజ్ఞముయొక్క ఉపవీతము యజ్ఞోపవీతము. ఉపవీతమనగ వస్త్రము. ఈ వస్త్రమునే మనమిప్పుడు జన్నిదమనెదము. బ్రాహ్మణులు ధరించు జన్నిదము నిజముగ ప్రజాపతియొక్క వస్త్రము (ఉపవీతము) నుండియే యుత్పన్నమైనదని యీక్రింది చర్యవలన స్పష్టముగాగలదు.

యజ్ఞోపవీతమనగ=యజ్ఞ+ఉపవీత; దీనికి రెండు విధములుగ అర్థముచెప్పిరి. 'యజ్ఞకర్మకొరకై ధరించు వస్త్రము,' అనియు; లేక, 'యజ్ఞముయొక్క వస్త్రము,' అనియు రెండర్థములుగలవు. ఈరెండవ యర్థమే యెక్కువగ సమంజసముగనున్నది. 'హోత్రులు,' పరమాత్మను 'యజ్ఞ' మని పిలుచు

చున్నారు; యీయజ్ఞముయొక్క ఉపవీతమే యజ్ఞోపవీతము, అని పారిజాతస్మృతి: [యజ్ఞాఖ్య పరమాత్మాయ ఉచ్యతేచైవహోతృభిః। ఉపవీతంయతోస్యేదం తస్మాద్య యజ్ఞోపవీతకమ్॥——

యజ్ఞోపవీతధారణ మంత్రమున కర్థమేమి? 'నేనుపన్ను యజ్ఞముయొక్క ఉపవీతముతో (అనగ వస్త్రముతో బంధించుచున్నాను., ఈ మంత్రములోని ప్రథమచరణమిట్లున్నది:- 'యజ్ఞోపవీతం పరమం పవిత్రం ప్రజాపతేర్యస్సహజం పురస్తాత్.' ఈమంత్రము యిప్పుడున్న సంహితలలో నెచ్చటను గానరాదు. కాని, యిది బ్రహ్మోపనిషత్తులో గలదు. దీనినే బౌధాయనులవారుకూడ చెప్పిరి. ఈ మంత్రమునకును పారశీకుల 'హోమయాష్ట్, మంత్రమునకును సంపూర్ణమైన పోలికగలదు. ఈ వస్త్రమునకు 'పురస్తాత్, అనియు, సహజంఅనియు విశేషణములు ప్రయోగింపబడినవి. ఈ విశేషణములే పార్శీశ్లోకములో కూడనున్నవి. ఈ 'ఉపవీతము, ప్రజాపతికి పురాతనమైనదియు,సహజమైనదియునై యున్నది. [సహజమనగ-అన్ని యవయవములతో పాటు నిదికూడ సహజముగ పుట్టుకతోడనే పుట్టినదట—ఉదాహరణము కర్ణుని సహజకవచకుండలములు]. ఈరెండు శ్లోకములకుగల యిట్టి సంపూర్ణమైన పోలికకు విశేషమైనగూఢార్థమున్నదనుటకు సందేహములేదు. దీనినే గ్రీకులు ఓరయాంసని మొలపటకాయనిరి. ఆర్యసంతతులన్నియు నొకచోటకలిసియున్నప్పుడే యీభావములు ఇద్దరిలో ప్రబలియుండవలెను.

యజ్ఞోపవీతము పరమమైనది (అనగ గొప్పది) పవిత్రమైనది, ఇది పూర్వకాలమందు (పురస్తాత్) ప్రజాపతితోకూడ సహజముగ (సహాజం) పుట్టినది. 'ఉపవీత'శబ్దము వే-(నేయుట) అను ధాతువునుండి పుట్టినది. కనుక దీనికి "వస్త్రము" అని అర్థమేయగునుగాని "దారము" అనిఅర్థము కాజాలదు. మొట్టమొదట, అసలీయజ్ఞోపవీతమనునది నడుముచుట్టు బిగించికట్టిన వస్త్రముగనుండెనేగాని, యిప్పటిమా రిగ యెడమభుజముమీదినుండి ధరింపబడిన జన్నిదపుదారముగ లేదు. యజ్ఞోపవీతమనునది వస్త్రమేగాని దారముకాదు. తై॥సం॥ II, 5, 11, 1లో నివీత, ప్రాచీనాత, ఉపవీత - అనుమూడు యజ్ఞోపవీత ధారణావిధానములు వర్ణింపబడినవి. ఈ మూడు విధములును యజ్ఞోపవీతమునకు వర్తింపవనియు, యజ్ఞకర్మ చేయునప్పుడు ప్రతివారుధరింపవలసిన లేడిచర్మమునకుగాని, వస్త్రమునకుగాని వర్తించవలయుననియు మీమాంసకులు తలంచుచున్నారు. కనుక, పూర్వకాలమందు బ్రాహ్మణులు జింకచర్మమునో లేక వస్త్రమునో నడుమునకు ధరించుచుండిరేగాని యిప్పటివలె దారమును జన్నిదముగ ధరింపలేదని తెలియుచున్నది. సూత్రములలో వర్ణింపబడిన కర్మకాండ విధానముకూడ యీ యూహనుబలపరుచుచున్నది. "ఉపనయన" కర్మలో యీ దారముమాట నెచ్చటను చెప్పబడలేదు. అశ్వలాయన గృహ్యసూత్రములు-,19,8-10-12లో అజినం, మేఖల, దండము—యీ మూడే చెప్పబడినవి గాని దారరూపముగు జన్నదమెచ్చటను చెప్పబడలేదు. కాని

యీ కాలములో యీ దారమే ఉపనయనకర్మకు ప్రధానాంగముగ గన్పట్టుచున్నది. అయినను, వస్త్రమును ధరించు ఆచారమును మాత్రము మనము పూర్తిగ వదలివేయలేదు. పితరులకు అపరకర్మ చేయవలసివచ్చినప్పుడు యీమామూలు జన్నిదమునకు తోడుగ ఒకగుడ్డముక్క చింపి జన్నిదముగ ధరింతుము. ఇది పైనవివరించిన ప్రాచీనాచారముయొక్క చిహ్నము. బ్రాహ్మణుడు ధరించవలసిన మూడుజన్నిదములలో నొకటి పైబట్టలేనప్పుడు ఉత్తరీయమునకు ప్రత్యామ్నాయమని దేవలుడు తలంచుచున్నాడు. [తృతీయ ముత్తరీయార్థం వస్త్రాభావేతదిష్యతే] ఇదియు పూర్వాచారమును సూచించు చిహ్నముగ నున్నది.

యజ్ఞోపవీతమనునది మొట్టమొదట వస్త్రముగనుండెడిది. స్మృతికారుల కాలమునాటికది జన్నిద (దార) రూపమునకు వచ్చెను. దీనికి మూడుముళ్ళు కలవు.

పారశీకులు తమ „కుస్తీ„ ని నడుముచుట్టు ధరింతురు. ఇది గ్రీకుల ఓరయానునివర్ణనముతో సరిపోవుచున్నది. కాని బ్రాహ్మణులు యెడమభుజముమీదుగ ధరింతురు. దీనికి కారణమేమి? మానుషకర్మలన్నియు „నివీతి" గనే చేయవలెనని తై॥ సం॥ II, 5, 11, 1—లో గలదు; (ఉపవీతికాదు.) ‚నివీతి, అనగ „మెడలో తావళమువలె వ్రేలాడునట్లు„ అని కొందరు వ్యాఖ్యానము చేసిరి. కాని, కుమారిలభట్టుని ‚తాంత్రవార్తిక, (III, 4,2) ను చూచినచో „నివీతి„ అనగ

„నడుముచుట్టుకట్టుట„ అని కూడ అర్థముకలదు. „నడుమునకు బిగించికట్టిననే యేపనినైన చేయుటకు మిక్కిలి అనుకూలముగ నుండును„ ని కుమారిలభట్టుకూడ వ్యాఖ్యానము చేసెను. బ్రహ్మసూత్రముల శాంకరభాష్యమునకు వ్యాఖ్య వ్రాయుచు ఆనందగిరి, గోవిందానందు లిరువురునుకూడ యీవిధముగనే చెప్పిరి. [నివీతం కేచిద్గలవేణికాబంధం స్మరంతి । కేచిత్పూర్వ పరికరబంధం । తత్రగలవేణికాబంధో యుద్ధాదన్యత్రనప్రాప్నోతి పరికరబంధస్తు సర్వకర్మ స్వవ్యగ్రతాకరత్వా ప్రాప్తయితి॥]

కాత్యాయన:— పృష్ఠవంశేచ నాభ్యాంచ యధృతం దతేకటిం । తద్ధార్యముపవీతం శ్యాన్నాతిలంబనచోచ్ఛ్రితం॥

దేవల:— స్తనాదూర్ధ్వమధోనాభే హానైవధార్యాంకదాచన॥

పూర్వమొకప్పుడు బ్రాహ్మణులుకూడ—యిప్పటి పారశీలవలెనే— తమజన్నిదమును నడుముచుట్టు బిగించికట్టుకొనెడివారని స్పష్టమగుచున్నవి. అనగ, యెప్పటి కేపనిచేయుటకైనను సదాసంసిద్ధముగ నుండునట్లు, తమజన్నిదమును నడుమునకు దట్టించి కట్టుకొనియుండెడివారని తాత్పర్యము. పారశీకులయొక్కయు, బ్రాహ్మణులయొక్కయు జన్నిదములు ఆకాశమందు వెలుగుచున్న ప్రజాపతియొక్క యజ్ఞోపవీతమును (లేక ఓరయానునియొక్క మొలపటకాను) సర్వ

విధముల పోలియున్నవి. ఆదియందు నడుమునకు దట్టించి కట్టుకొన్న వస్త్రము, క్రమేణ యేరీతిగ యిప్పటికి జన్నిద రూపముగమారి, భుజమెక్కెనో యిట వివరించుట అనవసరము.

ఓరయానునియొక్క వేషమింతటితో పూర్తికాలేదు. నడుమునకు పటకా, చేతిలో దండము, చర్మము—యీ మూడునుకూడ ఓరయానుని వేషములో చేరికవే. ఉపనయనములో వటువునకు కూడ యీమూడును అవసరమే. వటువునడుమునకు గడ్డితో చేసినత్రాడును—మేఖలను—గట్టుదురు. ఈమేఖలకు బొడ్డుపైన మూడుముళ్ళు వేయుదురు. ఈమేఖలయే ఓరయానుని మొలపటకా; ఈమూడుముళ్లును యీపటకాలోనున్న మూడునక్షత్రములను సూచించును. [149 మేఖలాం త్రిరావర్త్యనాభిప్రదేశే గ్రంధిత్రయం కుర్యాత్ ॥] అదిగాక, యీమేఖలకు ముళ్ళువేయునప్పుడు "నీవు సోమునిముడివి,,— (సోమస్యనీవిరసి)— అని చెప్పుచు వేయవలెనట. సోము డనగ మృగశీర్షనక్షత్రమున కధిష్ఠాన దేవతయని పైనచెప్పియే యుంటిమి. దీనినిబోలిన మంత్రమే పారశీకుల గ్రంథములలోకూడ కలదు. కనుక, యివి మృగశీర్షలో నున్న మూడు నక్షత్రములను సూచించుచున్నవనుట కెంతమాత్రమును సందేహము లేదు.

ప్రతివటుడును ఉపనయనకాలమందు పాలాశదండమును ధరింపవలెను. ఓదండమా! యీయజ్ఞము పూర్తియగువరకు

నీవు గట్టిగనిలువబడి నన్ను పాపము నుండి రక్షింపుము [వాజసనీయసంహిత] అనుమంత్రమునుచదువుచుయీదండమును వటుడు ధరింపవలెను. ఇదికూడ యజ్ఞరూపుడైన ప్రజాపతినే సూచించుచున్నదని చెప్పవచ్చును.

వటువుధరింపవలసిన వస్తువలలో మూడవది జింకతోలు. న్యాయప్రకారము వటువునుపూర్తిగ జింకతోలుతో కప్పివేయవలెను కాని దీనికి ప్రత్యామ్నాయముగ కొంచెము జింకతోలును జన్నిదమునకు కట్టుచున్నాము.

మేఖల, దండము, అజినము—యీమూడును వటుని వేషములో ప్రధానాంశము. ఈ వటుని వేషము ప్రజాపతివేషముతో సర్వవిధముల సరిపోవుచున్నది. అట్లుండుటన్యాయమే. ఏలననగ:—ప్రజాపతి బ్రాహ్మణులలో మొదటిబ్రాహ్మణుడు; కనుక బ్రాహ్మణుడు కాదలచిన ప్రతివాడును యీ ప్రజాపతి వేషమును ధరించవలెననుట బహుసమంజసముగ నున్నది. ప్రజాపతి మృగరూపమును ధరించెను, కనుక వటుడుకూడ శరీరమందంతటను మృగచర్మమును ధరించవలెను; ప్రజాపతి నడుమునకు దట్టీని కట్టుకొనెను; కనుక వటుడుకూడ నడుమునకు 'మేఖల,ను ధరించవలెను. ప్రజాపతి మొలదట్టీలో మూడు నక్షత్రములు గలవు; కనుక వటుని మేఖలలోకూడ మూడుముళ్ళుండవలెను. ప్రజాపతిచేతిలో దండమున్నది; కనుక వటుడుకూడ (పాలాశ) దండమును ధరించవలెను. ఈవిధముగ, యీరెండు వేషములును తూచినట్లు సరిపోవుచున్నవి.

ఓరయానుని వేషమునకును, వటుని వేషమునకును రెండు భేదములు మాత్రమున్నవి. ఓరయానుని చేతిలో ఖడ్గమున్నది. వటుని చేతిలో ఖడ్గములేదు. ఓరయానుడు సింహపుతోలు కప్పుకొనెను. కాని వటుడు జింకతోలు కప్పుకొనెను. మొదటిభేద మెట్లువచ్చెనో తెలియదు; కాని, రెండవభేదమును మాత్రము సమర్థింపవచ్చును. వటుడు మృగాజినమును ధరించవలెనుగద; ఋగ్వేదములో „మృగ,, అనగ „సింహము,, లేక „జింక'' అని శాయనాచార్యులవారు వ్యాఖ్యచేసిరి. కనుక, గ్రీకులు సింహపుతోలని అర్థముచేసికొనిరి; మనవారు జింకతోలని అర్థముచేసికొనిరి. ఈరీతిగ, అన్ని పోలికలును తూచినట్లు సరిపోవుచున్నవి.

మృగశీర్షానక్షత్రమును గుర్తించకపూర్వము మనయార్యులు వస్త్రములను ధరించుట యెఱుగరని అర్థముకాదు. నిజస్థితి యేమనగ:— తాము ఆకాలమునాడు ధరించుచున్న వేషమునే ప్రజాపతికికూడ అంటగట్టిరని దీనిభావార్థము.

మనయెదుట యిన్ని ప్రమాణములు గన్పట్టుచుండగ, మనసిద్ధాంతమున కెంతయో బలముచేకూరుచున్నది. గ్రీకులు, పారశీకులు, హిందువులు, జర్మనులు— మొదలగు ఆర్యసంతతులవారందరు ఒకప్పుడొక్కతావుననే యుండిరనియు, ఆకాలముననే యీగాథలన్నియు పుట్టినవనియు, తదనంతరమే వారందరు చీలిపోయి వివిధప్రాంతములకు పోయిరనియు దీనివలన సిద్ధించుచున్న

గ్రీకుల „ఓరయాన్,, నకును, భారతీయుల „మృగశీర్ష,,కును యిన్ని పోలికలున్నప్పుడు, యీపేర్లుమాత్రమేల భిన్నముగ నుండవలెను? బహుశః „ఓరయాన్,, అను గ్రీకుశబ్దమును, „అగ్రయన,, అను సంస్కృతశబ్దమును ఒక్కమూలధాతువునుండియే యుత్పన్నమైయుండుటకు చాల అవకాశములుగలవు. సంస్కృతములోని „అ,, కారము గ్రీకుభాషలో „ఓ,, కారమగును. ఇంతవరకు నిర్వివాదమే కనుక, „అగ్రయన,, అనుసంస్కృతపదము గ్రీకుభాషలో „ఓగ్రయన,, అగును. అయితే ‚గ, కారమెట్లులోపించును? శబ్దాదియందు ‚గ, కారములోపించునని వ్యాకరణవేత్తలు చెప్పుచున్నారు. కాని, శబ్దమధ్యమందు—‚ర, కారమునకు పూర్వమందు-‚గ, వర్ణములోపించునా లోపించదాయనునదే చర్చనీయాంశము. తదితరభాషలలో లోపించుననుటకనేక నిదర్శనములు గలవుగాని సంస్కృతగ్రీకుభాషలమధ్య లోపించునని ఖండితముగచెప్పుటకు తగిననంతసామర్థ్యము నావద్ద లేదు. ‚గ, వర్ణము‚య, వర్ణమైలోపించినను లోపించవచ్చును. అయినను, దీనిని శబ్దశాస్త్రవేత్తలే నిర్ణయింతురుగాక ఇట్లు ‚గ, వర్ణములోపించినచో ‚ఓగ్రయన, నుండిఓరయన్ అను పదములభించును.

మన ప్రధానసిద్ధాంతమంతయు కేవలము శబ్దసాదృశము మీదనే ఆధారపడియుండలేదుగనుక, దీనివిషయమై మన మంతగ చర్చింపననుసరము లేదు. ఇంతకంటె మనకు బలవత్త

రమైన ప్రమాణములేగలవు. వాని నెల్లపైన వివరించియే యుంటిమి. వానికి తోడుగ యీశబ్దముల వ్యుత్పత్తికూడ సరిపోవునేమో చూడవలసినదని సూచించుచున్నాను. ఈపనిని శబ్దశాస్త్రవేత్తలు నెరవేర్చినచో మనసిద్ధాంతమునకు మరింత బలముకలుగును.

కనుక, పూర్వమొకప్పుడు ఫాల్గుణపౌర్ణమినాడు హిమసంక్రమణమువద్ద సంవత్సరము ప్రారంభమయ్యెనని చెప్పు తై॥ సం॥ వాక్యమును బలపరుచుచు సమస్తఆర్యసంతతివారి ప్రాచీనగాధలును నిర్దుష్టమైన సాక్ష్యమిచ్చుచున్నవి. ఇన్ని పురాణగాధలమీదను, పూర్వాచారములమీదను ఆధారపడియున్న సిద్ధాంతమెల్లరకును అంగీకారమై యుండవలెను. ఈగాధలనన్నిటిని యింతకంటె యెక్కువ సరళముగను, సులభముగను, సమంజసముగను సమన్వయింపగల మరియొకసిద్ధాంతము బయలువెడలువరకు మనసిద్ధాంతమే నిలిచియుండవలెను.

కృత్తికలు ప్రథమనక్షత్రములని చెప్పువాక్యములు అతి ప్రాచీనములగు వేదములందెచ్చటను గానరావని మాక్సిముల్లరు పండితుడు ఆక్షేపించెను. నిజమే; మృగశీర్షానక్షత్రము ప్రథమనక్షత్రమైయున్న కాలములో వెలువడిన ప్రాచీనవేదములందు "కృత్తికానక్షత్రము ప్రథమనక్షత్రము" అను వాక్యమెట్లుగనపట్టగలదు? మాక్సిముల్లరుపండితుడు కృత్తికలతోడనే నిలువక, యింకను పైకిపోయి చూచియుండినచో యిట్టి

యాక్షేపణ చేసెడివాడుకాడు. "శ్వానము" (కుక్క) సంవత్సరాంతమందు ఋభువులను మేల్కొలిపెను" అను వాక్యమునకు అర్థము చెప్పుటలోకూడ మాక్సిముల్లరు మొదలగు పండితులు ఉక్కిరిబిక్కిరి కావలసిన అవసరము లేకపోయెడిది.

మృగశీర్ష

ఏడవ అధ్యాయము


—♦ ఋభువులు: వృషాకపి ♦—

మన ప్రాచీనపుటార్యుల కెంతమాత్రమును ఖగోళశాస్త్రజ్ఞానము లేదని కొందరాక్షేపించుచున్నారు. ఇప్పుడున్నన్ని యంత్రములు పూర్వము లేవన్నమాట నిజమే. కాని అంతమాత్రముచేత మనయార్యులకు సూర్యచంద్రాదులును ఉషస్సును తప్ప యింకనేమియు తెలియనే తెలియవనుట గొప్ప పొరబాటు. నక్షత్రములు, అయనములు, మాసములు, సంవత్సరములు మొదలగుఖగోళశాస్త్రాంశములు తెలియనే తెలియవనుటఅతిసాహసము. ఋగ్వేదమునందుకావలసినన్ని నక్షత్రముల పేర్లున్నవి. సూర్యచంద్రాదుల గమనముచేత ఋతువులు గలుగుచున్నవని ఋగ్వేదమందుగలదు. ,,సంవత్సర,, మను కాలమానమును, దానియందలి దినములసంఖ్యయు ఋగ్వేదమునాటికే మనయార్యులు గుర్తించిరి. అయనములుకూడ అప్పటికే గలవు. విషువనులవద్ద ప్రారంభమగు దేవపితృయానములను గూర్చిన ప్రశంస ఋగ్వేదమందు గలదని యిదివరకే వివరించియుంటిమి. ఋI, 25,8 లో ,,అధికమాసము,, కూడ గలదు. సూర్యుడు ప్రయాణముచేయుటకై వరుణదేవుడు వెడలుపైనబాట నొకదాని

నేర్పరచెనని ఋI, 24,8 లో గలదు. ఈబాటలోనే ౨౭ నక్షత్రములు గలవు. ఈ ౨౭ నక్షత్రములును సూర్యునిబాటలోని ,,మైలురాళ్లు,, ని మూక్సుముల్లరు పండితుడు వర్ణించియున్నారు. ఈబాటనే మన మిప్పుడు 'రాశిచక్ర' మనుచున్నాము. ఋ I, 41,4 లో వర్ణింపబడిన ,,ఋత,, యను బాటకూడ యీ రాశి చక్రమునే సూచించుచున్నది. ఖగోళమందు ప్రధానముగ గన్పట్టు జ్యోతిర్మూర్తులన్నియు సాధారణముగ యీ బాటను తప్పిపోకుండ, యీ బాటవెంటనే ప్రయాణముచేయుచుండుటచే యీ బాటకు ,,ఋత,, మను పేరు సార్థకమయ్యెను. అన్ని జ్యోతిర్మూర్తులకును యిదియే క్రమమైన (ఋత) మార్గము. ఇదిగాక, యీ రాశిచక్రము ఖగోళమధ్యరేఖతోడను, భూగోళముయొక్క యిరుసుతోడను సమముగనుండక కొంచెము వంగియున్నదను నంశముకూడ ఋగ్వేదమునాటి యార్యులెరుంగుదురని ఋI,110,2—వలనను, ఋX, 86,—4 వలనను తెలియుచున్నది. ఇదిగాక, ''సప్తఋషు,, లన బరగు నక్షత్రకూటముకూడ వారికి తెలియును. ఋI, 24,9 లో— నుదహరింపబడిన ,,శత—భిషక్,, అనుపదమునుబట్టి శతభిషక్ లేక శతతారయను నక్షత్రగణముకూడ వారికెరుకయేయని తెలియుచున్నది.

ఋగ్వేదము ౫ వ మండలము ౪౦ వ ఋక్కులో అత్రిమహర్షి మొదట సూర్యగ్రహణమును చూచెనని వర్ణింపబడియున్నది. ఈ సూర్యగ్రహణమునుగూర్చియే సాంఖ్యా

యజ్ఞము 24–3 లోను, తాండ్యబ్రాహ్మణముIV,5,2,6,14 లోనుకూడ వర్ణనగలదు. ఈ సూర్యగ్రహణము శరద్విషువర్గకు 3 దినములు ముందు కనఁబడెనట. ఈ గ్రహణము పూర్ణగ్రహణమట సూర్యుడుపూర్తిగ కప్పబడి పోవుటచే పగలే నక్షత్రములు కూడగనఁబడెనట. ఈకారణముచేత నిదిలోకమునకెంతను మహావిచిత్రముగ గన్పట్టియుండును. అత్రిమహర్షి యీ గ్రహణమును ,,తురీయబ్రహ్మ,, చే తెలిసికొనెనని ఋగ్వేద శ్లోకములో గలదు. ,,తురీయబ్రహ్మ,, యనునర్థమేమి? అనగ, ,,తురీయ,, యను యంత్రసాధనముచే అత్రిమహర్షి దీనిని తెలిసికొనెనని అర్థముచేయవచ్చును, ,,తురీయ,, యనగ ''వలయములో నాల్గవభాగముగ నున్న యంత్రసాధనము,, అని యిటీవలి జ్యోతిష్యగ్రంథములలో- సిద్ధాంత శిరోమణి XI, 15లో–గలదు. ,,బ్రహ్మ" యనగ ,,సాధనము'' అను అర్థమును శాయనులవారే ఋI1, 2,7 లో చేసి యుండిరి. కనుక ,,తురీయబ్రహ్మ''-యనగ ,,తురీయ యనుయంత్ర



ముయొక్క- సహాయముతో–అనిఅర్థము చెప్పవచ్చును. దీనిని బట్టి యిప్పుడున్న క్వాడ్రెంటు (Quadrant) అను యంత్రము అప్పుడును గలదని అర్థముకాదు. కేవల మిదే కాకపోయినను యిట్టిదూదిగిదే బహుసులభమైన యేదోకానొక సాధనము అప్పుడుకూడ నుండియుండవచ్చును.

వేదకాలమునాటి ఋషులు గ్రహములను గుర్తించలేదని కొందరాక్షేపించిరి. ఈయాక్షేపణను జూచినచో యెట్టివానికైనను నవ్వురాకమానదు. ఖగోళమందు నక్షత్రములను, వానిగమనములనే గుర్తించిన ఋషులు వీనియన్నిటికంటె మిక్కిలి ప్రకాశమానముగ వెలుగుచుండు శుక్రుడు, బృహస్పతి, శని, మొదలగుగ్రహములను గుర్తించలేదన్నచో నెంత హాస్యాస్పదముగ నుండును? ఒకప్పుడు సాయంకాలమందు పశ్చిమమునను, మరియొకప్పుడు ప్రాతఃకాలమందు తూర్పునను గాన్పించుచు మిక్కిలిప్రకాశమానముగ వెలుగొందు శుక్రగ్రహమును యెట్టివారైనను గుర్తింపకమానరు. బ్రాహ్మణములకాలములో గ్రహములు గుర్తింపబడిన వనుటకెంతమాత్రమును సందేహములేదు. తై॥ బ్రా॥ III, 1,1,5 లో–,,బృహస్పతి మొట్టమొదట తిష్యానక్షత్రమువద్దపుట్టె'' నని యున్నది. [బృహస్పతిః ప్రథమం జాయమానః తిష్యం నక్షత్రం ప్రాదుర్బభూవ] అంతేగాక, ఋVI, 50,4లో కూడ యిట్టివచనమే గలదు. [బృహస్పతిః ప్రథమం జాయమానో మహోజ్యోతిషః పరమేవ్యోమన్] ఇప్పటికిని బృహస్పతి

తిష్య (అనగ మృగశీర్ష) లోనికివచ్చినప్పుడు శుభలగ్నమని జ్యోతిష్కులు తలంచుచున్నారు.

ఋ III, 32–2; IX, 46–4–లలో "శుక్ర", "మంథిన్", అను రెండుగ్రహములు చెప్పబడినవి. వీనికర్థమేమి? ఇవి యజ్ఞవేదికపై నమర్పబడిన పాత్రలపేర్లని వ్యాఖ్యాతలు చెప్పిరి. కాని యజ్ఞకర్మలన్నియు సూర్యుని గమనమునకు సరియైన నకలని రెండవ యధ్యాయములో విశదీకరింపబడియేయున్నది. కనుక, యీపాత్రలపేర్లుకూడ అసలు ఆకాశమందుండు గ్రహాదులయొక్కయు, నక్షత్రములయొక్కయు పేర్లనుబట్టియే వచ్చుచుండును. తై॥ సం॥ లో యీపాత్రలు— "శుక్రునియొక్క పాత్ర", "మంథిన్" యొక్క పాత్రయని స్పష్టముగ విప్పిచెప్పబడియున్నది. కనుక, ఆకాలమునాటికే శుక్రుడు, మంథిన్ మొదలగు గ్రహములు కనిపెట్టబడినవని సిద్ధించుచున్నది.

ఋ ౧౦ వ మండలము. ౧౨౩ వ ఋక్కులో యింతకంటె ప్రత్యక్షమైన ప్రమాణముగలదు. ఈఋక్కు "వేన" యను దేవతనుగూర్చి చెప్పబడినది. "వేన" శబ్దము "వేన్" = ప్రేమించుట యను ధాతువునుండి యుత్పన్నమైనదని యాస్కాచార్యులవారు తమనిరుక్తమందు (10–38) చెప్పియున్నారు. శుక్రగ్రహమునకు గ్రీకుభాషలో "వీనస్" అనిపేరు. ఈగ్రహము ప్రేమాధిష్ఠాతయగు స్త్రీదేవతయని గ్రీకుపురాణములు చెప్పుచున్నవి. కనుక, ఋగ్వేదములో "వేన" యని

చెప్పబడినగ్రహమును, గ్రీకులలో "వీనస్" అని చెప్పబడిన గ్రహమును ఒక్కటే. ఈ రెండుపేర్లును శుక్రగ్రహమునే సూచించుచున్నవి. శుక్రగ్రహమునకు "వీనస్", లేక "వేన", యనుపేరు ఆర్యసంతతులందరును వేర్వేరుతెగలుగ చీలిపోకమునుపు పెట్టినపేరైయుండవలెను. ఈపేరే—యీయర్థముతోడనే— ప్రేమస్వరూపిణియగు గ్రహమను నర్థముతోడనే యిప్పటికిని గ్రీకుభాషలో నిలిచియున్నది. కాని, సంస్కృతభాషలో యీ పేరును, దానిననుసరించి యీయర్థమును— చాలవరకు స్మృతిపథమునుండి తప్పిపోయెను. కాని, ఋగ్వేదములో యీఒక్కప్రదేశములోమాత్రము (X, 123) యెట్లో నిలచి యున్నది. ఈ "వేన" శబ్దము శుక్రగ్రహమునే సూచించుచున్నదనుట కింకొకప్రబల నిదర్శనముగలదు. యజ్ఞములో యీ "వేన" మంత్రమునుచదువుచు యాజ్ఞికుడు శుక్రపాత్రను చేతిలోయెత్తి పట్టుకొనును. ఈక్రియ "వేన" శబ్దముయొక్క నిజార్థమునుదెలుపుచున్నది. అయితే, యీశుక్రగ్రహమును హిందువులు పురుషునిగను గ్రీకులు స్త్రీనిగను భావించుచున్నారు. ఈలింగభేదమునెట్లు సమర్థింపవచ్చును? దీనినంతగ మనముపాటింపనక్కరలేదు. ఇట్టి లింగభేదములు తరుచుగ సంభవించుచునేయున్నవి. ఉదాహరణ:—చంద్రుని మనము పురుషునిగ భావించుచున్నాము; కాని, పాశ్చాత్యదేశస్థులు స్త్రీగ భావించుచున్నారు. కనుక, లింగభేదమంతపాటింపదగినదికాదు.

దీనిని బలపరచుటకు కొన్ని ప్రమాణములు గలవు. "వీనస్" నకు "క్యూప్రిస్" అను నామాంతరము గ్రీకుభాషలో గలదు. ఈ "క్యూప్రిస్" శబ్దము "శుక్ర" యను సంస్కృతశబ్దమునుండియే వచ్చినదని చెప్పవచ్చును. "శుక్ర" శబ్దములో మొదటనున్న "శ" వర్ణము కొన్ని సూత్రముల ననుసరించి గ్రీకుభాషలో "క" వర్ణముగ మారును. మఱియు శబ్దమందున్న "క్ర" యనునది "ప్ర" గ మారును. ఈ ప్రకారము సంస్కృత "శుక్ర" గ్రీకు "క్యూప్రిస్" గ మారును. (ఈమార్పు శబ్దశాస్త్రవేత్తలకు సువిదితమే.) ఈరీతిగ "వేన" శబ్దమునుండి "వీనస్" శబ్దమును; "శుక్ర" శబ్దమునుండి "క్యూప్రిస్" శబ్దమును పుట్టినవి. ఇవన్నియు శుక్రగ్రహమునకు పేర్లు.

వేదకాలమునాటి ఋషులకు ఖగోళశాస్త్రములోని యంశము చాలవరకు తెలియుననియే సిద్ధించుచున్నది. (౧) నక్షత్రములు (౨) సూర్యచంద్రాదుల గమనము చేగలిగిన ఋతుభేదములు (౩) సంవత్సరము; అందలి దినములసంఖ్య; (౪) అయనములు; (౫) విషువములు; (౬) సౌరచాంద్రమానములు-అధికమాసము (౭) "ఋత" యని చెప్పబడిన రాశిచక్రము (౮) రాశిచక్రముయొక్క వంపు (౯) సప్తర్షిమండలము; శతభిషక్ తారలు (౧౦) సూర్యచంద్రగ్రహణములు (౧౧) ఖగోళాంశమును గుర్తించుటకు కావలసిన యంత్ర సాధనములు (౧౨) గ్రహములు—ఇత్యాదిజ్యోతి

షాంశములు ప్రాచీన వేదకాలమునాటి యార్యులకు తెలియుననుటలో సందేహమేమియు లేదు. సంవత్సరములయొక్కయు, మాసములయొక్కయు ప్రారంభములను వారు నక్షత్రములచే గుర్తించుకొనెడివారు. ఏనెల ఏ నక్షత్రముతో ప్రారంభమగునో, యేఋతువు ఎప్పుడు ప్రారంభమగునో—యే అయనము యే విషువత్ ఎప్పుడు ప్రారంభమగునో యివన్నియు వారు గుర్తించుకొనియేయుండిరనుటలో సందేహ మెంతమాత్రమును లేదు. ఈ విషయమునింతటితో ముగించి యిక—

ఋ I, 161, 13 ఋక్కునుగూర్చి యిప్పుడు విచారింతము. 'సంవత్సరాంతమందు శ్వానము (కుక్క) వచ్చి ఋభువులను మేల్కొలిపెను.' దీనిభావమేమి? ఋభువులనగ ఎవరు? యాస్కాచార్యులవారు తమనిరుక్తము 11, 15, 16 లో-ఋభు-విభ్వన్-వజ-యను ముప్వురు ఋభువులుగలరని చెప్పిరి. వీరు ముప్వురును సుధన్వుని కుమారులట. వీరు దేవతల కత్యంతప్రీతికరమైన కార్యములొనర్పుటచే, దేవతలు చాలమెచ్చి వీరికి అమర్త్యత్వమును, యజ్ఞములలో హవిర్భాగములను యిచ్చి చాల గౌరవించిరట. వీరుచేసిన మహాత్కార్యములను వర్ణించు ఋక్కులనేకము ఋగ్వేదమందు గలవు, 'ఋభువులు' 'సంవత్సరము' తో కలిసి మెలిసి పనిచేయునట్లు వర్ణింపబడినవి. వీరు సంవత్సరాంతమందు తమపనిని ప్రారంభించి, సంవత్సరము పొడవునను గోవు

లను (అనగా సూర్యకిరణములను) కాపాడుచుండురట. ఋభువులు సంవత్సరము పొడవునను పనిచేసిసంవత్సరాంతమందు ౧౨ దివములు సూర్యుని (అగోహ్య) యింటిలో విశ్రమింతురని ఋ IV, 33-7 చెప్పుచున్నది. ఋభువులు సూర్యునకు 'అంతేవాసు' లని (అనగ శిష్యులు-లేక-యింటిప్రక్క-వారని) ఐతరేయ బ్రాహ్మణము III, 30 లో వర్ణింపబడియున్నది. ఋభువులు చేయవలసిన పనిని ఉపస్నేచేయుచున్నదని ఋ IV, 51, 6 లో గలదు. దీనినిబట్టి ఋభువులనగ సూర్యకిరణములని యాస్క, శాయనాచార్యులిరువురును తలంచుచున్నారు, అట్లయినచో, ఋభువులు ముగ్గురున్నదమ్ములను దానికర్థమేమి? కనుక మొత్తముపై ఋభువులనగ సూర్యకిరణములనియేగాక, మూడు ఋతువులని కూడ పాశ్చాత్యపండితులు తలంచుచున్నారు. ఋభువులు ఋతువులతోకూడ యానందించుచున్నారని ఋ IV, 34, 2 లో గలదు. ఇది పాశ్చాత్య పండితుల యూహను బలపరుచుచున్నది. మూడు ఋతువులననుకరించు ముగ్గురు ఋభువులును సంవత్సరము పొడవునను దేవకార్యములదీర్చుచు సంవత్సరాంతమందు ౧౨ దినములు సూర్యుని గృహములో విశ్రమించుచున్నారు. "వీరిచ్చట ౧౨ దినములు బహు ఆనందముతో కాలముగడిపెదరు. అటుపిమ్మట వారుమరల తమపనికి ఉపక్రమింతురు. మరల భూమి క్రొత్త ఫలములనీనును; మరల ప్రవాహములు నూతన జలములతో ప్రవహించును; ఆకాశమందు మరల గ్రహములుపుట్టును.

అధోలోకమందు జలము లుద్భవించును.] అటుపిమ్మట—ఋ I, 161, 13—ఋక్కు వచ్చుచున్నది, [సుషుప్వాంసఋభవస్తదపృచ్ఛతాగోహ్యకయిదంనో అబూబుధత్ । శ్వానం బస్తోబోధయితారమబ్రవీత్సంవత్సర యిదమద్యావ్యఖ్యత॥

౧౨ దినముల విశ్రాంతియు, నిద్రయునైన పిమ్మట ఋభువులు మేల్కొలుపబడినవై సూర్యుని యిట్లు ప్రశ్నించుచున్నవి:— "ఓ అగోహ్య! (సూర్యా!) మమ్ముల నెవరు మేల్కొపిరి." "మిమ్ములను శ్వానము (కుక్క) మేల్కొల్పినద," నిసూర్యుడు(మేక)ప్రత్యుత్తర మిచ్చెను. (ఋభువులు విశ్రమించు యీ౧౨దినములును సౌరచాంద్రమానములకు గలభేదమని గుర్తుంచుకొనవలెను.)

ఈశ్వాన మననేమి? శ్వానమనగ ,గాలి, యని శాయనులవారు తలంచుచున్నారు. ఇట్లు చెప్పుట కాధార మెచ్చటను కానరాదు. ఋభువులు ఋతువుల కధిష్ఠాన దేవతలని పైన నిరూపించితిమి. వీరు సూర్యునితో బాటు సంవత్సరము పొడవునను కష్టపడి పనిచేసిరి. కాని. సౌరచంద్రమానములకు ౧౨ దినములు భేదముగలదు. ఈ ౧౨ దినములును అధికదినములు—ఇవి క్రొత్త సంవత్సరమునకును చెందవు. పాతసంవత్సరమునకును చెందవు. కనుక, తటస్థముగ మధ్యనున్న యీ ౧౨ దినములలో ఋభువులు (ఋతుదేవతలు) కూడ తమపనిని విరమించి సూర్యుని యింటిలో హాయిగ విశ్రాంతి గైకొనుచున్నారనుట యెంతయు సహజ

ముగనున్నది. ఈ గాథకిట్టి సరళమైన భావార్థము కుదురుచున్నప్పుడు, యీ ఋభువులను మేల్కొలిపిన కుక్క ఆకాశమందొక నక్షత్రమైయుండవలెననుట కెంతమాత్రమును సందేహము లేదు. ఈనక్షత్రము క్రిందటి యధ్యాయములో వర్ణింపబడిన "కుక్క-నక్షత్రము" (శ్వాననక్షత్రము) గాక మరియేది కాగలదు? సంవత్సరాంతమందు- అనగ ఋతువులు పూర్తియైన పిమ్మట-అనగ విషువత్తో ప్రారంభమైన సంవత్సరాంతమందు-అని ఇచ్చట అర్థము. వసంతర్తువుయొక్క ప్రారంభమందు గాన్పించు 'కుక్క' యీ శ్వాననక్షత్రమే. కనుక, ఋభువులను గూర్చిన యీ గాథ పుట్టినప్పుడు వసంతవిషువత్ మృగశీర్షలోనుండి తీరవలెను, అనగ, హిమసంక్రమణము ఫాల్గుణ పౌర్ణమినాడు వచ్చితీరవలెను; మృగశీర్ష ప్రథమ నక్షత్రమైయుండితీరవలెను—అని సిద్ధించుచున్నది. తైత్తిరీయసంహితా బ్రాహ్మణములలోని వాక్యములకిదియే నిజమైన అర్థము.

ఇదిగాక, ఋగ్వేదము పదియవ మండలములోనున్న 'వృషాకపి' సూక్తమున కెవరును యింతవరకు సరియైన భావార్థమును చెప్పియుండలేదు. వృషాకపియనగ సూర్యుడని వ్యాఖ్యాతలందరును చెప్పిరి. కాని యెట్టి సూర్యుడు? శరద్విషువత్ వద్దనున్న సూర్యుడని యర్థము చెప్పినచో యీ కథకు చక్కని భావార్థమేర్పడుచున్నది. ఈ కథయేమనగ: పసుపు వర్ణముగల [illegible] కనుపింపగనే యజ్ఞములన్ని
[illegible]

యు నిలిపివేయబడినవి. యజ్ఞములు నిలిచిపోవుటచే యింద్రాణికి కోపమువచ్చెను. యజ్ఞములు నిలిచిపోవుటకు కారణమైన యీ మృగముయొక్క తలను నరికివేసెదననియు, యీ మృగము వెంట వేటకుక్కను ఉసుగొలిపెదననియు యింద్రాణి భయపెట్టెను. కాని, యీ మృగము యింద్రునకు ప్రేమాస్పదమగుటచే యింద్రుడు చల్లని వాక్యములచే ఇంద్రాణియొక్క కోపమును శాంతింపజేసెను. అంతట యింద్రాణి ప్రసన్నురాలై తానీమృగమును చంపలేదనియు యింకొక మృగమును చంపితిననియు సమాధానము చెప్పెను.

అంతట సూర్యుడు (వృషాకపి) అధోలోకమందున్న తన నివాసమునకు పోవుచుండగ యింద్రుడువచ్చి వీడ్కొలిపెను. 'నీవు మరల తిరిగి నాయింటికి రావలసినదనియు, నీవు రాగనే యజ్ఞములను మరల ప్రారంభింపవచ్చుననియు' యింద్రుడు వృషాకపిని వేడుకొనెను. వృషాకపి మరల తిరిగి పైనున్న యింద్రుని యింటికి వచ్చినప్పుడు యింతవరకు యజ్ఞములను పాడుచేసిన ఆ దుష్టమృగము అదృశ్యమయ్యెను! యేమి చిత్రము? అంతట యింద్రుడును యింద్రాణియు, వృషాకపియు, (సూర్యుడును)—అందరును హాయిగ యింద్రుని యింటిలో కలిసికొందురు.

సూర్యుడు శరద్విషువత్ వద్దనుండగ ప్రాచీనకాలమందు ఉత్తరాయణము (దేవయానము) పూర్తియగుచుండెను. దేవయానము పూర్తి కాగనే యజ్ఞములుకూడ నిలిచిపోయెడివి. మరల సూర్యుడు తిరిగి వసంతవిషువత్ లోనికివచ్చు

పర్యంతము యజ్ఞములు నిలిచిపోయెడివి. మృగము గాన్పింపగనే యజ్ఞములు నిలిచిపోయెననగ అర్థమేమి? వసంతవిషువత్ మృగశీర్షలోనున్న యుగమందు సూర్యుడు శరద్విషువత్ వద్దనున్నచో సూర్యాస్తమానకాలమందు తూర్పున మృగశీర్ష గాన్పించును. అనగ, సూర్యాస్తమానమందు తూర్పున మృగశీర్ష గాన్పింపగనే దేవయానము పూర్తియైనదనియు యిక యజ్ఞముల నిలుపవచ్చుననియు గుర్తు. కనుక 'మృగము గాన్పింపగనే యజ్ఞములు నిలిచినవ'ను మాటకు భావార్థమిది. ఈ కారణముచే యింద్రునికి కోపమురాగా, మృగము తల నరికెదననియు, కుక్కలను ఉసుగొలిపెదననియు బెదరించెను. ఈ మృగము తలయే మృగశీర్షానక్షత్రము. కుక్కయనునదే శ్వాననక్షత్రము. సూర్యుడు తిరిగి యింద్రుని యింటికి (వసంత విషువత్‌లోనికి) వచ్చినప్పుడు మృగము గాన్పింపలేదు. అనగ సూర్యుడు మరల మృగశీర్షలోనికి వచ్చుటచే మృగము సూర్యుని కాంతిలో మునిగిపోయెను. వసంతవిషువత్‌తో దేవయానము ప్రారంభమగుటచే మరల యజ్ఞములు చేయుటకు వీలుగలిగెను. * ఈకథ కూడ మనసిద్ధాంతమును బలపరుచుచున్నది.

* [ప.రా:— ఈకథలో నాకొక చిన్న అసందర్భము గాన్పించుచున్నది. శరద్విషువత్ వద్దనున్న ఒక్క సూర్యునికేగాక, పైనవర్ణితమైన మృగమునకుకూడ "వృషాకపి" యను పేరే యున్నది. దీనిని సమన్వయించుటెట్లో నాకు తెలియకున్నది. తిలక్‌గారుకూడ దీనిని సమన్వయింపలేదు. కారణమేమో తెలియదు—మానికొండ సత్యనారాయణశాస్త్రి—అనువాదకుడు]

కాని, ఈకథ కింతవరకును పాశ్చాత్య, పౌరస్త్యవ్యాఖ్యాతలెవరును చక్కనిసమన్వయమును గుదర్చలేకపోయిరి. అయినను, మనమృగశీర్షసిద్ధాంతమువలన యీకథను చాలవరకు సమన్వయింపవచ్చును. ఇంతకంటె సహజమగు భావార్థమును మరియొకరెవరైనను చెప్పువరకు యీయర్థమునే స్వీకరింపక తప్పదు.

మృగశీర్ష

ఎనిమిదవ అధ్యాయము.

ఉపసంహారము.

చారిత్రకయుగమును దాటిపోయిన పిమ్మట, కాలనిర్ణయము చేయుటకై మనకు విశేషమైన ఆధారములేమియు గానరావు. కాని మనకు కేవలమితిహాససహాయమైన గడియారములు లేకపోయినను సర్వేశ్వరుడొసంగిన బ్రహ్మాండగోళమను నీపెద్దగడియారము మాత్రము మనకుగలదు. ఈగడియారమును మానవమాత్రులెవరును నశింపజేయలేరు. ఖగోళమందలి జ్యోతిర్మూర్తులన్నియు కర్మసూత్రములచే గట్టుబడి నియమానుసారముగ తిరుగుచున్నవి. కనుక, వేదకాలనిర్ణయమొనర్చుటకై మనకీగడియారమెంతయో సాయమొనర్పగలదు. ఈగడియారమిచ్చు నిర్ణయమునకు తిరుగుండజాలదు.

ఆర్య సంతతులవారందరును కలిసియున్నప్పుడు తాము కన్నారజూచిగాని, తమ పూర్వులనుండి వినిగాని, యున్నఖగోళాంశములను వారు తమ ప్రాచీన గ్రంథములందు భద్రపరచియున్నారు. వీనియాధారముచే మన మీ వేదకాలనిర్ణయ మొనర్పబూనితిమి. గ్రీకు, పారశీక, జర్మను జాతులవారి పురాతనగాథల సహాయముతో, హింద్వార్యులు తమ యప్రతిమానమేథా సంపత్తిచే భద్రపరచియుంచిన

కాలసూచకములగు వాక్యముల నిజార్థమును మనమిప్పుడు లోకమునకు వెల్లడింపవచ్చును.

ఒకప్పుడు నూతన సంవత్సరము ఫాల్గుణ పౌర్ణమినాడు హిమసంక్రమణమువద్ద ప్రారంభమాయెనని తైత్తిరీయసంహితలో నుదహరింపబడిన పూర్వవృత్తాంతముయొక్క నిజార్థమును మనమింతవరకు సంతృప్తికరముగ స్థాపింపగలిగితిమి.

కాని, 'చైత్రపౌర్ణమికూడ సంవత్సరాదియే' యని ఆతైత్తిరీయ సంహితావాక్యములోనే చెప్పబడియున్నదిగద. దీనికర్థమేమి? ఇదికూడ పూర్వయుగపు వృత్తాంతమునే దెలుపుచున్నది. దీనివలన, మృగశీర్ష యుగమునకు పూర్వమొకప్పుడు హిమసంక్రమణమువద్ద చైత్ర పౌర్ణమినాడు నూతన సంవత్సరమారంభమయ్యెనని అర్థము. ఈ వాక్యముచే వేదకాలము మరి రెండువేల సంవత్సరములు వెనుకకు పోవుచున్నది. హిమసంక్రమణమువద్ద చైత్ర పౌర్ణమినాడు నూతన సంవత్సరమారంభమైనచో వసంతవిషువత్ పునర్వసు నక్షత్రములోనుండవలెను. అనగ, మృగశీర్షకంటె కూడ రెండు నక్షత్రములు వెనుకనుండియుండవలెను.

దీనికి ప్రమాణము లేమైనగలవేమో చూతము. ఈవాక్యము మనలను అతిప్రాచీన కాలములోనికి గొంపోవుచున్నది. బహుశః అప్పుడప్పుడే 'సంవత్సరము' అను కాలమానము గుర్తింపబడుచుండెనని చెప్పవచ్చును. ఈ కాలమును

గూర్చి వేదములందు బహుకొద్ది ప్రమాణములు మాత్రమే గలవు. అచ్చటచ్చట చెదురుగ బహుకొద్ది చిహ్నములు మాత్రము నిలిచియున్నవి. గ్రీకు, పారశీక గ్రంథములందింత మాత్రముకూడ గానరాకున్నవి.

పునర్వసు ప్రథమ నక్షత్రమని చెప్పుటకు ప్రత్యక్షవాక్యములేమియు వేదములందుగానరావు. ఇది ప్రథమ నక్షత్రమను అర్థమిచ్చు 'అగ్రయణ' వంటి పర్యాయ పదములు కూడ లేవు. కాని, అతిప్రాచీన వేదకాలమునాటి కర్మకాండను పరిశీలించి చూచినచో పునర్వసు నక్షత్రమొకప్పుడు ప్రథమ నక్షత్రమైయుండవలెనను సూచనలు గాన్పించుచున్నవి. 'పునర్వసు' నక్షత్రమునకు 'అదితి' అధిష్ఠానదేవత. 'యజ్ఞయాగాది క్రతువులన్నియు అదితితో ప్రారంభమై, అదితితోడనే సమాప్తి కావలయున'ని అదితి దేవత కొక వరముగలదట—దీనికి ఐతరేయ బ్రాహ్మణము I, 7; తై॥ సం॥ VI, 1, 5, 1—ప్రమాణములు.

దానిలోనున్న కథ యీరీతిగనున్నది:— ఒకానొకప్పుడు 'యజ్ఞము' దేవతలనుండి పారిపోయెను. ఆకారణముచే దేవతలు యేక్రతువు చేయుటకును శక్యముగాకపోయెను. ఈయజ్ఞ మెక్కడికి పారిపోయెనో యెవరికిని తెలియలేదు. దేవతలందరీయవస్థలో పడియుండగ 'అదితి' వచ్చి సరియైన యజ్ఞోపక్రమణమును కనుగొనెనట. దీనిభావార్థమేమి? పూర్వము యజ్ఞములను యెవరియిష్టము వచ్చినప్పుడు వారు చేయుచుండెడివారనియు, పిమ్మట కొంతకాలమునకిది బా

గుండలేదని తలంచి అందరును అదితి (పునర్వసు) తోడనే ప్రారంభింపవలయునని నిశ్చయించుకొనిరనియు తాత్పర్యము. కనుక అదితి (అనగ పునర్వసు) యజ్ఞోపక్రమణమునకు (సంవత్సరోపక్రమణమునకు) ప్రథమదశయని దీనివలన సిద్ధించుచున్నది. వాజసనేయసంహిత 4,19లో అదితిని "ఉభయతఃశిరః" (రెండుతలలుగలది) అని వర్ణించిరి. అనగ యజ్ఞముయొక్క ఆద్యంతములు రెండును అదితిలో నున్నవని భావము. అనగ, యజ్ఞములును, వానితోబాటు సంవత్సరములును, అదితితో (అనగ పునర్వసుతో) ప్రారంభమై అదితితోనే సమాప్తమయ్యెనని భావము. ఈయర్థమే వ్యాఖ్యాతలకు కూడ మాన్యముగ నున్నది.

ఈసిద్ధాంతమే యజ్ఞకర్మకాండలవలనకూడ స్థిరమగుచున్నది. యజ్ఞములో విషువత్‌దినమునకు (అనగ మధ్యదినమునకు) పూర్వము వచ్చు నాలుగవదినమునకు "అభిజిత్" దినమని పేరు. యజ్ఞములు వసంతవిషువత్‌లో ప్రారంభమైనచో, యజ్ఞమధ్యదినము శరద్విషువత్‌లో వచ్చును. అనగ యజ్ఞమధ్యదినమునాడు సూర్యుడు శరద్విషువత్‌లోనుండును. తత్పూర్వము, నాలుగుదినముల క్రిందట— సూర్యుడు శరద్విషువత్‌కు ౪ డిగ్రీల దూరములోనుండును. ఇట్లు సూర్యుడు శరద్విషువత్‌కు పూర్వభాగమునందు ౪ డిగ్రీలదూరములోనున్న దినమునకు అభిజిత్ దినమని పేరు. "అభిజిత్" దినమనగ, సూర్యుడు, అభిజిత్ నక్షత్రములోనున్న దినమని అర్థము

చెప్పుదము. కనుక, ఆకాలములో "అభిజిత్" నక్షత్రము శరద్విషువత్తుకు పూర్వభాగమందు ౪ డిగ్రీలదూరములో నుండియుండవలెను. వసంతవిషువత్ పునర్వసులోనున్నచో, శరద్విషువత్ అభిజిన్నక్షత్రమునకు ముందు షుమారు 5, 6 డిగ్రీలలోనుండునని రాశిచక్రము జూచినచో స్పష్టముగాగలదు. ఈస్థితిలో శరద్విషువత్తుకు యీ అభిజిన్నక్షత్రమునకంటె దగ్గరనున్న నక్షత్రమింకొకటిలేదు. ఆకారణముచేతనే యీ అభిజిన్నక్షత్రము రాశిచక్రమునకు వెలుపలనున్నను దీనినే స్వీకరింపవలసిన అగత్యముగలిగినది. అందువలననే, యీ నక్షత్రమును ౨౮వ నక్షత్రముగ మనవారు పూర్వమొకప్పుడు అంగీకరించుటకు కారణమైనది. సూర్యుడీ అభిజిన్నక్షత్రములోనికి వచ్చినప్పుడు 'విషువత్ దినమిక ౪, ౫ రోజులలో నున్నదిసుమా' యని యాజ్ఞికులు గ్రహించెడివారు. అనగ, విషువత్ దినమునుగ్రహించుటకిది యొకసాధనముగ (గుర్తుగ) నుండెడిది. కాని, పిమ్మట కొంతకాలమునకు శరద్విషువత్ ముందునకు జరిగిపోవుటచే యీ అభిజిన్నక్షత్రముయొక్క అవుసరముకూడ తప్పిపోయెను. అభిజిన్నక్షత్రముయొక్క ప్రయోజనమిట్లు తప్పిపోవుటచేతను, యిది రాశిచక్రములోనుండక ప్రక్కగదూరములోనుండుటచేతను దీనిని నక్షత్రవర్గములోనుండి తీసివేసిరి. కనుక మనకిప్పుడు ౨౭ నక్షత్రములేయున్నవి. వసంతవిషువత్ మృగశీర్షలోనికి వచ్చినప్పుడీమార్పు గలిగియుండవచ్చునని మనమూహించవచ్చును.

మూల, జ్యేష్ఠనక్షత్రముల యుత్పత్త్యర్థమునుగూర్చి బెంట్లీపండితుడుచేసిన యూహ మనయూహను మరింత బలపరచుచున్నది. కర్మకాండలోని అభిజిత్ దినముయొక్క స్థానమునుబట్టి అదితి (పునర్వసు) ఒకప్పుడుసంవత్సరారంభదినముగ నుండియుండవలెనని సిద్ధమగుచున్నది. అదితి సరియైన యజ్ఞోపక్రమణ దినముగ కనుగొనెనను పురాతనగాథ కిదియే నిజమైనభావార్థము. అట్లయినచో, అదితి (పునర్వసు) దేవపితృయానముల సరిహద్దులోనుండెనని తాత్పర్యము. అందుచేతనే అదితిదేవి దేవతలకు తల్లియని ఋ X, 72, 5, లో గలదు. ఈ అదితినుండియే ఆదిత్యులు పుట్టిరని ఋ X, 72, 8, శతపథబ్రాహ్మణము III, 1, 3, 2 లలో గలదు. అనగ, యీ అదితినుండియే సూర్యుడు తన (సంవత్సర) ప్రయాణమును ప్రారంభించెనని అర్థము.

ఇంకొక ప్రమాణము. కాలస్వరూపుడైన బ్రహ్మకు మేషము తలయనియు, వృషభము ముఖమనియు......యీరీతిగ బాదరాయణులవారు బ్రహ్మను వర్ణించిరి. [యోవైన క్షత్రీయం ప్రజాపతిం వేద । ఉభయోరేనంలోకయోర్విదుః । హస్తయేవాస్యహస్తః। చిత్రాశిరః। నిష్ట్యాహృదయం। ఊరూ విశాఖే। ప్రతిష్ఠాఽనురాధాః। ఏషవైనక్షత్రీయః ప్రజాపతిః— మేషఃశిరోఽథవదనం వృషభోవిధాతుః వక్షోభవేన్మిథునం హృదయంకులీరః। సింహస్తథోదరమథోయువతిః కటిశ్చ బస్తిస్తులాభృదథ మేహనమష్టమఃస్యాత్॥. ధన్వీచాస్య

ర్యుగం మకరోజానుద్వయంభవతి జంఘాద్వితయంకుంభః
పాదౌమత్స్యద్వయం చేతి॥—

'ప్రజాపతికి చిత్రనక్షత్రము తల; స్వాతి హృదయము; హస్త హస్తము; విశాఖ తొడలు; అనూరాధ పాదము.' ఈ రెండు వర్ణనలును ఒక పోలికగనేయున్నవి. రాసులలోనికెల్ల ప్రథమ రాశియైన మేషము బ్రహ్మకు తలగ నెట్లు వర్ణింపబడెనో—అరీతిగనే, చైత్ర పౌర్ణమితో సంవత్సరమారంభమైనప్పుడు, చిత్రనక్షత్రమును ప్రజాపతియొక్క తలగ వర్ణించుటలో నాశ్చర్యమేమున్నది.? ఈవర్ణనకూడ మనసిద్ధాంతమునకు కొంత చేయూత నొసంగుచున్నది.

ఈప్రమాణములచే చైత్ర పౌర్ణమినాడు హిమసంక్రమణమువద్ద సంవత్సరమారంభమయ్యెనను తైత్తిరీయసంహితావాక్యమునకు మిక్కిలిబలము చేకూరుచున్నది. ఈప్రమాణములు మృగశీర్షనక్షత్రమునుగూర్చి చెప్పిన ప్రమాణములంత బలకరమైనవిగ గాన్పింపకపోయినను, పాశ్చాత్యపండితులుచూపిన ప్రమాణములకంటె వెయ్యిమడుంగు లెక్కువ బలకరమైనవని చెప్పుట కెంతమాత్రమును సందేహము లేదు.

దీనిసిబట్టి అతిప్రాచీన కాలమునాటి ఖగోళజ్ఞనమంతయు కేవలము కర్మకాండాత్మకమై యున్నదనుట నిర్వివాదాంశము. వసంతవిషువత్ అదితిలో (పునర్వసులో) నుండగ అప్పటియార్యులు యజ్ఞయాగాది వత్సరక్రతువులను, వాని-

తోబాటు నూతనవత్సరమును ప్రారంభించెడివారు. చంద్రునివృద్ధిక్షయములు, ఋతుభేదములు, అయనములు—మొదలగు ప్రకృతిలీలలతోడ్పాటుచే వారు తమకర్మకాండకు కావలసిన ముహూర్తకాలాది నిర్ణయముల జేసికొనెడివారు. సూర్యుడు అభిజిన్నక్షత్రములోనికి రాగనే విషువద్దినము (యజ్ఞమధ్యదినము) సమీపించుచున్నదని వారు గ్రహించెడివారు. అటుపిమ్మట కొంతకాలమునకు—విషువద్యొక్కను మృగశీర్షలోనికి రాకపూర్వమే—చాంద్రమానమును, తిథులును బయలుదేరెను. కొంచె మించుమించుగ పంచాంగమంతయు మార్పుజెందెను. నూతనసంవత్సరము చైత్రపౌర్ణమినాడు హిమసంక్రమణమువద్ద ప్రారంభింపబడెను. కాని, కర్మకాండలో మాత్రము విశేషముమార్పులు జరిగినట్లు గాన్పింపవు. అప్పటినుండి కర్మకాండయు, పంచాంగమును వేర్వేరుగనే యున్నట్లు గాన్పించుచున్నది. ఈస్థితి కొద్దిమార్పులతో యిప్పటికిని నిలిచియున్నది.

మనకిప్పుడు లిఖితరూపముగ వేదములయందు పొందుపరుపబడిన ఖగోళాంశ సాధనములచే కాలగర్భములోనికి జొరబడగలిగినంతవరకును జొచ్చిచూచెదముగాక! ఆర్యసభ్యతయందు ప్రథమయుగమునకు "అదితియుగ"మని కాని, 'పునర్వసుయుగ' మని కాని పేర్కొందుము. ఈయుగముయొక్క వ్యాప్తిక్రీ॥ పూ॥ ౬ వేలు మొదలు ౪ వేల వరకు నని నిశ్చయింపబడినది. ఈకాలమందు ఆర్యసంతతులన్నియు కలిసి యున్నవి. అప్పటికింకనుసర్వాంగపరిపూర్ణమైనసూక్తములు

బయలుదేరలేదనియు, గద్య పద్యాత్మకముగనున్న వాక్యములును. వానియందు దేవతలు చేసిన మహోత్కృష్టకార్యములగూర్చిన వర్ణనలుమాత్రమే గలవనియు తెలియుచున్నది. గ్రీకు పారశీక గ్రంథములందు యీ యుగమును గూర్చిన చిహ్నములేమియు గానరావు. బహుశః తదనంతరయుగమందు వారుచీలిపోయినప్పుడు, వారు అప్పటికాలపు పంచాంగమునే తమవెంట గొనిపోయిరేగాని, తత్పూర్వయుగపు పంచాంగమును గొనిపోలేదని దీనివలన నూహింపవలసివచ్చుచున్నది. కాని, హిందార్యులుమాత్రము యీ యతిప్రాచీనకాలమునాటి పంచాంగచిహ్నములను విడిచిపెట్టక మిక్కిలి భక్తితోడను, పట్టుదలతోడను, అవిచ్ఛిన్నముగ తమవాక్పేటికలందు భద్రపరచి యుంచిరి.

ఆర్య సభ్యతయందు ద్వితీయయుగమునకు 'మృగశీర్షా యుగ' మని పేరిడుదము. ఈ యుగవ్యాప్తి క్రీ॥ పూ॥ ౪ వేలు మొదలు ౨౫౦౦ వరకు. ఇది చాల సుప్రసిద్ధమైనయుగము. ఋగ్వేదమునందున్న సూక్తములు చాలవరకు యీయుగమందే బయలువెడలెను. ఈ యుగమందే అనేక గాథలు బయలువెడలెను. తత్పూర్వమందున్న గాథలు మరింత విస్తరింపజేయబడెను. ఈ గాథలను చాల భాగము గ్రీకులు పారశీకులు కూడ భద్రపరచియుంచిరి. కనుక వీరీ మృగశీర్ష యుగముయొక్క చివరభాగమందు [క్రీ॥ పూ॥ ౩౫౦౦—౩౦౦౦] చీలిపోయియుండవలెను. ఆ కారణముచేతనే, తదనంతరము రాబోవు కృత్తికా యుగముయొక్క చిహ్నములు ప్రాచీన వేదమగు ఋగ్వేదమందుగాని, గ్రీకు పారశీక గ్రంథములందుగాని గానరాకున్నవి. దీనిని కొంచెమించుమించుగ సూక్తయుగమని చెప్పవచ్చును.

ఆర్య సభ్యతయందు తృతీయ యుగమునకు 'కృత్తికా యుగ' మని పేరిడుదము. దీనివ్యాప్తి క్రీ॥ పూ॥ ౨౫౦౦ మొదలు ౧౪౦౦ వరకు. ఈయుగమందే తైత్తిరీయ సంహితయు, పెక్కు బ్రాహ్మణములును బయలువెడలినవి. ఇప్పటికప్పుడే ఋగ్వేదసూక్తములు పురాతనములును అగ్రాహ్యములును నైపోయెను. ఆకారణముచే, ఋగ్వేద సూక్తములయొక్కయు, అందున్న గాథలయొక్కయు నిజార్థమును గ్రహింపలేక అప్పటికే బ్రహ్మవాదులు వీనికి తమతమ యిష్టము వచ్చినట్లు అర్థములు చెప్ప మొదలిడిరి. బహుశః యీ కాలమందే సంహితలనన్నిటిని ఒక విధమగు క్రమములోనికి దెచ్చిరని యూహింపవచ్చును. పురాతన సూక్తములకు నిజార్థమును కనుగొనుటకిప్పుడే యత్నములు జరిగియుండవచ్చును. బహుశః యీకాలమందే భారతీయులకును చీనావారికిని సంయోగముగలిగియుండును. ఈకాలమందే చీనావారు మన హిందువుల నక్షత్ర పద్ధతిని నేర్చుకొనిరి.

ఆర్యసభ్యతయందు చతుర్థయుగమునకు ''ప్రాచీనసంస్కృతయుగ'' మని పేరిడుదుము. దీనివ్యాప్తి క్రీ॥ పూ॥ ౧౪౦౦ మొదలు ౫౦౦ వరకు. (అనగ, బౌద్ధయుగమువరకు) ఈయుగమందే సూత్రములును, వేదాంతసిద్ధాంతములును బయలుదేరెను.

[ఈయుగముల వ్యాప్తి విషయమై ఖండితమైన అంకెల నిచ్చుటకు వీలులేదు. పైన చెప్పిన అంకెలు షుమారు 3,౮ వందల సంవత్సరములు అటునిటుగ నుండును. వేలకొలది సంవత్సరములను గూర్చి మాట్లాడుచున్నప్పుడు యీ వందల నొకలెక్కగ పరిగణింపబని లేదు.]

మనమిప్పుడు క్రీ॥ పూ॥ ౬ వేల సంవత్సరములవరకు పోతిమి. ఆకాలమందున్న పంచాంగలక్షణములను మాత్రమే గుర్తించితిమి. ఈలక్షణములు ఆకస్మికముగ ఒక్కనాడే పుట్టియుండవు. ఇందలి జ్ఞానమంతయు కలిగి, యిట్టి పంచాంగ చిహ్నములు బయలు వెడలుటకు యెన్ని సంవత్సరములు పట్టునో చెప్పజాలము. కనుక నిజమాలోచించినచో, ఆర్య సభ్యత యింకను పురాతనమైన దేయని చెప్పవలెను. కాని, గాలిలో మేడలుగట్టిన ప్రయోజనము లేదు, ఊహాప్రపంచమును వదలి, వేదములయందు మనకు గాన్పించుచున్న బలవత్తరమైన ప్రమాణములమీదనే మనసిద్ధాంతమును నిలువబెట్టుదుము. యీరీతిని విచారించినచో, హిందూ పారశీక గ్రీకు గ్రంథములలో నుదాహరింపబడిన గాథలన్నియు మృగశీర్షయుగములో ఋగ్వేదమునందు సూక్తములరూపమున బొందుపరుపబడినవని తెలియుచున్నది. ఈయుగవ్యాప్తి క్రీ॥ పూ॥ ౪౦౦౦—౨౫౦౦॥ శబ్ద సాదృశములనుబట్టి చూచినను హిందూ పారశీక గ్రీకుగ్రంథములలోని దేవతల పేర్లకును వారికృత్యములకును, అత్యంతమైన పోలికగన్పట్టుచున్నది. కనుక యీసూక్తములు ఆయుగములోనే—ఆర్య

సంతతులన్నియు కలిసియున్నప్పుడే—బయలు వెడలియుండవలెను. అయినను మనసిద్ధాంతము కేవలము శబ్దసాదృశములపైగాక, వేదములందు ప్రత్యక్షముగ గాన్పించు కాలసూచకములగు ప్రమాణవాక్యములపై ఆధారపడియున్నది. కనుక, యీపద్ధతి మాక్సుముల్లరు మొదలగు శబ్దశాస్త్రవేత్త లవలంబించిన పద్ధతికంటె వేయిమడుంగులు బలవత్తరమైనదనుట కెంతమాత్రమును సందేహము లేదు. మనచరిత్రలు తప్పినను జ్యోతిర్గోళములు తమగతులను తప్పజాలవు.

ఋతువులు వెనుకబడుటకు కారణము విషువత్ యొక్క చలనమేయని పైనవివరించితిమి. ఈ చలనము బహుసూక్ష్మముగుటచే ఆదియందు మనయార్యులు దీనినిగుర్తింపనిమాట నిజమే కాని, కొంతకాలమునకు ఋతువులు వెనుకబడుచున్నవని ప్రత్యక్షముగ కండ్లకు కాన్పింపగనే వారు గ్రహించిరి. కనుక వారు తమసంవత్సరాదిని అప్పుడప్పుడు మార్చుకొనవలసివచ్చెను. వారీరీతిగ తమ సంవత్సరాదిని పలుమారు మార్చుకొన్నట్లును, తమ పంచాంగములను కూడ తదనుగుణముగ పలుమారు సంస్కరించుకొన్నట్లును నిదర్శనములు గలవు. వానినిప్పుడే పరిశీలించెదము గాక. వారిట్లు తమపంచాంగమును సంస్కరించుకొనుటయేగాక, విషువత్ యొక్క గతినికూడ సరిగ కనుగొనిరి. దీని గతి సంవత్సరమునకు ౫౪ సెకండులు (దూరము) అనిహిందూ జ్యోతిశ్శాస్త్రవేత్తలు కనిపెట్టిరి; ౩౬ సెకండులని గ్రీకులు చె

ప్పిరి. ఈకాలపు శాస్త్రవేత్తలు యంత్రసహాయముచే దీనిగతి సంవత్సరమునకు ౫౦ సెకండులని చెప్పిరి. ప్రాచీనజాతులలోనెల్ల మనభారతీయులే యీసూక్ష్మగతిని యెక్కువ సరిగ కనిపెట్టగలిగిరి! ఇంతటిసూక్ష్మగతిని భారతీయులు, గ్రీకులకంటెకూడ, యెక్కువసరిగ యెట్లుకనిపెట్టగలిగిరో యని విట్నీపండితుడు ఆశ్చర్యపడుచున్నాడు! "అదృష్టవశాత్తు వీరుచేసిన యూహ కాకతాళన్యాయముగ సరిపోయి యుండవచ్చున"ని యాతడు తనమనస్సును సమాధాన పరుచుకొనుచున్నాడు! భారతీయులకు నిజమైన తెలివితేటలున్నవని యొప్పుకొన్నచో తమపాశ్చాత్య ప్రతిభకు తమ సభ్యతయొక్క ఆధిక్యతకు—భంగమువచ్చునేమోయను దురాగ్రహముచే యాతడిట్లు పలుకుచున్నాడు.

విషువత్యొక్క చలనమున కనుగుణముగ మనవారెట్లు పంచాంగమును సంస్కరించుకొనుచువచ్చిరో విచారింతము.

I [మృగశీర్షనుండి—రోహిణికి] కాలాధిష్ఠాన దేవతయైన రోహిణివైపునకు జరుగుటచే రుద్రుడు ప్రజాపతిని చంపెను. ప్రజాపతియొక్క యీచర్య అసాధారణమైనదని (అకృత) తై॥ బ్రా॥ III, 33 లో గలదు. కనుక, యీచర్యకు దేవతలందరిచేతను తీవ్రముగ ఖండింపదగియున్నదట. దీనిభావార్థమేమి? అనగ, విషువత్ మృగశీర్షలోనుండి క్రమక్రమముగ—మెల్లగ—రోహిణిలోనికి జరుగుచుండెనని తాత్పర్యము. ఈచలనమును వారిది వరకెన్నడును గుర్తించలేదు. విషువత్

యొక్క చలనమును ఆర్యులు గుర్తించుటకిదియే ప్రథమ పర్యాయము. కనుక, వారికిది యెంతయో ఆశ్చర్యమును కలుగజేసెననుటలో సందేహము లేదు. ఆకారణముచేతనే ప్రజాపతియొక్క యీచర్య అసాధారణమైనదని (అకృత) ఐతరేయ బ్రాహ్మణము వర్ణించినది. అటుగాక సూర్యుడు క్రమక్రమముగ రోహిణిమీదికి యెక్కివచ్చుచుండుటచే ఆ నక్షత్రమునకు "రోహిణి" (యెక్కబడుచున్న) అను పేరు వచ్చినదని చెప్పవచ్చును. కనుక, యీగాథ మృగశీర్షయుగములో విషువత్ మృగశీర్షనక్షత్రమును దాటి రోహిణివైపునకు వచ్చుచుండగ పుట్టియుండవలెను. ఈయుగములో ఫాల్గుణ పౌర్ణమి సంవత్సరాదిగ నుండెను.

II [రోహిణినుండి—కృత్తికకు] విషువత్ కృత్తికలోనికి రాగనే ఋతువులు సరిగ ఒక్కమాసము వెనుకబడుటచే అప్పటివారు తమ సంవత్సరాదిని ఫాల్గుణ పౌర్ణమినుండి మాఘ పౌర్ణమికి మార్చిరి. నక్షత్రములనుకూడ తదనుసారముగ మృగశీర్ష (అగ్రయన) నుండి లెక్కించుట మానివేసి కృత్తికలనుండి లెక్కింప మొదలిడిరి.

III [కృత్తికనుండి—భరణికి] ఇక్కడనుండి మూడవమెట్టు వేదాంగ జ్యోతిష కాలము. (అనగ ధనిష్ఠా నక్షత్రము హిమసంక్రమణము వద్దనున్నప్పుడు) ఇప్పుడు ఋతువులు ఒక పక్షము (౧౫ రోజులు) వెనుకబడెను. కనుక సంవత్సరాదిని మాఘ పౌర్ణమినుండి మాఘ శుద్ధ పాడ్యమికి మార్చు

కొనిరి. [బహుళః ప్రతినెలయు శుద్ధ పాడ్యమినుండి ప్రారంభమగుటకిదియే కారణమైయుండును.]

IV [భరణినుండి—అశ్వనికి] ఇక్కడనుండి మనకు లిఖిత పూర్వకముగనున్న మార్పు ఒక్కటేగలదు. అనగ, విషువత్ కృత్తికలలోనుండి అశ్వనీలోనికి వచ్చినప్పుడు, ఒకప్పుడు ఋతువులు ౧౫ దినములు వెనుకబడుటచే ఒక సిద్ధాంతి పంచాంగమును తదనుసారముగ సంస్కరింపదలచెను. కాని, ఆ ప్రయత్నము వ్యర్థమయ్యెను. ఈ ప్రయత్నమును సూచించు కథయొకటి భరతఖండమందు గలదు. [మహాభారతము: ఆదిపర్వము; 71, 34:—చకారాన్యంచలోకం వైకృద్ధో నక్షత్రసంపదా । ప్రతిశ్రవణపూర్వాణి నక్షత్రాణిచకారసః॥]—

అశ్వమేధపర్వము: 44: 2:—అహఃపూర్వం తతో రాత్రిః మాసాః శుక్లాదయః స్మృతాః । శ్రవణాదీని ఋక్షాణి ఋతవః శిశిరాదయః॥]

„విశ్వామిత్రుడు క్రొత్తప్రపంచమును సృష్టింపదలంచెను; నక్షత్రములను ధనిష్ఠకు బదులు శ్రవణనక్షత్రముతో ప్రారంభింపదలంచెన"ట. ఇట్టికథయే అశ్వమేధపర్వములోను, పురాణములలోను గలదు. కాని, యీయత్నము సాగలేదు. కనుక, వేదాంగజ్యోతిష కాలమునాటి పద్ధతి అశ్వనీ కాలమునాటి వరకట్లే నిల్చియుండెను.

V. వరాహమిహిరుని సంస్కరణము; ఇక యిప్పుడు చేయవలసినమార్పు. పిమ్మట క్రీస్తు శకానంతరము ౫. వ శతాబ్దములో వరాహమిహిరుడువచ్చి యీ అశ్వనీపద్ధతిని నెలకొల్పెను. సంవత్సరాదిని మరల హిమసంక్రమణమునుండిమార్చి ఆదిస్థానమైన వసంతవిషువత్ వద్దకుచేర్చెను. యీ పద్ధతి యీరోజువరకు అమలులోనున్నది. ఈ పద్ధతిపుట్టి యిప్పటికి షుమారు ౧౫౦౦ సంవత్సరముల పైగాఅయినది. యిప్పుడు విషువత్ రేవతినికూడ దాటిపోయినది.*

ఈప్రకారము, అవిచ్ఛిన్నముగ ప్రాచీనకాలమునుండి నేటివరకు పంచాంగములు విషువత్ చలనమున కనుగుణముగ అప్పుడప్పుడు సంస్కరింపబడుచు వచ్చినవని చెప్పుటకు ప్రబలమైన ప్రమాణములుగలవు.

ఆర్య సంతతులుకలిసి యున్నప్పుడే వేదములుపుట్టినవని పాశ్చాత్యులు ఒప్పుకొనియున్నారు. కాని, విషువత్ మృగశీర్షలోనున్నప్పుడే ఆర్యసంతతులుకలిసి యుండిరను సంగతిని మాత్రము వారుగుర్తించలేదు. ఈయంశమును వారు గుర్తించి యుండినచో వారు వేదకాలము క్రీ॥ పూ॥ ౨౫౦౦ సంవత్సరములేయని చెప్పియుండరు. మనలెక్క ప్రకారము వే

* కనుక, మనయిప్పటిపంచాంగములను సంస్కరింపవలసిన అవసరమెంతేనిగలదు. మనసంవత్సరాదిని షుమారు ౨౦ రోజులు వెనుకకు నెట్టవలెను. దీనిని మనసిద్ధాంతులు గమనింతురుగాక—మానికొండ సత్యనారాయణశాస్త్రి, అనువాదకుడు]

దకాలము యెంతతక్కువగ జూచినను క్రీ॥ పూ॥ ౪౦౦౦ సంవత్సరములపై మాటయేగాని తక్కువగాదని తేలుచున్నది.

ఇక మన భారతీయులలో చాలమంది పండితులు వేదకాలము 'అనాది' యని తలంచుచున్నారు. అనగ, వీనికి 'ఆది' యేలేదనియు, ప్రపంచము పుట్టుకతోడనే యివి పుట్టినవనియు మనవారు తలంచుచున్నారు. భగవంతుని ముఖమునుండి వచ్చిన మాటలు "అనాది" గ నుండనక్కరలేదు. భగవంతుడు యేదోయొక కాలమున యీ వేదములను ప్రవర్తింపజేసియుండవచ్చును. కనుక వీనికి 'ఆది' యుండవచ్చును. ఉదాహరణముః—క్రైస్తవుల బైబిలును, మహమ్మదీయుల కొరానును భగవద్వాక్యములే. ఇవి ఒకానొక కాలమున భగవంతుని ముఖమునుండి యుద్భవిల్లినవని ఆ మతములవారు తలంచుచున్నారు. కనుక, వీనికి 'ఆది' గలదు. ఈ రీతిగనే, వేదములకుకూడ 'ఆది' యుండుటలో ఆశ్చర్యము లేదు—అసంభవముకాదు. వేదములు భగవంతుని ముఖమునుండివచ్చిన వన్నంతమాత్రముచేత, వానికి 'ఆది' యుండదని సిద్ధింపజాలదు.* వేదముల యుత్పత్తికాలము బహు ప్రాచీనమగుటచే—యిప్పటికి షుమారు 7, 8 వేల సంవత్సర

* ఈ అభిప్రాయములలో కొలది మార్పులను తిలక్‌గారు చేసియున్నారు. వీరు రచించిన "ఆర్యుల ఉత్తర ధృవనివాసము" ను గ్రంథము యొక్క చివరి అధ్యాయమును చూడదగును.

మా. స. నా. శాస్త్రి—అనువాదకుడు.

ములగుటచే—వేదములను 'అనాది' యని అలంకారమాత్రముగ చెప్పిన చెప్పవచ్చును. వేదములు అతివిరివిగ ప్రబలిన కాలము యిప్పటికి ఆరువేల సంవత్సరములకు తక్కువగాదని యీ గ్రంథమందు నిరూపించితిమి.

వేదకాలమునింకను కాలగర్భములోనికి గొనిపోవుటకు నిదర్శనములున్నవి. కాని, అప్పటికాలస్థితి మనకు అగమ్యమగుటచే, వేదములకు 'ఆది' యేలేదను నభిప్రాయము మనలో ప్రబలినది. కనుక, వేదకాలమును క్రీ॥ పూ॥ ౪౦౦౦ సంవత్సరములకు తక్కువగాదని చెప్పినచో పాశ్చాత్య పౌరస్త్య పండితుల యభిప్రాయములకు కొంతవరకు సరిపోవుచున్నదని చెప్పవచ్చును. ఈ రీతిని, కర్మసూత్రానుసారముగ నియమితపథమందు తిరుగుచున్న జ్యోతిర్గోళముల చంద్రాదుల ఆధారముచే వేదకాలమును నిర్ణయించుటకు మనము కొంత పరిశోధనచేసితిమి. పండితలోకమీ పరిశోధనను మరింత యెక్కువగజేసి, ప్రపంచవిజ్ఞానాభివృద్ధికి తోడ్పడుదురుగాక.—

ఓం శాంతిః, శాంతిః, శాంతిః.

ఓం తత్ సత్ బ్రహ్మార్పణమస్తు.

సంపూర్ణము.

అనుబంధము

ఋగ్వేదము: పదవ మండలము.

వృషాకపిసూక్తము.

వీహిసోతో రసృక్షత నేంద్రం దేవమమంసత । యత్రామ
దద్వృషాకపిరర్యః పుష్టేషుమత్సఖావిశ్వస్మాదింద్రఉత్తరః॥౧
పరాహీంద్రధావసి వృషాకపేరతివ్యథిః । నోఅహప్రవిం
దస్యన్యత్రసోమపీతయేవిశ్వం॥౨
కిమయంత్వాం వృషాకపిశ్చకారహరితోమృగః । యస్మా
ఇరస్యసీదున్వర్యోవాపుష్టిమద్వసువిశ్వం॥3
యమిమంత్వంవృషాకపిం ప్రియమింద్రాభిరక్షసి । శ్వాన్వ
స్యజంభిషదపికర్ణేవరాహయుర్విశ్వం॥౪
ప్రియాతష్టాని మేకపిర్వ్యక్తావ్యదూదుషత్ । శిరోన్వస్య
రావిషంనసుగందుష్కృతేభువంవిశ్వం॥౫
నమత్స్త్రీసుభసత్తరానసుయాశుతరాభువత్ । నమత్ప్రతిచ్య
వీయసీనసక్థ్యుద్యమీయసీవిశ్వం॥౬
ఉవేఅంబసులాభికేయథేవాంగభవిష్యతి । భసన్మేఅంబసక్థి
మేశిరోమే వీవహృష్యతివిశ్వం॥౭
కింసుబాహోస్వంగురేపృథుష్టోపృథుజాఘనే । కింశూరప
త్ని నస్త్వమభ్యమీషి వృషాకపింవిశ్వం॥౮
అవీరామివమామయం శరారురభిమన్యతే । ఉతాహమ
స్మి వీరిణీంద్రపత్నీమరుత్సఖావిశ్వం॥౯
సంహోత్రంస్మపురానారీసమనంవావగచ్ఛతి । వేధాఋ
తస్యవీరిణీంద్రపత్నీమహీయతేవిశ్వం॥౧౦
ఇంద్రాణీమాసునారిషుసుభగామహమశ్రవం । నహ్యస్యా
అపరంచనజరసామరతేపతిర్విశ్వం॥౧౧
నాహమింద్రాణిరారణసఖ్యుర్వృషాకపేర్ఋతే । యస్యే

వృషాకపాయి రేవతిసుపుత్రఆదుసుస్నుషే । ఘసత్తఇంద్ర ఉక్షణఃప్రియంకాచిత్కరంహవిర్విశ్వం॥౧౩

ఉక్ష్ణో హిమేపంచదశ సాకంపచన్తి వింశతిం । ఉతాహమద్మి పీవఇదుభాకుక్షీ పృణంతి మేవిశ్వం॥౧౪

వృషభోనతిగ్మశృంగోన్తర్యూథేషు రోరువత్। మంథస్త ఇంద్రశం హృదేయంతే సునోతిభావ యుర్విశ్వం॥౧౫

నశేషే యస్యరంబతేంతరా సక్థ్యా కపృత్ । సేదీశే యశ్యరోమశం నిషేదుషో విజృంభతే విశ్వం ॥౧౬

నసేశే యశ్యరోమశం నేషేదుషో విజృంభతే । సేదీశే యశ్యరం బతేంతరా సక్థ్యాకపృద్విశ్వం ॥౧౭

అయమింద్ర వృషాకపిః పరస్వంతం హతంవిదత్ । అసిం సూనం నవంచరూమా దేధస్యాన ఆచితం విశ్వం ॥౧౮

అయమేమి విచాకశద్వి చిన్వన్దాసమార్యం । పిబామిపాకసుత్వనోభి ధీరమచాకశంవిశ్వం॥౧౯

ధన్వచయత్కృంతత్రం చకతిస్విత్తావియోజనా । నేదీయసోవృషాకపేస్తమే హిగృహాఉపవిశ్వం॥౨౦

పునరేహి వృషాకపేసువితా కల్పయావహై । యఏష స్వప్నసంశనో స్తమేషి పథాపునర్విశ్వం॥౨౧

యదుదంచో వృషాకపే గృహమింద్రాజగంతన। క్వస్య పుల్వఘో మృగఃకమరజ్జనయోపనోవిశ్వం॥ ౨౨


పర్శుర్హనామమానవీ సాంకససూవవింశతిం । భద్రంభల త్యస్యా అభూద్యస్య ఉదరమామయద్విశ్వం॥౨౩

సవరణ.

122. పేజీ, చివరపంక్తి: 'సూర్యుడు' అనుటకు బదులు 'మృగము' అని చదువుకొనవలెను

138. పేజీ: 15వ. పంక్తి: 'దేవతయైన రోహిణి వైపునకు' అను

అనుబంధము: (మృగశీర్ష)



[విషువత్ చలనము 72 సంవత్సరముల కొకడిగ్రీ చొప్పున యనుకొన్నచో పైనసూచించిన కాలనిర్ణయము సిద్ధించుచున్నది. గ్రంథములో చెప్పినకాలములకును, వీనికిని విశేషభేదములేమి గుర్తింపఁగును.]

1409

END OF
TITLE